veluturu telugu daily
వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి నల్గొండ | సోమవారం 12.10.2026
సంపుటి : 9 | సంచిక : 120
www. veluturu.com

'మహాశక్తి' నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం
- పూలతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు
- ధ్వజారోహణ మహోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్

12

'షీ పవర్' మహిళా భద్రత బైక్ ర్యాలీ

- జెండా ఊపి ప్రారంభించిన మంత్రులు జూపల్లి, పొన్నం
- మహిళల భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: జూపల్లి
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ప్రయాణ స్వేచ్ఛ
- మహిళల భద్రత, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి పొన్నం ప్రభాకర్
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

12

భారత్-జపాన్ స్నేహ బంధం దీర్ఘకాలికం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- హైదరాబాద్‌లో జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమం
- పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి వివేక్

12

ఇది సమృద్ధి భారత్

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్ | 25 నగరాలకు మెట్రో సేవలు

దేశాభివృద్ధనే మంత్రంగా తీసుకొని ముందుకు సాగుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్ మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2014 నుంచి మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని కొనియాడారు. రక్షణ పరికరాల తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. 12 ఏళ్లలో అనేక రంగాల్లో మార్పులు తెచ్చినట్లు చెప్పారు. తయారీ రంగంలో వృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని వివరించారు. తమిళనాడు అభివృద్ధికి అండగా ఉండటంతో పాటు విజయ్ ప్రభుత్వానికి చేయూత అందిస్తామన్నారు. చెన్నైలో రూ.13 వేల కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2014లో 5 నగరాలకే పరిమితమైన మెట్రో రైలు సేవలు ఇప్పుడు 25 నగరాలకు విస్తరించాయని గుర్తు చేశారు. ప్రభుత్వ అధినేతగా తన 25 ఏళ్ల సుదీర్ఘ సేవాకాలాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు.

- తమిళనాడు పర్యటనలో భాగంగా 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- తమిళనాడు సీఎంతో కలిసి ప్రధాని ప్రయాణం
- ఐఐటీ మద్రాస్‌లో బ్రెయిన్ సెంటర్ జాతికి అంకితం

చెన్నై, వెలుతురు:

పార్టీలకు అతీతంగా తమిళనాడు నాయకత్వంతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. సంవత్సరాలు గడిచినా, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తన నిబద్ధత స్థిరంగా ఉందన్నారు. "ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరుణానిధి, జయలలితతో మాట్లాడే అవకాశాలు చాలాసార్లు నాకు లభించాయి. నేను ప్రధానమంత్రి అయిన తర్వాత జయలలిత, పన్నీర్‌సెల్వం, పళనిస్వామి, ఎం.కె. స్టాలిన్‌లతో కలిసి పనిచేసే అవకాశం దక్కింది. ప్రభుత్వాలు మారినప్పటికీ, తమిళనాడును అభివృద్ధి చేయాలనే, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే నా సంకల్పం మాత్రం అలాగే ఉంది. ఇప్పుడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌తో కలిసి ఈ ప్రయాణాన్ని ముందుకు సాగిస్తున్నాం."అని అన్నారు. - మిగతా 11 లో..

బోటు బోల్తా పడి 109 మంది మృతి

ఆఫ్రికా దేశం జిబౌటీలో ఘటన.. మృతుల్లో 15 మంది చిన్నారులు

జిబౌటీ(ఆఫ్రికా), వెలుతురు:

ఆఫ్రికా దేశం జిబౌటీ సముద్ర తీరంలో ఓ బోటు బోల్తా పడి 109 మంది మృతి చెందారని అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) తెలిపింది. అందులో 15 మంది చిన్నారులు, 42 మంది మహిళలు, 52 మంది పురుషులు ఉన్నారని పేర్కొంది. మరో 116 మంది గల్లంతు అయ్యారని, వారి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపింది. 305 మంది వలసదారులతో జిబౌటీ నుంచి యెమన్‌కు వెళ్తున్న బోటు గురువారం రాత్రి ఒబాక్ రేవు పట్టణం సమీపంలో బోల్తా పడిందని ఐఓఎం చెప్పింది. ఈ ప్రమాదం నుంచి సుమారు 80 మంది ఇథియోపియా పౌరులను రక్షించినట్లు పేర్కొంది. మరోవైపు స్థానిక అధికారులు ఈ బోటు యాక్సిడెంట్లో మరణించిన వారి అంత్యక్రియల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

జీవనోపాధి కోసం వెళ్లి- మృత్యు తీరాలకు

సాధారణంగా 'హార్న్ ఆఫ్ ఆఫ్రికా' నుంచి వేల మంది వలసదారులు జీవనోపాధి కోసం, భద్రత కోసం జిబౌటీ మీదుగా బాబ్ ఎల్-మండేబ్ జలసంధిని దాటి గల్ఫ్ దేశాలకు ప్రయాణిస్తుంటారని ఐఓఎం చెప్పింది. వాస్తవానికి యెమెన్లో హింస కొనసాగుతున్నప్పటికీ ఈ వలసలు ఆగడం లేదని పేర్కొంది. "ఇది అత్యంత ఘోరం. జీవనోపాధి కోసం వలసదారులు ఎదుర్కొంటున్న ప్రమాదాలకు ఈ విషాధం ఒక స్పష్టమైన గుర్తు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన బంధువులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని జిబౌటీలోని ఐఓఎం చీఫ్ ఆఫ్ - మిగతా 11 లో..

ఎల్‌నినో ప్రభావం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రైతులు రెండో పంట వేసి ఇబ్బంది పడొద్దు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
- కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

2 లో

11

వేగంగా... క్షేమంగా...

కేబీఆర్ పార్క్ చుట్టూ విజయవంతమైన వన్ వే

మరింత సజావుగా వాహనాలు పరుగెత్తేలా వసతుల కల్పన
చురుగ్గా సాగుతున్న జంక్షన్ల విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం
విలువైన స్థలాలు ఇచ్చిన బాలకృష్ణ, శబ్దాలయా స్టూడియో, భవ్య కన్‌స్ట్రక్షన్స్

ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్య హక్కులు.. తెలంగాణలో బీజేపీకి నిర్బంధాలా?

అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒక రకంగా.. అధికారంలో లేనిచోట మరో రకంగా వ్యవహరించడమే కాంగ్రెస్ మార్క్ ప్రజాస్వామ్యమా?

- ప్రజాస్వామ్యాన్ని అడ్డుపెట్టుకుని విధ్వంస రాజకీయాలు చేస్తూ..
- 'నిర్బంధ ప్రజాస్వామ్యం' అని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఖర్గే మాట్లాడటం సిగ్గుచేటు
- ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ అత్యంత దుర్మార్గంగా 'ప్రజాస్వామ్యన్ని ఖూనీ' చేసింది
- ఇవాళ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతోంది
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2

తేదీ, సమయం చెప్పండి..

ఓటు హక్కు కోల్పోయిన వారందరినీ తీసుకొస్తా..

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావుకి మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్ల తొలగింపుపై సమాధానం చెప్పాలి
- ఓటు బచావో - దేశ్ బచావో - ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ వెలుతురు:

తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు గారు ఓటర్ల జాబితా సవరణలో ఏవైనా తప్పులు జరిగితే వాటిని సరిదిద్దుకుందామని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు బీజేపీ కార్యకర్తలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిస్తే ప్రజాస్వామ్యానికి మేలు జరిగేది. కానీ ఓటర్ల జాబితా సవరణపై జరుగుతున్న ఆందోళనలను తప్పుబడుతూ, ఓటు హక్కు కోల్పోయిన వారు ఎవరైనా ఉన్నారా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ప్రశ్నించడం సరికాదు.

సర్‌పై తప్పుడు ఆరోపణలు తిప్పి కొట్టాలి అంటున్నారు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకి నా సవాలు.. మీరు తేదీ, సమయం చెప్పండి. పోలీస్ ఫోర్స్ పెట్టుకొని అరెస్టులు చేయించడం కాదు.. ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందుతున్న బాధితులను, వారి ఆధారాలతో సహా మీ ముందుకు తీసుకొస్తాను. రాంచందర్ రావు మా సవాల్‌ను స్వీకరించి తేదీ, సమయం ప్రకటించాలి. ఓటు హక్కు కోల్పోయిన బాధితులను మీ ముందుకు తీసుకొస్తాం. ఎన్నికల సంఘం రికార్డులను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఓటర్ల జాబితాలో జరిగిన తొలగింపులపై ఎన్నికల రికార్డులను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వివరించండి. నా ఓటుతో సహా, నా తండ్రి పేరు సత్తయ్య, సత్యనారాయణ గౌడ్ - మిగతా 2 లో..

డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

- పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్
- డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌పై ఈగల్, హైదరాబాద్ పోలీసులు సంయుక్త ఆపరేషన్

గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు అనుమానిస్తున్న నెట్‌వర్క్‌పై తెలంగాణ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈగల్ బృందం, హైదరాబాద్ సిటీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, పరారీలో ఉన్న నిందితుడు కస్టోడియో ఫెర్నాండెస్ అలియాస్ క్రిస్టీని గోవాలో అరెస్టు చేశారు.

- మిగతా 11 లో..

నైపుణ్యంతో కొలువుల బాట!

సింగరేణి ఆర్జీ-1 నైపుణ్య శిక్షణ కేంద్రం నుంచి 112 మంది ఉద్యోగాలకు ఎంపిక

- ఫాక్స్ ఖాన్ లో 87 మంది మహిళలకు అవకాశం
- తొలి విడతలో బయలుదేరిన 55 మంది మహిళలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11

సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. రామగుండం-1 ఏరియాలోని సింగరేణి జీవీటీసీ - మిగతా 2 లో..

తేదీ, సమయం చెప్పండి..

(మొదటిపేజీ తరువాయి)

వంటి పేర్లలో ఉన్న వ్యత్యాసాలను సాకుగా చూపి నేను ఆధారాలు చూపేకపోతే నా ఓటు తొలగించే ప్రయత్నం జరిగింది..

అర్హులైన వారి ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగితే వాటిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులకు, ఎన్నికల వ్యవస్థకు ఉంది. ఇలాంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలి. దేశ వ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు పోయాయి.. రాష్ట్ర రాజధాని లోనే 40 లక్షల ఓట్లు కోల్పోయాయి.. రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల ఓట్లు సవరణ పేరుతో తొలగి పోయాయి.. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదు.

ఓటర్ల జాబితా సవరణ అనేది పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా చూడటం ఎన్నికల సంఘం బాధ్యత. దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించబడుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఎన్ని ఓట్లు తొలగించారు? వాటిలో అనర్హులైనవారి ఓట్లు ఎన్ని? అర్హులైనవారి ఓట్లు పొరపాటున తొలగించబడ్డాయా? అనే అంశాలపై స్పష్టమైన వివరాలు వెల్లడించాలి.

ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఓట్లు తొలగించబడ్డాయి.. పేదలు, వృద్ధులు, నిరక్షరాస్యులు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి వచ్చింది. ఆధార్ వంటి గుర్తింపు పత్రాలు ఉన్నప్పటికీ ఇతర ఆధారాలు సమర్పించాలని కోరితే, సాధారణ ప్రజలు తమ హక్కును ఎలా కాపాడుకోవాలో ఎన్నికల సంఘం స్పష్టంగా తెలియజేయాలి.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఉదంతమే ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. ఓటరు తన గుర్తింపును నిరూపించుకోవడానికి, అవసరమైన పత్రాలను సమర్పించడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటి? మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్వయంగా ఒక ఇంటర్వ్యూలో అన్నారు.. ఓటరు నమోదు, ఆధారాల సమర్పణ అంశంపై వచ్చిన ఇంటర్వ్యూ వివరాలను కూడా పరిశీలించాలి. సామాన్య ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తేలికగా తీసుకోకూడదు.

ఓటు హక్కు అనేది కేవలం ఒక గుర్తింపు కాదు. అది రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే వాటిని సరిదిద్దాలి. కానీ ఆ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కు తొలగిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలి. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజలు ప్రశ్నిస్తే వారిని కించపరిచే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం నిలబడాలి. అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదన్నదే మా డిమాండ్. ఓటు తొలగినవద్దని ఉద్యమం చేస్తున్న వారిని అవమానించడం తగదు..

ఎనభై ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరం. అందుకే "ఓటు బచావో – దేశ్ బచావో – ప్రజాస్వామ్యాన్ని కాపాడండి–రాజ్యాంగాన్ని కాపాడండి" అనే నినాదంతో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడింది.

ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్య హక్కులు..

తెలంగాణలో బీజేపీకి నిర్బంధాలా?

అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒక రకంగా.. అధికారంలో లేనిచోట మరో రకంగా వ్యవహరించడమే కాంగ్రెస్ మార్క్ ప్రజాస్వామ్యమా?

- ప్రజాస్వామ్యాన్ని అడ్డుపెట్టుకుని విధ్వంస రాజకీయాలు చేస్తూ..
- 'నిర్బంధ ప్రజాస్వామ్యం' అని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఖర్గే మాట్లాడటం సిగ్గుచేటు
- ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ అత్యంత దుర్మార్గంగా 'ప్రజాస్వామ్యన్ని ఖూనీ' చేసింది
- అలాంటి పార్టీ ఇవాళ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతోంది
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు 11 అక్టోబర్, 2026:

రాజ్యాంగాన్ని కాపాడతామని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని, ప్రతిపక్షాల గొంతుకను గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ పదేపదే చెబుతోంది. కానీ ఢిల్లీలో ఆ పార్టీ చెబుతున్న మాటలకు, తెలంగాణలో వారి ప్రభుత్వం చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ రెండు నాల్కల ధోరణికి ఢిల్లీలో, హైదరాబాద్‌లో జరుగుతున్న తాజా పరిణామాలే ప్రత్యక్ష సాక్ష్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

గత 3,4 రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనల కారణంగా.. ప్రజలకు అసౌకర్యం కలిగినా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినా.. వారికి నిరసన తెలిపే అవకాశాన్ని అనేకసార్లు ఢిల్లీ పోలీసులు కల్పించారు. ప్రియాంక గాంధీ రోడ్డుపై పడుకున్నా, బారికేడ్లపైకి ఎక్కి జుగుప్సాకరంగా రాహుల్ వ్యవహరించినా.. వారి భావప్రకటన స్వేచ్ఛను పోలీసులు, ప్రభుత్వం గౌరవించాయి.

రాహుల్ గాంధీ దేశమంతా స్వేచ్ఛగా తిరుగుతూ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపైన, కేంద్ర ప్రభుత్వంపైన తప్పుడు ఆరోపణలు, పచ్చి అబద్ధాలతో తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, భారత సైన్యం వంటి సంస్థలపైనా ఆరోపణలు చేస్తున్నారు. వారు అబద్ధాలు ప్రచారం చేసినా.. రాజకీయంగా ఆయన మాట్లాడే హక్కును అడ్డుకోవాలని మా ప్రభుత్వం ఏనాడూ ప్రయత్నించలేదు.

అంతేకాదు, రెండ్రోజుల క్రితం హైదరాబాద్ లోనూ కాంగ్రెస్ నాయకులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించి, లోక్ భవన్ ముందు బైఠాయించారు. రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు నిరసనలు చేపట్టేందుకు శాంతిభద్రతలు అడ్డురావా? మరి ఢిల్లీలో కాంగ్రెస్‌కు కావాల్సిన ప్రజాస్వామ్య హక్కులు.. తెలంగాణలో బీజేపీకి ఎందుకు ఉండకూడదు? బీజేపీ నాయకులు ప్రజల సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే మాత్రం తెలంగాణ ప్రభుత్వానికి శాంతిభద్రతల సమస్యలన్నీ గుర్తుకొస్తాయా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం?

తెలంగాణలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినా.. కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోవడం లేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సహా బీజేపీ నేతలను ఎక్కడికక్కడ అనేకసార్లు గృహనిర్బంధం చేస్తూ.. గొంతు నొక్కేస్తోంది. ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను పరామర్శించేందుకు వెళ్లే ప్రయత్నం చేసినా వందలాది మందిని.. బీజేపీ నాయకులను ఇళ్ల నుంచి బయటకు రానివ్వడం లేదు.

10 మే, 2026 నాడు.. కానిస్టేబుల్ నియామకాలపై ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తే.. రాష్ట్ర అధ్యక్షుడిని ఇంటిదగ్గరే నిర్బంధించారు.

- 25 మే2026 నుంచి 28మే వరకు.. 'రైతుగోస–బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని నిర్వహిస్తే.. అడుగడుగునా.. వాహనాలను చెక్ చేస్తూ.. కావాలని ఆలస్యం చేస్తూ ఇబ్బంది పెట్టారు.
- 19 జూన్ 2026 నాడు సింగరేణి భరోసా యాత్రకు వెళ్తున్న బీజేపీ శాసనసభ పక్ష నేతను, ఎమ్మెల్సీని అడ్డుకున్నారు.
- 22 జూలై, 2026 నాడు.. చలో గాంధీ భవన్ యాత్రకు పిలుపునిస్తే.. బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయాన్నే దిగ్బంధనం చేశారు.
- ఆగస్టు 24–25మధ్యలో.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని 48 గంటల పాటు 'ఫీజుల బకాయి బీజేపీ లడాయి' కార్యక్రమం నిర్వహిస్తామనంటే.. ధర్నాచౌక్ లో అనుమతి ఇవ్వలేదు. దీంతో బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిరసన చేపట్టాల్సి వచ్చింది.
- 27 ఆగస్టు నాడు.. రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులను కలవడానికి వెళ్తే.. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని గృహనిర్బంధం చేశారు. ఇతర నాయకులను కూడా అరెస్టు చేశారు.
- 1 సెప్టెంబర్ 2026 నాడు నల్గొండ జిల్లా అధ్యక్షుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ.. ఆయన్ను పరామర్శించేందుకు వెళ్తామన్నా.. అధ్యక్షుడు సహా ముఖ్యనేతలందరినీ హౌజ్ అరెస్టు చేశారు.
- 3 సెప్టెంబర్ 2026 నాడు 8 లక్షల మంది విద్యార్థుల సంతకాలతో రిప్రెజెంటేషన్ ఇద్దామని సెక్రటేరియట్ వెళ్తే.. కనీసం అధికారుల అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. పార్టీ నాయకులను అరెస్టు చేశారు.
- సెప్టెంబర్ 5–6 తేదీల్లో సెక్షన్ 22ఎ, భూభారతి నుంచి భూరికార్డుల తొలగింపుపై మహా ధర్నాకు పిలుపునిస్తే.. అనేక ఆంక్షల నడుమ చివరకు ధర్నా నిర్వహించాల్సి వచ్చింది.
- 7 సెప్టెంబర్ నాడు.. చలో అసెంబ్లీకి పిలుపునిస్తే.. మొదట డీసీపీ స్థాయి అధికారితో.. అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి తర్వాత తిరస్కరించారు. ధర్నాకు వచ్చిన నాయకులు, కార్తకర్తలను అరెస్టు చేశారు.

ఇలాంటి ఎన్నో నిర్బంధాలను తెలంగాణలో బీజేపీ విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేసింది. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తెలంగాణకు వచ్చి ఎన్నో హామీలిచ్చారు. ఇప్పుడు ఆ హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తుంటే, వారి తరఫున గొంతెత్తుతున్న బీజేపీ నాయకులపై నిర్బంధం విధిస్తూ అడ్డుకుంటున్నారు.

ఇచ్చిన గ్యారంటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉద్యోగుల సమస్యలు, ప్రజాసంక్షేమ పథకాల అమలుపై మీ వైఫల్యాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షంగా మా బాధ్యత. ఢిల్లీలో మీకు వర్తించే ప్రజాస్వామ్య హక్కులు తెలంగాణలో మీ రాష్ట్ర ప్రభుత్వంలో అమలు చేయరు. తెలంగాణలో ఒకనీతి, ఢిల్లీలో మరోనీతి అన్నట్లు ద్వంద్వ నీతితో వ్యవహరిస్తున్నారు.

రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా... మీరు ఢిల్లీలో కోరుకుంటున్న ప్రజాస్వామ్య స్వేచ్ఛనే తెలంగాణలో ప్రజలు కోరుకుంటున్నారు. మీకు 'ఢిల్లీలో ఒక న్యాయం.. తెలంగాణ ప్రజలకు మరో న్యాయం' ఎలా సమర్థించుకుంటారు?

కాంగ్రెస్ పార్టీ తరచూ 'మొహబ్బత్ కీ దుకాన్' గురించి మాట్లాడుతోంది. కానీ తాము అధికారంలో ఉన్న చోట రాజకీయ ప్రత్యర్థులపై నిర్బంధాలు విధించడం ఏ విధమైన మొహబ్బత్ అవుతుందో రాహుల్, ప్రియాంక, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివరించగలరా?

ఇవాళ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గారు భారతదేశ ప్రజాస్వామ్యాన్ని 'ఇది మదర్ ఆఫ్ డెమొక్రసీ కాదు. మజిల్డ్ డెమోక్రసీ (నిర్బంధ ప్రజాస్వామ్యం)' అని సంబోధిస్తూ ట్వీట్ చేశారు. అధికారాన్ని అందుకోలేక పోతున్నామని ఆవేదనతో, ప్రజలు ఆదరించడం లేదనే ఆక్రోషంతో మల్లికార్జున ఖర్గే.. ఏకంగా ప్రజాస్వామ్యాన్నే నిందిస్తున్నారు. భారత ప్రజాస్వామ్యం వారికి కల్పించిన హక్కులను అడ్డుపెట్టుకుని.. విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతూన్న కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అధ్యక్షుడు.. దయచేసి భారత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడకపోతేనే బాగుంటుంది.

1975లో ఎమర్జెన్సీ సమయంలో ప్రజా హక్కులను కాలరాసి, పత్రికా స్వేచ్ఛ హరించి, లక్షలాది ప్రజా నాయకులను నిర్బంధించిన మీ పార్టీ ప్రభుత్వంలో.. ఎలా వ్యవహరించిందో అందరికీ తెలుసు. మీకు సిద్ధాంత వైరుధ్యమున్న నేతలను అరెస్టు చేస్తూనే.. పత్రికల గొంతునొక్కిన విషయం మరిచిపోయారా మల్లికార్జున ఖర్గే గారు.

మీరు ఓసారి హైదరాబాద్ కు వచ్చి.. మీ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో ఎలాంటి ప్రజాస్వామ్యం అమలవుతుందో.. చూసి చెప్పండి. సోనియా, రాహుల్, ప్రియాంకలతో కలిసి మీరు హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీలపై నిలదీయడం తప్పు అని తెలంగాణ ప్రజానీకానికి చెప్పగలరా?

రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని ప్రసంగాలు చేయడం కాదు.. అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగ స్ఫూర్తిని పాటించడమే అసలైన ప్రజాస్వామ్యం. ఢిల్లీలో మీరు కోరుకుంటున్న ప్రజాస్వామ్యాన్ని తెలంగాణలోనూ విపక్షాల విషయంలో అమలు చేసి చూపించాలని డిమాండ్ చేస్తున్నాను.

తెలంగాణ భాష జీవభాష...

- మన భాషలోని సాహిత్యం పండిత, పామరులను ఒకే విధంగా ఆనందింపజేస్తుంది
- తెలంగాణ జాగృతి ఫౌండర్, తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- 'సరస్వతీరాజ్ - హరిదా అంతర్జాతీయ ఉత్తమ తెలంగాణ కథా పురస్కారం - 2026' పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, వెలుతురు:

తెలంగాణ భాష జీవభాష అని, తెలంగాణ భాషలో సృజించిన సాహిత్యం పండిత పామరులను ఒకే విధంగా ఆనందింపజేస్తుందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆ మాధుర్యాన్ని తరతరాలకు అందించే విధంగా హరిదా రచయితల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. శనివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'సరస్వతీరాజ్ – హరిదా అంతర్జాతీయ ఉత్తమ తెలంగాణ కథా పురస్కారం – 2026' పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ భాషలోని సోయగాన్ని, పదబంధాలను, నుడికారాలను, సామెతలను కథల ద్వారా ముందు తరాలకు అందించడం మంచి ప్రయత్నమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ భాషలో కథల పోటీ నిర్వహించడం ఆదర్శనీయమని, తెలంగాణ భాషలో కథను రాయగలిగిన రచయితలందరికీ ఇదొక గొప్ప అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

భాష గొప్పతనం కథల ద్వారే తెలుస్తుంది- అనన్య నాగళ్ల

ఏ భాష గొప్పతనమైన కథల ద్వారానే తెలుస్తుందని ప్రముఖ నటి అనన్య నాగళ్ల అన్నారు. కథలు ఆ ప్రాంతం భాష, సంస్కృతులను ముందు తరాలకు అందజేసేందుకు సరైన సాధనలని చెప్పారు. హరిదా రచయిత సంఘం కథ పోటీల ద్వారా రచయితల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో మంచి ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని రచయితలంతా తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు.

మొదటి ఉత్తమ కథకు రూ. 10, 000

పోటీల్లో మొదటి ఉత్తమ కథకు రూ. 10,000/– నగదు పురస్కారం, తర్వాతి తొమ్మిది ఉత్తమ కథలకు ఒక్కొక్కరికి రూ. 1,000/– నగదు పురస్కారంతో పాటు సముచిత సత్కారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పురస్కారాలను డిసెంబర్ 4వ తేదీన నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో జరిగే హరిదా రచయితల సంఘం మహాసభలో ప్రదానం చేస్తామన్నారు. ?అర్హత, ఆసక్తి ఉన్న కథా రచయితలు తమ కథను, హామీ పత్రాన్ని అక్టోబర్ 30వ తేదీలోపు haridaasaraswathiraj@gmail.com ఈ–మెయిల్ ఐడీకి పంపాలని కోరారు. ఇతర వివరాల కోసం 9030033331 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి, నాయకులు రూప్ సింగ్, శరత్‌లు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రైతులు రెండో పంట వేసి ఇబ్బంది పడొద్దు
- యూనిట్‌కు రూ.15 చెల్లించినా విద్యుత్తు దొరకని పరిస్థితి
- తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శతవిధాల కృషి
- భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలకు ప్రణాళిక
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
- కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కూసుమంచి వెలుతురు అక్టోబర్ 11:

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర జల వనరుల సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంట వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం కూసుమంచి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఐటీడీఏ నిధులు రూ. 1.63 కోట్లతోమంగలితండా–దుబ్బతండా మధ్య నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, జుజ్జుల్ రావుపేటలో రూ.45 లక్షలతో చేపట్టనున్న ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

మంగలితండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే.. హాటియాతండాలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బదావత్ వీరన్న తండ్రి బాషూ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రూ.15 పెట్టినా విద్యుత్తు దొరకడం లేదు

గతంలో యూనిట్ విద్యుత్తు రూ.7, రూ.8కు లభించేదని, ప్రస్తుతం విద్యుత్తు కొరత తీవ్రంగా ఉందని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. యూనిట్‌కు రూ.15 చెల్లించి కొనుగోలు చేయాలన్నా దేశంలో విద్యుత్తు లభించని పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. భూగర్భ జలమట్టాలు క్రమంగా పడిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రెండో పంట సాగు వద్దు..

ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రైతులు రెండో పంట సాగు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే వేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రెండో పంట వేసి, నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు.

కేంద్రాన్ని కలిసి ప్రత్యేక ప్యాకేజీ కోరతాం

ఎల్‌నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉందని పొంగులేటి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర.టీఎస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ. హాఫీజుద్దీన్, జూకూరి గోపాలరావు, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైష్ణవి పురస్కారాలు ప్రదానం

వరంగల్, వెలుతురు అక్టోబర్ 11: వైష్ణవి పురస్కారాలు ప్రదానం వేడుకలు ఆదివారం వరంగల్ లోని శివనగర్ లోని వైష్ణవి సంఘం ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి,దరిపెల్లి సంపత్‌లు హాజరైనారు. ప్రతిభ పుష్కరాలను సభకు వెలుగులేటి సేనాచార్యులు అధ్యక్షత వహించగా అతిథులుగా గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి శ్రీమాన్ దరఖాశయం కటూరి ఇందుమతి కందల కృష్ణమాచార్యులు రాష్ట్ర వైష్ణవ సంఘు ఉపాధ్యక్షులు దరిపెల్లి సంపత్ వెంకటరమణ తో పాటు శ్రీ వైష్ణవి సభ్యులు కాటూరి శ్రవణ్ కుమార్ హరితలు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో అతిధుల చేత వైష్ణవ పురస్కార విద్యార్థులకు నగదు తోపాటు శాల్వా షీల్డ్ అందించారు ఈ సందర్బంగా రాజనాల దరిపల్లి సంపత్ మాట్లాడుతూ అయోధ్య విగ్రహాలను ఐదువేల విగ్రహాలు ను శ్రీ రామానుజ చార్యులు నాలుగేళ్ల విగ్రహాలను భక్తులకు తెలంగాణలో ఉన్న ప్రజలందరికీ అందజేశారు విద్యార్థులు కష్టపడి చదివి వైష్ణవ కులానికి మంచి పేరు తేవాలని పిల్లలు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించి మంచి పేరు తెచ్చుకొని తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

నైపుణ్యంతో కొలువుల బాట!

(మొదటిపేజీ తరువాయి)

నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా తాజాగా 154 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 87 మంది హైదరాబాద్లోని ఫాక్స్కాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 27 మంది పురుష అభ్యర్థులు సోలార్ టెక్నిషియన్ ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 25 మంది సోలార్ టెక్నిషియన్లుగా ఉద్యోగాల్లో చేరనున్నారు. ఫాక్స్కాన్కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం గోదావరిఖని నుంచి హైదరాబాద్కు బయలుదేరారు.

శిక్షణ నుంచి ఉపాధి వరకు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. గత రెండేళ్లలో 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించింది. మార్కెట్ లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటోంది.

మహిళలకు తయారీ రంగంలో అవకాశాలు

ఫాక్స్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గత వారం జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్పాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేసేందుకు 87 మంది మహిళలను ఎంపిక చేశారు. స్థానిక మహిళలకు పారిశ్రామిక రంగంలో లభించిన ఈ అవకాశాలు వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడనున్నాయి. సోలార్ టెక్నిషియన్ కోర్సులో శిక్షణ పొందిన 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జీ–1 జీఎం డి. లలిత్ కుమార్ తెలిపారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు.

నైపుణ్యాలతో భవిష్యత్తుకు పునాది

సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని జీఎం డి. లలిత్ కుమార్ అన్నారు. శిక్షణను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించడం ద్వారా యువత మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తోందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పనిచేస్తూ వృత్తిలో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎస్.కె. చంద్రశేఖర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్కాన్ హెచ్ఆర్ ప్రతినిధి ఆర్. శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్,అధికారులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్

సైక్లింగ్ రైడ్‌లో పాల్గొన్న డా. కె. లక్ష్మణ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11: మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పిస్తూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో అక్షర స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లి'నషా ముక్త్ భారత్ -- సైక్లింగ్ రైడ్'లి కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ గారు పాల్గొన్నారు.గోషామహల్ నియోజకవర్గంలోని సీతారాంపేట బాల హనుమాన్ మందిరం నుంచి అసెంబ్లీ ప్రాంగణంలోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి విగ్రహం వరకు నిర్వహించిన ఈ సైక్లింగ్ రైడ్‌లో పాల్గొని, మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, దేశ భవిష్యత్తును కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ కార్యక్రమం పిలుపునిచ్చింది. మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం -- ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకుందాం!

-డ్రగ్స్ రహిత భారత్ - మనందరి సంకల్పం!

బల్కంపేట రేణుక ఎల్లమ్మ పోచమ్మకు

మంత్రి ప్రత్యేక పూజలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం హైదరాబాద్‌లోని బల్కంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ పోచమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల తొలి రోజు సందర్భంగా శ్రీ బాలా త్రిపురసుందరి దేవి అలంకరణలో, దీపాలతో సుందరంగా అలంకరించిన అమ్మవారిని మంత్రి దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. అలాగే ప్రజాపాలన ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా కొనసాగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలి

- ఊరు వాడలా సంబరాలు అంబరాన్నంటేలా ఏర్పాట్లు చేయాలి
- ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలి
- బతుకమ్మ ఏర్పాట్లపై అధికారులకు మంత్రి జూపల్లి దిశానిర్దేశం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిం చాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. నగరాలు, పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఊరు వాడలా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిం చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ విభాగాల అధిపతులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ, ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రజలకు మరింత చేరువ చేయాలని మంత్రి సూచించారు. ఉత్సవాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని, ప్రముఖులు, సెలబ్రిటీలను భాగస్వాములను చేసి బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగేలా చూడాలని, ముఖ్యం గా ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని విభాగాలు ముందస్తు ప్రణాళికతో సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వారసత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

మెట్రో

ప్రయాణికులకు శుభవార్త

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు ఇప్పటికే మెట్రో రైలు సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే మెట్రో రైళ్లలో ప్రయాణం చేసే వారికోసం తెలంగాణా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. మెట్రో ప్రయాణికులకు లాస్ట్ మైల్ కనెక్టివిటీ అందించేందుకు ప్రభుత్వం కొత్త రవాణా వ్యవస్థపై దృష్టి సారించింది. మెట్రో స్టేషన్‌లో దిగగానే నేరుగా గమ్యస్థానానికి చేర్చే డ్రైవర్‌లెస్ పాడ్ ట్యాక్సీలు ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అధికారులు మొత్తం 40.82 కిలోమీటర్ల మేర ఈ నెట్‌వర్క్‌ను నిర్మించాలని ప్రతిపాదిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదిక సమర్పించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో లీ అసోసియేట్స్ సంస్థ రూపొందించిన నివేదికను అధికారులు సీఎంకు వివరించారు. ఈ ప్రాజెక్టును పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కూకట్‌పల్లి - రాయదుర్గం 7.62 కి.మీ, రాయదుర్గం - నాలెడ్జ్ సిటీ 12.83 కి.మీ, రాయదుర్గం / హైటెక్ సిటీ - ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ 14.01 కి.మీ., సచివాలయం - ఎన్టీఆర్ మార్గ్ 6.36 కి.మీ.ఈ మార్గాల్లో ఏర్పాటుకు ప్లాన్ చేస్తుంది.

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

- దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని 'జై సీతక్క' నినాదాలతో మార్మోగిన విమానాశ్రయ ప్రాంగణం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11: దక్షిణాఫ్రికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ములుగు జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు.మంత్రి సీతక్కకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విమానాశ్రయానికి తరలివచ్చారు. తమ అభిమాన నాయకురాలికి స్వాగతం పలికేందుకు కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహం ప్రదర్శించారు.దక్షిణాఫ్రికాలో పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన మంత్రి సీతక్కకు నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. నాయకులు, కార్యకర్తలు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ములుగు ప్రాంతం నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల రాకతో విమానాశ్రయ పరిసరాలు సందడిగా మారాయి.ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున 'జై సీతక్క' అంటూ నినాదాలు చేయడంతో విమానాశ్రయ ప్రాంగణం మార్మోగింది. తమ అభిమాన నాయకురాలికి ఘన స్వాగతం పలుకుతూ కార్యకర్తలు, అభిమా నులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన మంత్రి సీతక్కకు పార్టీ శ్రేణులు, ములుగు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలకడం విమానాశ్రయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

హైదరాబాద్

డ్రగ్స్‌కు మూలం గోవానే

- గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన
- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు
- ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ
- గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు

పనాజి, వెలుతురు, అక్టోబర్ 11: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్స్' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్ర వ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు.గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు.రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల సమస్యలకోసం

ప్రెస్ క్లబ్ కార్యాచరణ ప్రణాళిక

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11: జర్నలిస్టులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమాజిగూడ లో ఆదివారం నాడు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రెస్ క్లబ్ సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు హాజరయ్యారు. ఏడాది కాలంలో మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు సర్వసభ్య సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ప్రెస్ క్లబ్ స్థలం లీజు వెంటనే కేటాయించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతూ ప్రెస్ క్లబ్ ఏజీఎం ఏకగ్రీవంగా తీర్మానించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని దీనికోసం అన్ని జర్నలిస్టు సంఘాలను, యూనియన్లను కలుపుకొని కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు కార్యవర్గం తీర్మానం ఆమోదించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, వయోధిక పాత్రికేయులకు పెన్షన్లను ఇవ్వాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ప్రెస్ క్లబ్ ఏజీఎం తీర్మానించింది. ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ.రాజేష్, అరుణ అత్తలూరి, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ , వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు ముత్యాల సత్తిబాబు, ఎం. రమాదేవి, రచన ముడుంబై, వనం.నాగరాజు, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, అమిత్ బట్టు, అశోక్ దయ్యాల, రాజేశ్వరి కల్యాణం, శంకర్ శిగ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులు దేవులపల్లి అమర్, ఆర్.శైలేష్‌రెడ్డి, దిలీప్ రెడ్డి, రవి కాంత్ రెడ్డి సహా యూసుఫ్ బాబు తదితరులు హాజరయ్యారు. మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యుడి కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం తక్షణం అందజేయాలని ప్రెస్ క్లబ్ సర్వసభ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు నాయకులు దేవులపల్లి అమర్ ను ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి శాలువతో సత్కరించింది.

జవహర్‌నగర్ తర్వాత సిద్ధాపూర్ ఎందుకు?

చెత్త సమస్యకు గ్రామాలే బలికావాలా?

హైదరాబాద్ నగరం పెరుగుతోంది. జనాభా పెరుగుతోంది. వినియోగం పెరుగుతోంది. దానికి అనుగుణంగానే ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే చెత్త పరిమాణం కూడా పెరుగుతోంది. కానీ నగరాల అభివృద్ధికి చెల్లించాల్సిన మూల్యం గ్రామాల ప్రజలు తమ ఆరోగ్యంతో, వ్యవసాయ భూములతో, భూగర్భ జలాలతో, పర్యావరణంతో చెల్లించాలా? నగరం చెత్తను ఉత్పత్తి చేస్తే, ఆ చెత్త భారాన్ని మోసేది మాత్రం నగరానికి దూరంగా ఉన్న పల్లెలే కావాలా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా "ఎకో-టౌన్", "సర్క్యులర్ ఎకానమీ", "నెట్ జీరో" వంటి ఆకర్షణీయమైన పదాలతో సమస్యను కప్పిపుచ్చడం సాధ్యం కాదు. జవహర్‌నగర్ ప్రజలు చెత్త నిర్వహణ పేరుతో ఎదుర్కొంటున్న సమస్యలు మన కళ్లముందే ఉన్నాయి. దుర్వాసన, కాలుష్యం, ఆరోగ్య సమస్యలు, భూగర్భ జలాలపై ఆందోళనలు, పర్యావరణ నష్టం, జీవన ప్రమాణాలపై ప్రభావం---ఇవన్నీ ప్రజల పోరాటానికి కారణాలుగా నిలిచాయి. ఇప్పుడు అదే అనుభవాన్ని సిద్ధాపూర్ ప్రజల భవిష్యత్తుగా మార్చాలనే నిర్ణయం తీసుకుంటే, ప్రభుత్వం గత అనుభవాల నుంచి ఏమి నేర్చుకున్నదన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. చెత్త నిర్వహణ శాస్త్రీయంగా జరగాలి కానీ ఒక ప్రాంతపు చెత్త సమస్యను మరొక ప్రాంతపు ప్రజల జీవితాల సమస్యగా మార్చడం మాత్రం పరిష్కారం కాదు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 252, 278, 361లోని 86 ఎకరాల భూమిని ఘన వ్యర్థాల నిర్వహణ సదుపాయాల కోసం ఉపయోగించేందుకు జూలై 2, 2026న జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నం.641 ఇప్పుడు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఈ భూమిని +నవీజకి బదలాయించడం, అక్కడ ఘన వ్యర్థాల నిర్వహణ సదుపాయాల ఏర్పాటుకు అనుమతులు కల్పించడం పరిపాలనా నిర్ణయం కావచ్చు. కానీ భూమి బదలాయించబడిందనే కారణంతో ఆ భూమి పర్యావరణపరంగా, ప్రజారోగ్యపరంగా, సాంకేతికంగా అనుకూలమైనదని తేలిపోదు. అసలు ప్రశ్న అక్కడి నుంచే మొదలవుతుంది. సిద్ధాపూర్ ప్రాంతంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. భూగర్భ జలాలపై ఆధారపడే గ్రామీణ కుటుంబాలు ఉన్నాయి. అటవీ ప్రాంతం, సహజ హరిత ప్రాంతాలు, వన్యప్రాణుల సంచారానికి సంబంధించిన పర్యావరణ వ్యవస్థ ఉంది. గిరిజన తండాలు ఉన్నాయి. పాఠశాల ఉంది. మతపరమైన ప్రదేశాలు ఉన్నాయి. అంతేకాదు, న్యూజాకు చెందిన న్రా+ పైప్‌లైన్, గావష్ఱశీఋశ్రీఱఓఱఅస్త్ర ఋశ్రీజవ ౯ఛ్‌ఱశీఅ-30 వంటి ప్రజా భద్రతకు సంబంధించిన కీలక మౌలిక వసతులు కూడా ఉన్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సున్నితమైన అంశాలు ఉన్న ప్రాంతంలో కేవలం పరిపాలనా నిర్ణయంతో చెత్త నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కంటే ముందుగా శాస్త్రీయ పరిశీలన జరగాలి. ఇక్కడ మరో ముఖ్యమైన విషయాన్ని ప్రభుత్వం గమనించాలి. 2026 ఏప్రిల్ 1 నుంచి వాశీశ్రీఱ౦ ఝూర్వ మీఋఋస్త్రవఎవత్ =బశ్రీవం, 2026 అమల్లోకి వచ్చాయి. ఇవి 2016 నాటి నిబంధనలను భర్తీ చేశాయి. కొత్త నిబంధనలు మూలస్థాయిలో చెత్తను వేరు చేయడం, శాస్త్రీయ నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ, పర్యావరణ బాధ్యత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. నిబంధనల ఉల్లంఘనలకు "ఫాశీశ్రీశ్రీబ్‌వతీఃఋఎం" సూత్రం కింద పర్యావరణ పరిహారం విధించే విధానాన్నీ అవి కలిగి ఉన్నాయి. అందువల్ల నగరాల నుంచి వచ్చే మిశ్రమ చెత్తను ఒకచోట పోగుచేసి, దాన్ని గ్రామాల అంచుల్లో నిర్వహించడం మాత్రమే ఆధునిక ఘన వ్యర్థాల నిర్వహణ కాదు. తడి, పొడి, ప్రత్యేక స్వభావం కలిగిన వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేయడం, పునర్వినియోగం, రీసైక్లింగ్, కంపోస్టింగ్, శాస్త్రీయ ప్రాసెసింగ్ వంటి విధానాలు ముందుకు రావాలి. వ్యర్థాల పరిమాణాన్ని తగ్గించడం మొదటి లక్ష్యం కావాలి. వ్యర్థాన్ని ఉత్పత్తి చేసే ప్రాంతమే దాని నిర్వహణకు బాధ్యత వహించే విధంగా వికేంద్రీకృత నమూనాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. సిద్ధాపూర్ విషయంలో అసలు ఆందోళన ఇదే. 86 ఎకరాల భూమిలో ఏం నిర్మించబోతున్నారు? రోజుకు ఎంత చెత్త వస్తుంది? ఆ చెత్త ఎక్కడి నుంచి వస్తుంది? అది ముందుగా వేరు చేయబడుతుందా? లీచేట్ ఎలా నిర్వహిస్తారు? వర్షపు నీరు కలుషితం కాకుండా ఏ చర్యలు తీసుకుంటారు? భూగర్భ జలాలను ఎలా రక్షిస్తారు? దుర్వాసనను ఎలా నియంత్రిస్తారు? అగ్ని ప్రమాదాన్ని ఎలా నివారిస్తారు? వ్యర్థాలను తరలించే వాహనాలు ఏ మార్గంలో వెళ్తాయి? సమీప పాఠశాలలు, తండాలు, వ్యవసాయ భూములపై ప్రభావం ఏమిటి? న్రా+ పైప్‌లైన్‌కు సురక్షిత దూరం ఎంత? అటవీ ప్రాంతం, వన్యప్రాణుల సంచార మార్గంపై ప్రభావం ఏమిటి? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ చట్టాలు, నీరు, గాలి కాలుష్య నియంత్రణ చట్టాలు, ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను అమలు చేసే చట్టబద్ధ సంస్థ. కాన్సెంట్ ఫర్ ఎస్టేబులిష్మెంట్ , కాన్సెంట్ ఫర్ ఆపరేషన్ వంటి నియంత్రణ ప్రక్రియలు కూడా దాని పరిధిలో ఉన్నాయి. కాబట్టి కేవలం భూమి బదలాయింపు జరిగిందనే కారణంతో పర్యావరణ, కాలుష్య నియంత్రణ ప్రక్రియలు ముగిసిపోయినట్లు భావించరాదు. ప్రజలకు మరో ప్రశ్న కూడా ఉంది. జవహర్‌నగర్ అనుభవం నుంచి ప్రభుత్వం నేర్చుకున్న పాఠం ఏమిటి? అక్కడ ప్రజలు సంవత్సరాలుగా చెత్త సమస్యలపై పోరాడుతున్న ప్పుడు, అదే నమూనాను మరొక గ్రామంపై ప్రయోగించడం ఎందుకు? ఒక ప్రాంత ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు, మరో ప్రాంత ప్రజలకు అదే భవిష్యత్తును కేటాయించడం సామాజిక న్యాయమా? సిద్ధాపూర్ ప్రజల పోరాటాన్ని అభివృద్ధి వ్యతిరేక పోరాటంగా ముద్ర వేయడం కూడా సరికాదు. ప్రజలు చెత్త నిర్వహణకు వ్యతిరేకం కాదు. శాస్త్రీయంగా, సురక్షితంగా, చట్టబద్ధంగా, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ చెత్తను నిర్వహించాలని మాత్రమే కోరుతున్నారు. వారి భూములు, నీరు, పంటలు, పిల్లల ఆరోగ్యం, గ్రామాల భవిష్యత్తు ప్రమాదంలో పడకూడదని అడుగుతున్నారు. ఇది అభివృద్ధి వ్యతిరేకత కాదు; బాధ్యతాయుతమైన అభివృద్ధి కోసం చేస్తున్న డిమాండ్. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కుకు విస్తృత రక్షణను కల్పిస్తుంది. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణంలో జీవించే హక్కు కూడా దాని పరిధిలో భాగమని భారత న్యాయవ్యవస్థ అనేక సందర్భాల్లో స్పష్టం చేసింది. ఆర్టికల్ 48-ూ పర్యావరణం, అటవీ ప్రాంతాలు, వన్యప్రాణులను రక్షించే బాధ్యతను ప్రభుత్వంపై ఉంచుతుంది. ఆర్టికల్ 51-ూ(స్త్ర) పర్యావరణాన్ని రక్షించడం ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యంగా పేర్కొంటుంది. కాబట్టి పర్యావరణ నష్టం జరిగిన తర్వాత పరిహారం ఇవ్వడం కంటే, నష్టం జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడమే ప్రభుత్వ బాధ్యత. అందుకే సిద్ధాపూర్ విషయంలో తొందరపాటు అవసరం లేదు. ముందుగా సంయుక్త స్థల పరిశీలన జరగాలి. +నవీజ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ, వన్యప్రాణి అధికారులు, భూగర్భ జలాల శాఖ, ఆరోగ్య శాఖ, రెవెన్యూ అధికారులు, స్థానిక సంస్థలు, న్యూజా, సంబంధిత భద్రతా సంస్థలు కలిసి పరిశీలించాలి. భూగర్భ జలాలు, వ్యవసాయం, అటవీ ప్రాంతం, వన్యప్రాణుల సంచారం, ప్రజారోగ్యం, ట్రాఫిక్, అగ్ని ప్రమాదం, న్రా+ పైప్‌లైన్ భద్రతపై స్వతంత్ర నివేదికలు రావాలి. ప్రాజెక్టు ఋూ=, సైట్ ప్లాన్, వ్యర్థాల పరిమాణం, సాంకేతిక విధానం, పర్యావరణ అనుమతులు, కాలుష్య నియంత్రణ అనుమతులు అన్నీ ప్రజల ముందుంచాలి. ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. పరిశీలనలో సిద్ధాపూర్ ప్రాంతం అనుకూలం కాదని తేలితే అక్కడి ప్రాజెక్టును రద్దు చేసి ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని గుర్తించాలి. ఎందుకంటే ఒక నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ఒక గ్రామాన్ని అనారోగ్యానికి గురిచేసే హక్కు ఎవరికీ లేదు. ఒక నగర అభివృద్ధి కోసం ఒక పల్లె భవిష్యత్తును బలిచేసే హక్కు ప్రభుత్వానికీ లేదు. జవహర్‌నగర్ ప్రజలు చేసిన పోరాటం ఒక హెచ్చరిక. ఆ హెచ్చరికను పట్టించుకోకుండా సిద్ధాపూర్‌ను మరో జవహర్‌నగర్‌గా మార్చితే, అది కేవలం ఒక ప్రభుత్వ నిర్ణయం వైఫల్యం కాదు---ప్రజా ఆరోగ్యం, పర్యావరణ న్యాయం, సామాజిక న్యాయం అన్న మూడింటి వైఫల్యంగా చరిత్రలో మిగిలిపోతుంది. చెత్త సమస్యకు పరిష్కారం కావాలి. కానీ ఆ పరిష్కారం ప్రజల జీవితాలకే మరో చెత్త సమస్యగా మారకూడదు. ఒక ప్రాంతంలోని చెత్తను మరో ప్రాంత ప్రజల నెత్తిన రుద్ది, వారి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని, భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం అభివృద్ధి కాదు. ప్రజాస్వామ్య పాలన అంతకన్నా కాదు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా పునఃపరిశీలించాలి. సిద్ధాపూర్‌ను మరో జవహర్‌నగర్‌గా మార్చే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలి. డంపింగ్ యార్డ్ ప్రభావం ఒక్క సిద్ధాపూర్ గ్రామానికే పరిమితం కాదు. చుట్టుపక్కల ఉన్న సుమారు 80 గ్రామాల ప్రజల జీవనంపై దీని ప్రభావం పడే ప్రమాదం ఉంది. దుర్వాసన, భూగర్భ జలాల కాలుష్యం, గాలి కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలు, వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం వంటి అంశాలపై ప్రభుత్వం సమగ్రంగా అధ్యయనం చేయాలి. శాస్త్రీయ పరిశీలన లేకుండా, పర్యావరణ ప్రభావాలను అంచనా వేయకుండా, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం బాధ్యతారాహిత్యమే అవుతుంది. ప్రజలకు అవసరమైన అభివృద్ధి అంటే వారి జీవితాలను మెరుగుపరచడం. వారి బతుకులను బలిపెట్టి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడం కాదు. అందుకే ముందుగా ప్రజల మాట వినాలి. శాస్త్రీయ నిపుణుల సూచనలు తీసుకోవాలి. పర్యావరణ నిబంధనలను, చట్టపరమైన ప్రక్రియలను తప్పనిసరిగా పాటించాలి. చెత్త నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. ప్రజల ఆందోళనలను పక్కనపెట్టి ఏకపక్షంగా ముందుకెళ్లడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. సుమారు 80 గ్రామాల ప్రజలు డంపింగ్ యార్డ్ వద్దని కరాఖండిగా చెబుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? ప్రజల అభ్యంతరాలను ప్రభుత్వం హెచ్చరికగా తీసుకోవాలి. వెంటనే సంబంధిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేయాలి. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలగకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే, ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయానికి రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదు. రాబోయే ఎన్నికల్లో షాద్‌నగర్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు లేకుండా చేస్తామని సుమారు 80 గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆగ్రహాన్ని ఓట్ల రూపంలో చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు. ప్రజల గొంతు వినండి.. సిద్ధాపూర్‌ను కాపాడండి.. డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోండి! ప్రజల ఆరోగ్యమే ముఖ్యం, ప్రజల భవిష్యత్తే ముఖ్యం. ప్రజల తీర్పు ముందు ఏ ప్రభుత్వ నిర్ణయమైనా తలవంచాల్సిందే.

-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

ఒక సామాన్య మహిళ ప్రశ్న

వ్యవస్థకు వినిపించాల్సిన సందేశం

ప్రజాస్వామ్యంలో సామాన్య పౌరులు వ్యక్తం చేసే అభిప్రాయాలు ప్రజా సమస్యలపై చర్చకు దారితీయగలవు. ఢిల్లీలో నిరసన ప్రదేశంలో ఒక మహిళ మాట్లాడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి రావడంతో పోలీసుల సేవల పట్ల గౌరవాన్ని వ్యక్తం చేస్తూనే, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, పదవీ విరమణ భద్రత, ప్రజాప్రతినిధులకు అందే ప్రయోజనాలు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. అయినప్పటికీ, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై పౌరులు తమ అభిప్రాయాలను వెల్లడించడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ. ఆ అభిప్రాయాల వెనుక ఉన్న సమస్యలను వాస్తవాల ఆధారంగా పరిశీలించడం, ప్రజలకు సంబంధించిన అంశాలపై బాధ్యతాయుతంగా స్పందించడం పాలనా వ్యవస్థకు అవసరం.

సంక్షేమంలో పారదర్శకత అవసరం!

ప్రజాప్రతినిధులకు అందే ప్రయోజనాలు, ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ భద్రత వంటి అంశాలు ప్రజా చర్చకు సంబంధించినవే. అయితే, వేర్వేరు వర్గాలకు వర్తించే ప్రయోజనాలను నేరుగా పోల్చే ముందు వాటి స్వభావం, అర్హతలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజాధనంతో అమలయ్యే ప్రతి సంక్షేమ చర్యలో పారదర్శకత, ఆర్థిక బాధ్యత, ప్రజాప్రయోజనం కీలకంగా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా తగిన భద్రత పొందడం, వారి సేవలకు తగిన గౌరవం లభించడం ముఖ్యం. అదే సమయంలో ప్రజాప్రతినిధులకు అందే సదుపాయాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండాలి. ఏ వర్గాన్నీ మరో వర్గానికి వ్యతిరేకంగా నిలబెట్టకుండా, అందరికీ న్యాయం జరిగే విధానాలపై చర్చ జరగాలి. ప్రజల అవసరాలు, ప్రభుత్వ ఆర్థిక సామర్థ్యం, సంక్షేమ లక్ష్యాల మధ్య సమతుల్యత పాటించడం బాధ్యతాయుత పాలనకు అవసరం.

పోలీసుల విధులు.. సంక్షేమానికి ప్రాధాన్యం!

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారు. అత్యవసర పరిస్థితులు, రాత్రి విధులు, ప్రజా కార్యక్రమాలు, నిరంతర పర్యవేక్షణ వంటి సందర్భాల్లో వారి పని భారం పెరిగే అవకాశం ఉంటుంది. విధుల స్వభావం, పని గంటలు, సిబ్బంది లభ్యత, విశ్రాంతి, ఆరోగ్య పరిస్థితులు వారి సంక్షేమంపై ప్రభావం చూపుతాయి. అందువల్ల పోలీసు సిబ్బందికి తగిన విశ్రాంతి, ఆరోగ్య సంరక్షణ, ప్రమాద సమయాల్లో రక్షణ, కుటుంబ సంక్షేమం, పదవీ విరమణ భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించేందుకు అవసరమైన సిబ్బంది, వసతులు, శిక్షణ, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయడం కూడా ముఖ్యం. ప్రజల భద్రత కోసం పనిచేసే సిబ్బంది సంక్షేమాన్ని మెరుగుపరచడం వారి వ్యక్తిగత ప్రయోజనానికే పరిమితం కాదు. మెరుగైన పని పరిస్థితులు ప్రజలకు అందే సేవల నాణ్యతను పెంచేందుకు కూడా తోడ్పడతాయి.

ప్రజల గొంతుకు విలువ.. పాలనలో బాధ్యత!

ప్రజలు తమ సమస్యలను వెల్లడించడం, ప్రభుత్వ విధానాలపై అభిప్రాయాలు తెలియజేయడం, సంక్షేమ చర్యలపై వివరణ కోరడం ప్రజాస్వామ్యంలో భాగం. భారత రాజ్యాంగం భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును గుర్తిస్తుంది. అయితే, ఈ హక్కులు రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులకు లోబడి ఉంటాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి వచ్చే దృశ్యాలు లేదా వ్యాఖ్యల ఆధారంగా మాత్రమే వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలపై తుది నిర్ణయాలకు రావడం సరికాదు. సంబంధిత సమాచారం, విశ్వసనీయ ఆధారాలను పరిశీలించిన తర్వాతే సమతుల్యమైన అభిప్రాయానికి రావాలి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని పరస్పర విరుద్ధ అంశాలుగా చూడకుండా, న్యాయం, సమానత్వం, ప్రజాధన వినియోగంలో బాధ్యత వంటి ప్రమాణాలతో పరిశీలించాలి. ప్రజల అభిప్రాయాలను గౌరవించడం, సమస్యలను శ్రద్ధగా పరిశీలించడం, సాధ్యమైన పరిష్కారాలను పారదర్శకంగా అమలు చేయడం బాధ్యతాయుత పాలనకు గుర్తింపు. ప్రజల మాటకు విలువనిస్తూ, సంక్షే మానికి ప్రాధాన్యం ఇచ్చి, ప్రతి నిర్ణయంలో ప్రజా ప్రయోజనాన్ని ముందుంచినప్పుడే ప్రజా స్వా మ్యంపై విశ్వాసం మరింత బల పడుతుంది.

-వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ 9640466464

తల్లిదండ్రులు
ఉన్నప్పుడే ప్రేమించండి

మనిషి బతికున్నప్పుడు చూపించే ప్రేమే అతని మనసుకు చేరుతుంది. అతను వెళ్లిపోయిన తర్వాత మనం చూపించే ప్రేమ జ్ఞాపకంగా మిగులుతుంది. అందుకే ప్రేమను, ఆప్యాయతను, ఆదరణను "తర్వాత చూద్దాం" అంటూ వాయిదా వేయకూడదు. ఎదురుగా ఉన్నప్పుడు పలకరించడానికి సమయం ఉండదు... పక్కనే ఉన్నప్పుడు అతని బాధను వినడానికి ఓపిక ఉండదు... అవసరంలో ఉన్నప్పుడు చేయూతనివ్వడానికి మనసు రాదు. కానీ ఆ మనిషి శాశ్వతంగా దూరమైన తర్వాత అతని ఫోటో ముందు పూలు పెడతాం, దండలు వేస్తాం, అతని మంచితనాన్ని గుర్తుచేసుకుంటాం. ఆ మంచితనాన్ని అతను బతికున్నప్పుడే గుర్తించి, ఒక్క మంచి మాట చెప్పి ఉంటే ఎంత సంతోషించేవాడో ఆలోచించాలి. బతికున్నప్పుడు బుక్కెడు బువ్వ పెట్టకుండా... పోయిన తర్వాత పంచభక్ష్య పరమాన్నాలు పెట్టినా, అతను అనుభవించిన ఆకలిని తీర్చలేం. ఆకలితో ఉన్నప్పుడు పెట్టిన అన్నం అతని ప్రాణానికి ఆధారం. బాధలో ఉన్నప్పుడు చెప్పిన ఓదార్పు మాట అతని మనసుకు ధైర్యం. ఒంటరిగా ఉన్నప్పుడు పక్కన కూర్చొని మాట్లాడిన కొద్దిసేపు అతనికి గొప్ప తోడు. మనం చిన్నవిగా భావించే ఈ పనులే ఎదుటివారి జీవితంలో ఎంతో విలువైనవిగా నిలుస్తాయి. ప్రేమ అంటే పెద్ద పెద్ద మాటలు చెప్పడం మాత్రమే కాదు. "తిన్నావా?", "ఎలా ఉన్నావు?", "ఏమైనా ఇబ్బంది ఉందా?" అని మనస్ఫూర్తిగా అడగడం కూడా ప్రేమే. అడిగిన తర్వాత సమాధానాన్ని శ్రద్ధగా వినడం, అవసరమైనప్పుడు మనకు చేతనైన సహాయం చేయడం, వారి భావాలను గౌరవించడం---ఇవన్నీ ప్రేమకు నిజమైన రూపాలు. ముఖ్యంగా తల్లిదండ్రులు, వృద్ధులు కోరుకునేది ప్రతిసారీ డబ్బు, బహుమతులు మాత్రమే కాదు. తమ పిల్లలు కొద్దిసేపు తమతో మాట్లాడాలని, తమ మాట వినాలని, తమ ఉనికిని గుర్తించాలని కోరుకుంటారు. మనకు సాధారణంగా అనిపించే ఒక పలకరింపు కోసం వారు రోజంతా ఎదురుచూస్తుండవచ్చు. అందుకే మన పనుల మధ్య వారికి కూడా కొంత సమయం కేటాయించాలి. మరణించిన వారిని స్మరించుకోవడం, వారి ఫోటోకు పూలు వేయడం మన గౌరవానికి గుర్తు. ఆ జ్ఞాపకాలకు విలువ ఉంది. అయితే, బతికున్నప్పుడు ఇవ్వాల్సిన ఆదరణను ఆ నివాళులు భర్తీ చేయలేవు. ఫోటో మనిషి రూపాన్ని నిలుపుతుంది; అతని మాటను, స్పర్శను, సాన్నిహిత్యాన్ని తిరిగి తీసుకురాలేదు. "ఇంకొకసారి కలుస్తాను... రేపు మాట్లాడతాను... తర్వాత క్షమాపణ చెబుతాను..." అనుకుంటాం. కానీ ఆ అవకాశం ఎప్పటికీ ఉంటుందని హామీ లేదు. అందుకే ప్రేమ ఉన్నప్పుడు చెప్పాలి. తప్పు చేసినప్పుడు క్షమాపణ అడగాలి. మనస్పర్థలను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. కృతజ్ఞత ఉన్నప్పుడు తెలియజేయాలి. ఎదుటివారికి మనం ఎంత విలువ ఇస్తున్నామో వారు ఉన్నప్పుడే అనుభవించేలా చేయాలి. ఒక మనిషి వెళ్లిపోయాక అతని ఫోటోలు, వస్తువులు, జ్ఞాపకాలు మన దగ్గర ఉండొచ్చు. కానీ అతనితో కలిసి గడపకుండా కోల్పోయిన సమయం తిరిగి రాదు. చెప్పకుండా మిగిలిపోయిన మాటలు మనలోనే ఉండిపోతాయి. కాటికి వెళ్లిన మనిషిని కన్నీళ్లతో వెనక్కి తీసుకురాలేం. ఈ మాటల ఉద్దేశం ఎవరినైనా నిందించడం కాదు. మన జీవితంలో ఇంకా మనతో ఉన్నవారి విలువను గుర్తించడం. పరిస్థితుల వల్ల గతంలో చేయలేకపోయిన వాటిని తలచుకుంటూ బాధపడటం కంటే, ఈరోజు మనకు ఉన్న అవకాశాన్ని ప్రేమతో ఉపయోగించుకోవాలి.

ఉన్నప్పుడే పలకరించండి
అవసరంలో ఉన్నప్పుడే ఆదుకోండి
బాధలో ఉన్నప్పుడే ఓదార్చండి
ప్రేమను అనుభవించగలిగినప్పుడే చూపించండి

మనిషి బతికున్నప్పుడే అతని మనసులో మన ఆప్యాయత పూయాలి. అదే అతనికి మనం ఇవ్వగల గొప్ప కానుక.

-మీ నక్క యాదగిరి

సమాచార హక్కు చట్టం
అవినీతికి అడ్డుకట్ట వేసిన విప్లవం

అక్టోబర్ 12... సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన రోజు

భారత ప్రజాస్వామ్య చరిత్రలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని బలపరుస్తూ ప్రజలకు పాలనపై ప్రశ్నించే అధికారం కల్పించిన చట్టం సమాచార హక్కు చట్టం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్న మౌలిక సూత్రానికి న్యాయం చేస్తూ, ఈ చట్టం దేశ ప్రజలకు ఒక విప్లవాత్మక సాధనంగా మారింది. భారత పార్లమెంటు ఆమోదంతో రూపొందిన ఈ చట్టం 2005 జూన్ 15న రాష్ట్రపతి ఆమోదం పొందగా, 120వ రోజు అయిన అక్టోబర్ 12, 2005న దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఆ రోజు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ నూతన అధ్యాయంగా నిలిచి పోయింది. సమాచార హక్కు చట్టం పుట్టుక వెనుక ప్రజా ఉద్యమాల సుదీర్ఘ పోరాటం ఉంది. రాజస్థాన్ రాష్ట్రంలో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (వీఋూ) వంటి సామాజిక సంస్థలు ప్రభుత్వ ఖాతాల పారదర్శకత కోసం చేసిన పోరాటం ఈ చట్టానికి పునాది వేసింది. "ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నడుస్తుంది, కాబట్టి ప్రజలకు లెక్క చెప్పాల్సిందే" అనే నినాదంతో ప్రారంభమైన ఆ ఉద్యమం దేశవ్యాప్త చైతన్యానికి దారితీసింది. చివరికి యూపీఏ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమాచార హక్కు బిల్లును రూపొందించి పార్లమెంటులో ఆమోదింప జేసింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం... ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను, బాధ్యతను పెంచడం. ప్రభుత్వ నిర్ణయాలు, ఫైళ్లు, కాంట్రాక్టులు, టెండర్లు, ఖర్చులు వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా అవినీతి తగ్గించడం, ప్రజా నిధుల వినియోగాన్ని సక్రమంగా పర్యవేక్షించడానికి ప్రజలకు అవకాశం కల్పించడం దీని లక్ష్యం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కింద పౌరులకు ఇచ్చిన మాటల స్వేచ్ఛలో భాగంగానే సుప్రీంకోర్టు సమాచార హక్కును మౌలిక హక్కుగా పరిగణించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వం నుండి సమాచారాన్ని అడిగే చట్టబద్ధ హక్కు ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలు ప్రజలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత వహించాలి. దరఖాస్తు లిఖిత పూర్వకంగా లేదా ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చు. సాధారణంగా సమాచారం ఇవ్వడానికి 30 రోజులు గడువు ఉంటే, జీవితం లేదా స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో 48 గంటల్లోపే సమాధానం ఇవ్వాలి. సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగితే లేదా నిరాకరించినట్లయితే సంబంధిత అధికారిపై రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించే అవకాశం చట్టంలో ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజలు దీన్ని శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, భూముల రికార్డులు, విద్యా నియామకాలు, స్థానిక సంస్థల ఖర్చులు వంటి అనేక అంశాల్లో పౌరులు సమాచారాన్ని కోరారు. అనేక అవినీతి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్రలో భూసంబంధిత అవినీతి కేసులు, ఢిల్లీలో పాఠశాల భవనాల నిర్మాణంలో జరిగిన మోసాలు, బడ్జెట్ వినియోగాల్లో గోప్యతల ఉల్లంఘనలు ఈ చట్టం ద్వారానే బహిర్గతమయ్యాయి. ప్రజల చేతుల్లో ఈ చట్టం నిజమైన ప్రజాస్వామ్య పరికరంగా మారింది. చట్టం అమలుకు సంబంధించి కేంద్ర సమాచార కమిషన్ (జ×జ), రాష్ట్ర సమాచార కమిషన్లు ఏర్పాటు చేయబడ్డాయి. సమాచారం ఇవ్వని అధికారులను ప్రశ్నించడం, ప్రజల పిటిషన్లను విచారించడం వీటి బాధ్యత. తొలి కేంద్ర సమాచార కమిషనర్ వాజహత్ హబీబుల్లా కాగా, అనేక రాష్ట్రాల్లోనూ ఇలాంటి కమిషన్లు ఏర్పాటయ్యాయి. ఈ కమిషన్లు పౌరుల హక్కులను కాపాడడంలో, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను తీసుకు రావడంలో విశేష పాత్ర పోషించాయి. 2019లో చట్టంలో జరిగిన సవరణలతో కమిషనర్ల పదవీకాలం, వేతనాల నిర్ణయాధికారం కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వబడింది. ఈ మార్పులు పారదర్శకతను బలహీన పరిచే అవకాశం ఉందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఇంకా ప్రభావవంతమైన సాధనంగానే ఉంది. అయితే దాని వినియోగం తగ్గిపోవడం, సమాచారం ఇవ్వడంలో ఆలస్యం, కొన్నిసార్లు సమాచారం కోరిన వ్యక్తులపై దాడులు జరగడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల కంటిచూపును నిలబెట్టే వ్యవస్థ ఇది. ప్రజాస్వామ్యం సజీవంగా ఉండాలంటే ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని తెలుసుకొని వినియోగించాలి. అక్టోబర్ 12, 2005న భారత ప్రజాస్వామ్యం మరింత బలపడింది; ప్రజల చేతిలో ఒక పెన్నుతో సత్యాన్ని వెలికితీసే శక్తి అప్పగించబడిన రోజు అది.

-రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవ శోభ

అక్టోబర్ 12నుండి అక్టోబర్ 20 వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అనగానే భక్త జన ప్రవాహం, తన్మయత్వంతో మిన్నంటేలా వారు చేసే గోవింద నామ స్మరణ, మాడ వీధుల్లో దేవేరులతో స్వామి ఊరేగింపులూ, సాటిలేని వైభవంతో సాగే వాహన సేవలు కళ్ళ ముందు కదులుతాయి. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని వివిధ రూపాల్లో, అవతారాల్లో దర్శనం చేసుకున్న వారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తి కావడంతో పాటు.. పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. తిరుమల చరిత్రలో, వందల ఏళ్ళ నుంచీ వివిధ ఉత్సవాల నిర్వహణ జరుగుతున్నది. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి. పురాణాలు, శాసనాల ఆధారంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు 6వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. చక్రవర్తులు, మహారాజులు తమ విజయ పరంపరలకు గుర్తుగా తిరుమలేశుని బ్రహ్మోత్సవాల పేరుతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేవారు. నెలకొకటి చొప్పున ప్రతి ఏటా పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చరిత్ర చెబుతోంది. ఉత్సవాల్లో ఉగ్ర శ్రీనివాస మూర్తిని ఉత్సవ విగ్రహంగా వినియోగించేవారు. క్రీ.శ.1339 నుంచి మలయప్ప కోనలో లభించిన మలయప్ప స్వామిని ఉత్సవ విగ్రహాలుగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. ఒకప్పుడు నెలకు ఒకసారి బ్రహ్మోత్స వాలు జరిగేవట. కొన్ని ఇబ్బందులు, సమస్యల కారణం గా ఏడాదికి ఒకసారి, అధిక మాసంలో రెండుసార్లకు బ్రహ్మోత్సవాలు పరిమితం అయ్యాయి. ఈ వేడుకల్లో శ్రీ వేంకట్వేరుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తకోటికి దర్శన భాగ్యాన్ని కల్పిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితులు తలెత్తినప్పటికీ శ్రీవారి బ్రహ్మోత్సవాలను రద్దు చేయడం తిరుమల క్షేత్ర చరిత్రలో లేదు. కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాలకట్ల) బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగ నున్నాయి. భాద్రపదంలో నిర్వహించే ఉత్సవాలను సాలకట్ల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 11న అంకురార్పణతో ప్రారంభం అయి 20 వరకు నిర్వహించ నున్నారు. బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా, లక్షలాది మంది భక్తుల మధ్య నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. బ్రహ్మోత్స వాలను ప్రారంభించే ముందు ఎటువంటి ఆటంకాలు కలగకుండా, విజయవంతంగా జరగాలని కోరుకుంటూ వైఖానస ఆగమనంలోని క్రతువులలో 11న అంకురార్పణంతో ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. శ్రీవారి సేనాధిపతి అయిన విశ్వక్సేనుల వారి ఆలయానికి నైరుతి మూలలో ఉన్న వసంత మండపానికి ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు చేసి, ఆ మట్టిలో నవధాన్యాలను నాటడాన్ని అంకురార్పణం అంటారు. ప్రతిరోజు ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామివారి వాహన సేవలు జరుగుతాయి.

నేడు రైతులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్

శంకర్‌పల్లి, వెలుతురు అక్టోబర్ 11 : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు (సోమవారం) ఉదయం 11:00 గంటలకు 'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా రాష్ట్ర రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించ నున్నారు. ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులు మరియు వ్యవసాయ రంగంపై వాటి ప్రభావానికి సంబంధించి ఈ ముఖాముఖిలో ముఖ్యమంత్రి గారు కీలక సమీక్ష జరపనున్నారు. శంకర్‌పల్లి మండలంలోని మోకిల రైతు వేదిక, పర్వేద రైతు వేదిక, మహాలింగాపురం రైతు వేదికలలో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం (లైవ్ టెలికాస్ట్) చేయబడుతుందని మండల వ్యవసాయ అధికారిణి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి మరియు ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ ముఖాముఖి కార్యక్రమానికి శంకర్‌పల్లి మండల పరిధిలోని వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులు, ఆయిల్ పామ్ మరియు పాల ఉత్పత్తి రైతులు, సాయిల్ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వ్యవసాయ అధికారి కోరారు. అలాగే గౌరవ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మంచాల వెలుతురు అక్టోబర్ 11: మంచాల మండలం దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరుట్ల గ్రామంలోని వేణుగోపాల స్వామి భజన మండలి ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట డప్పుచప్పులతో దుర్గాదేవి చీరము క్కుపుడక ఊరేగింపుగా వేణుగోపాలస్వామి భజనమండలి మండపం వద్దకు తీసుకొచ్చి దుర్గా దేవిని అలంకరించి అంగరంగ వైభవంగా దుర్గాదేవి విగ్రహప్రతిష్ట పూజాకార్యక్రమం ఘనంగా నిర్వహించారు అనంతరం గ్రామ ఉపసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్ వార్డు సభ్యులు మాడుగుల బాలమని కృష్ణగౌడ్ మొగ్రిపద్మ ఐలయ్య వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు ఈకార్యక్రమంలో వేణుగోపాలస్వామి భజన మండలి సభ్యులు యువకులు భక్తులు గ్రామపెద్దలు పెద్దఎత్తున పాల్గొని దుర్గామాతను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

శక్తీ స్వరూపిణీ" అమ్మవారి కృపా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలి

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 11: దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సీఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధి నార్త్ ఎన్సీఎల్ కాలనీ నోబుల్ పార్క్ లో శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో అమ్మవారి ఉపాసకులు రాచర్ల రవిచంద్ర శర్మ ఆధ్వర్యంలో వారి స్వగృహం నందు నిర్వహించిన చతుషష్టి ఉపచార పూజ, విశేషకలశ స్థాపన పూజా కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.... శక్తీ స్వరూపిణీ అయిన అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో బీఆర్ఎస్‌లోకి బీజేపీ, కాంగ్రెస్ నేతల చేరికలు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- 50 మంది అనుచరులతో బీజేపీ రెండో వార్డు సభ్యుడు ఏనుగు నరేందర్‌రెడ్డి చేరిక
- మాజీ సర్పంచ్ కొమ్మారెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి మద్దతు
- ప్రొద్దుటూరులో రాజకీయ సమీకరణాల్లో మార్పులు

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 11 : శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీలోకి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చేరడంతో గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి సమక్షంలో పలువురు నాయకులు గులాబీ కండువాలు కప్పుకున్నారు. ప్రొద్దుటూరు మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ఏనుగు నరసింహారెడ్డి తనయుడు, ప్రస్తుత రెండో వార్డు సభ్యుడు ఏనుగు నరేందర్‌రెడ్డి బీజేపీని వీడి తన 50 మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఒకేసారి 50 మంది అనుచరులతో నరేందర్‌రెడ్డి చేరడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా ప్రొద్దుటూరు మాజీ వార్డు సభ్యుడు నాని రత్నం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచ్ కొమ్మారెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి సైతం బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు. సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు. బొల్లారం జంగారెడ్డి కూడా బీఆర్ఎస్‌లో చేరారు.

గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం

మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరు మాజీ సర్పంచ్ ఏనుగు నరసింహారెడ్డి, బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన నక్క మల్లేష్, పదో వార్డు సభ్యుడు తిరుపతిరెడ్డి, మూడో వార్డు సభ్యురాలు అనిత, రమేష్ తదితరులు సహకరించారు. గ్రామంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించే దిశగా నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు గోపాల్‌రెడ్డి, పెంటరెడ్డి, వార్డు సభ్యులుగా పోటీ చేసిన నక్క రాణి మాణిక్యం, బూడిదుల అరుణ మల్లేష్, మాజీ వార్డు సభ్యుడు గౌండ్ల వీరేశం, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు నాని ప్రభాకర్, బి. మల్లేష్, బి. మాణిక్యం, కె. బ్రహ్మం, నక్కరాజు, నక్కమాణిక్యం, నక్కకృష్ణ, బి. మహేష్, నాని భాను ప్రసాద్, బి. బన్నీ, డి. కిరణ్, నక్క నర్సింలు, బి. రామచందర్, బి. యాదయ్య, నక్కవిశాల్, నక్కగణేష్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మరిన్ని చేరికలపై చర్చ

ప్రొద్దుటూరులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ వైపు అడుగులు వేయడంతో గ్రామ రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై చర్చ జరుగుతోంది. రాబోయే రోజుల్లో మరికొందరు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని స్థానికంగా ప్రచారం సాగుతోంది. తాజా చేరికల నేపథ్యంలో గ్రామంలో రాజకీయ పరిణామాలు. ఎలా మారుతాయనే ఆసక్తి నెలకొంది

నేడే శంకర్పల్లి, మోకిల 'ప్యాక్స్' నూతన చైర్మన్ల ప్రమాణస్వీకారం

శంకర్పల్లి, వెలుతురు అక్టోబర్ 11 : శంకర్పల్లి, మోకిల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన చైర్మన్లు నేడు అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. శంకర్పల్లి 'ప్యాక్స్' చైర్మన్‌గా ఎన్నికైన బొల్లారం వెంకటరెడ్డి, మోకిల 'ప్యాక్స్' చైర్మన్‌గా ఎన్నికైన గౌంఢ్ర సత్యం లు ఈ ప్రమాణస్వీకార కార్యక్రమాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు సహకార సంఘాల కార్యాలయాల్లో సర్వం సిద్ధం చేశారు. ఈ ప్రమాణస్వీకార మహోత్సవాలకు నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల డైరెక్టర్లు, భారీ సంఖ్యలో రైతులు హాజరుకానున్నారు. సొసైటీల పరిధిలోని రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, నూతన పాలకవర్గాలు సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయాలని స్థానిక రైతాంగం ఆకాంక్షిస్తోంది

శంకర్‌పల్లిలో వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

- బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన జగన్మాత!
- సింగపూర్ వార్డులో శాస్త్రోక్తంగా ఘటస్థాపన
- అక్టోబర్ 20న విజయదశమితో ముగింపు

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 11 : చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని శంకర్ పల్లి మున్సిపాలిటీలో పరమ పవిత్రమైన శరన్నవరాత్రి ఉత్సవాలు (దేవీ నవరాత్రులు) ఆదివారం నుండి అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని సింగపూర్ వార్డులో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని భక్తులు ఉదయాన్నే మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కలశస్థాపన (ఘటస్థాపన) మహోత్సవాన్ని నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల మొదటి రోజైన ఆదివారం నాడు జగన్మాత భక్తులకు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయాలను, పూజా పండళ్లను రంగురంగుల విద్యుత్ దీపాలు, సువాసనలు వెదజల్లే పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. నేటి నుండి తొమ్మిది రోజుల పాటు జగన్మాత అయిన దుర్గాదేవిని ఒక్కో రోజు ఒక్కో విశిష్ట రూపంలో అలంకరించి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. నిత్యం ప్రత్యేక అర్చనలు, నైవేద్య సమర్పణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో సాగే ఈ శరన్నవరాత్రి వేడుకలు అక్టోబర్ 20వ తేదీన నిర్వహించే విజయదశమి (దసరా) మహా వేడుకలతో ముగుస్తాయని వారు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

హిమాచల్ ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీతో ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ ఒప్పందం

- న్యాయ విద్య, పరిశోధనలో పరస్పర సహకారం
- విద్యార్థులకు, అధ్యాపకులకు మరిన్ని విద్యా, ఉద్యోగ అవకాశాలు
- సిమ్లాలో జరిగిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందం పై సంతకాలు

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 11 : న్యాయ విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థులకు మరిన్ని మెరుగైన అవకాశాలు కల్పించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ కు చెందిన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, సిమ్లాలోని హిమాచల్ ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీ ల మధ్య ఒక చారిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదిరింది. సిమ్లాలోని హెచ్ పి ఎన్ ఎల్ యు ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్ పి ఎన్ ఎల్ యు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డా.) ప్రీతి సక్సేనా, ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (డా.) విజేందర్ కుమార్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరు విద్యాసంస్థలకు చెందిన పలువురు అధ్యాపకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఒప్పందంలోని ముఖ్యమైన అంశాలు:

ఈ భాగస్వామ్యం ద్వారా రెండు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు సంయుక్తంగా పలు కార్యక్రమాలను చేపట్టనున్నాయి. ఇందులో భాగంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి సెమినార్లు, సదస్సులు, వర్క్‌షాప్‌లు, అధ్యాపకుల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే అధ్యాపకులు-విద్యార్థుల మార్పిడి, సంయుక్త పరిశోధనలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, పరిశోధనా వ్యాసాల ప్రచురణతో పాటు రెండు సంస్థల గ్రంథాలయాలు, డిజిటల్ విద్యా వనరులను పరస్పరం వినియోగించుకోనున్నారు. వీటితో పాటు ఉచిత న్యాయ సహాయ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలను కూడా విస్తృతంగా ప్రోత్సహించనున్నారు.

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధే లక్ష్యం

ప్రొఫెసర్ విజేందర్ కుమార్

ఈ సందర్భంగా ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (డా.) విజేందర్ కుమార్ మాట్లాడుతూ.. న్యాయ విద్యార్థులకు కొత్త అవకాశాలను కల్పించడంలో ఐసీఎఫ్ఏఐ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు కేవలం నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, వారికి ఆచరణాత్మక పరిజ్ఞానం, పరిశోధన అనుభవం, వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించుకునేలా చేయడం తమ ముఖ్య లక్ష్యమన్నారు. హెచ్ పి ఎన్ ఎల్ యుతో కుదిరిన ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు మరిన్ని విస్తృత అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, ఇరు సంస్థల అనుభవాలు, నైపుణ్యాల మార్పిడి వల్ల న్యాయ విద్య నాణ్యత మరింత మెరుగుపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

విజ్ఞాన మార్పిడికి అద్భుత వేదిక

ప్రొఫెసర్ ప్రీతి సక్సేనా హెచ్

పి ఎన్ ఎల్ యు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డా.) ప్రీతి సక్సేనా మాట్లాడుతూ.. ఈ భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకులకు సరికొత్త మార్గాలను అన్వేషించేందుకు ఉపయోగపడటంతో పాటు న్యాయ విద్య, పరిశోధన రంగాల్లో మరింత ప్రగతికి దోహదపడుతుందని తెలిపారు. విద్యాసంస్థల మధ్య ఇలాంటి సహకారం వల్ల విజ్ఞాన మార్పిడి పెరగడంతో పాటు, ప్రస్తుత న్యాయ రంగంలో వస్తున్న మార్పులు, సవాళ్లపై సమర్థవంతంగా పనిచేసే అవకాశం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా రెండు విద్యాసంస్థల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, పరిశోధన అవకాశాలు, వృత్తిపరమైన అనుభవం అందించడంతో పాటు భవిష్యత్తులో దేశానికి అవసరమైన సమర్థులైన న్యాయ నిపుణులను తీర్చిదిద్దేందుకు ఈ భాగస్వామ్యం ఎంతో కీలకంగా మారనుంది.

శ్రీ గాయత్రి నగర్ కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి వినతి



ఎల్బీనగర్ వెలుతురు అక్టోబర్ 11: శ్రీ గాయత్రి నగర్ కాలనీలో నెలకొన్న రహదారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారికి, జెక్కిడి రఘువీర్ రెడ్డి గారికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో పాఠశాల బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా వర్షాకాలంలో రహదారుల పరిస్థితి కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని కమిటీ సభ్యులు వివరించారు. కాలనీవాసులు నిత్యం ఎదుర్కొంటున్న ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కాలనీలోని రెండు ప్రధాన "30 అడుగుల సీసీ రోడ్ల" నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు, ఇందులో భాగంగా

1) "కాలనీ కమిటీ హాల్ నుంచి వీరన్నగుట్టకు వెళ్లే 30 అడుగుల రహదారి ,

2) "గ్రీన్ సిటీ కాలనీ నుంచి జెల్లా యాదవ్" నగర్‌కు వెళ్లే 30 అడుగుల" రహదారి.

ఈ రెండు రహదారులు అభివృద్ధి చెందితే పాఠశాల బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలు సులభతరమవుతాయని, కాలనీవాసులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు:- దూడల అంజయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి:- ఒంటెద్దు (చిన్న) బాలకృష్ణ, కోశాధికారి:- మైల శ్రీకాంత్ యాదవ్ తో పాటు కమిటీ సభ్యులు గురుమూర్తి, సత్యనారాయణ , నరసింహ, రవీందర్, రాజు, రాజు యాదవ్, శేఖర్ బాబు, శ్రీశైలం యాదవ్, కృపారావు, పెద్ద బాలకృష్ణ ,భాస్కర్, జగదీష్, రమేష్, సాయి, గంగాధర్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు. కాలనీలోని ప్రధాన రహదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటా

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 11: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో ఇటీవల జరిగిన కార్మిక సంఘాల ఎన్నికల్లో జీడిమెట్ల డిపో నుంచి బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ – ఈఎంయూ – ఎన్ఎంయూ కూటమి ప్రత్యర్థి కూటమి అయినా ఈడబ్ల్యూయూ – టిడబ్ల్యూయూ – ఐఎన్టియుసి కూటమిపై 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా జలిగం రాకేష్ అధ్యక్షులుగా గెలిచారు. ఈ సందర్భంగా ఈరోజు ఉదయం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద జీడిమెట్ల డిపోకు చెందిన ఎంప్లాయిస్ యూనియన్ – ఈఎంయూ – ఎన్ఎంయూ కూటమి సభ్యులు గౌరవాధ్యక్షులు జలిగం రాకేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ....కార్మిక సంఘాల ఎన్నికలలో గెలుపు కార్మికుల సంక్షేమం పట్ల నూతన కమిటీ సభ్యులపై మరింత బాధ్యతను పెంచుతుందని, కార్మిక సంక్షేమం విషయంలో నూతన కమిటీకి నావంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం అధ్యక్షులుగా ఎన్నికైన జలిగం రాకేష్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ కోల రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రాపోలు, బాబు, అధ్యక్షులు జ్ఞానేశ్వర్, జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సభ్యులు పాషా, అంకం రావు, బిఎల్.నారాయణ, మహిళా నాయకురాలు క్రిష్ణా భాయ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు నాయకులకు అండగా ఉంటా

- అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే నాలక్ష్యం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- బోడకొండ గ్రామంలో 30మంది కాంగ్రెస్ పార్టీలో చేరిక

మంచాల వెలుతురు అక్టోబర్ 11: మంచాల మండలం బోడకొండ గ్రామానికి చెందిన30మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయ కులు మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్మనరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రంగారెడ్డి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోచేరారు ఈ సందర్భం గా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు మాట్లాడుతూ ప్రతీ కాంగ్రెస్ పార్టీ నాయకుడికి కార్యక ర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను అన్నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రతి సంక్షేమ పథ కం అర్హులైన పేదకుటుంబాలకు అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తాను మంచాల మండలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసి ఒక ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడమే నాలక్ష్యం అని అన్నారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోచేరిన దేవసోత్ అథీరామ్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రంగారెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరాం అని అన్నారు కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు జాటోత్ నాయక్ బానోత్ మోహన్ నాయక్ జాటోత్ నవీన్ నాయక్ జాటోత్ దేవారామ్ రమేష్ నాయక్ కాట్రోత్ సన్నీ రమేష్ ప్రవీణ్ పవన్ చింటూ లక్ష్మణ్ కొర్ర ప్రవీణ్ చేరారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వింజ మూరు ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుండెమోనిమల్లేష్ ముదిరాజ్ మంచాల సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ బోడకొండ మాజీ సర్పంచ్ దండు నరసింహగౌడ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్రపాండు నాయక్ సపవత్ శ్రీధర్ నా యక్ సత్తితండా సర్పంచ్ తుకారాంనాయక్ జాటోత్ గుండమ్మ బాలునాయక్ సంతోష్ నాయక్ రాట్ల రాజేష్ జాటోత్ లచ్చిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

మునుగోడు ప్రజల తాగు, సాగునీటీ అవసరాలు తీర్చే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

డిండి సాగునీటి ఎత్తిపోతల పథకం పై తెలంగాణ రిటైర్ట్ ఇంజనీర్ల ప్రతినిదులతో సమీక్ష సమావేశంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా డిండి ఎత్తిపోతల పథకానికి, దీనికి కొనసాగింపుగా ఉన్న మునుగోడు నియోజకవర్గంలోని లక్ష్మణాపురం,శివన్న గూడెం రిజర్వాయర్ల కు నీటిని ఎక్కడి నుండి తరలించాలనే విషయం పై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేయడంతో ...ప్రజా ప్రబుత్వం అదికారంలోకి వచ్చాక మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారి చొరవతో ప్రజా ప్రభుత్వం ఏదుల రిజర్వాయర్ నుండి నీటి తరలించాలని నిర్ణయించింది.. .వాటికి సంబందించిన పనులకు గాను 1800 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది.. ఏదుల రిజర్వాయర్ నుండి నీటిని తరలించే పనులు, మునుగోడు నియోజకవర్గం లోని లక్ష్మణా పురం, శివన్నగూడెం ప్రాజెక్టుల కింద ఉన్న హెడ్ వర్క్స్ పనులకు సంబందించి హైదరాబాద్ లోని తన నివాసంలో తెలంగాణా రిటైర్డ్ ఇంజనీర్ల ప్రతినిదుల బ్రుందంతో సమీక్షా సమావేశం నిర్వహించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఏదుల రిజర్వాయర్ నుండి నీటిని తరలించాలని క్యాబినేట్ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా భూ సేకరణ, హెడ్ వర్క్స్ పనులతో పాటు సంబందిత అన్ని పనులు పూర్తయ్యే విదంగా ప్రభుత్వంతో మాట్లాడుతానని రిటైర్ట్ ఇంజీనర్ల ఫోరం ప్రతిని దులకు తెలిపారు...ఏదుల రిజర్వాయర్ నుండి నీటి తరలింపు పైకొంత చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యదిక ఫ్లోరైడ్ రక్కసితో ఇబ్బందిపడుతున్న మునుగోడు నియోజకవర్గ ప్రజల త్రాగు, సాగునీటీ అవసరాలు తీర్చే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అద్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి, ప్రదాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం, సలహాదారులు వి.వెంకటరామారావు, ఎం.సత్తిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జగదీశ్వర్‌లు పాల్గొన్నారు.

మండల కేవైసీఎస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మునుగోడు, అక్టోబర్ 11 (వెలుతురు):
కురుమ యువ చైతన్య సమితి (కేవైసీఎస్) మునుగోడు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్గొండ జిల్లా కేవైసీఎస్ అధ్యక్షుడు బండారు శంకర్ కురుమ ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీ ఏర్పాటు కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కేవైసీఎస్ అధ్యక్షుడు కుండే వెంకటేష్ కురుమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మందుల అయ్యన్న కురుమ, అధ్యక్షుడిగా బోడిశ మల్లేష్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బండారు మహేష్‌కురుమ, ప్రధాన కార్యదర్శిగా బీజిని పరమేష్ కురుమ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బాలం క్రిష్ణ కురుమ,అన్నం శ్రీకాంత్ కురుమ, బైరిగూడ మల్లేష్ కురుమ,కోశాధికారిగా కనకాల లింగ స్వామి కురుమ,కార్యదర్శిగా దెందే వెంకటేష్ కురుమ,ప్రచార కార్యదర్శులుగా అందేర్కా లింగస్వామి కురుమ,బాలం శివకుమార్ కురుమ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోటె రవి కురుమ,ఉపాధ్యక్షుడు మందుల సత్యం కురుమ, కోశాధికారి రావుల ఐలయ్య కురుమ, కార్యదర్శి మందుల సైదులు కురుమ,ప్రచార కార్యదర్శి బండారు శ్రీశైలం కురుమ,నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నం శ్రీకాంత్, ఉపాధ్యక్షులు దెందే మల్లేష్ కురుమ, బండారు శ్రీనివాస్ కురుమ,గ్రామ పెద్దలు, మందుల అశోక్, యువకులు,కురుమ సోదరులు హాజంయ్యారు. నూతన కమిటీ సభ్యులకు జిల్లా కమిటీ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

డిండి ప్రాజెక్టును రద్దు చేయాలని హక్కు వారికి లేదు

- **డిండికి నేరుగా శ్రీశైలం నుండి నీళ్లు తీసుకురావడం సాధ్యమా?**
- **పాలమూరు జిల్లా నేతల వ్యాఖ్యలు సరైనవి కావు: కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్**

సంస్థాన్ నారాయణపూర్ వెలుతురు అక్టోబర్ 11:
డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల రిజర్వాయర్ నుండి కాకుండా నేరుగా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి నీళ్లు తీసుకోవడం సాధ్యమా అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్ ప్రశ్నించారు.ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ఏదుల రిజర్వాయర్ నుండి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నీళ్లు తీసుకుపోవద్దని, డిండి ప్రాజెక్టుని రద్దు చేయాలని పాలమూరుకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించిందే కానీ, నీళ్లు ఎక్కడి నుంచి తీసుకురావాలో నిర్ణయం చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏదుల రిజర్వాయర్ నుండి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో తీర్మానం చేసి, అందుకు అవసరమైన రూ. 1800 కోట్లు మంజూరు చేసి, టెండర్ ఖరారు చేసి పనులు ప్రారంభించిన తర్వాత, మళ్లీ ఇప్పుడు శ్రీశైలం నుండి నేరుగా నీళ్లు తీసుకుపోవాలని కొందరు, ప్రాజెక్టును రద్దు చేయాలని మరికొందరు మాట్లాడుతూ రాద్ధాంతం చేయడం న్యాయం కాదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలు పోగా, మిగిలిన 30 టీఎంసీలు డిండి ఎత్తిపోతల పథకంలోని రిజర్వాయర్లకు తీసుకునే హక్కుఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధానికి దగ్గరలోనే ఉండి, అభివృద్ధికి నోచుకోక తాగడానికి, వ్యవసాయానికి సాగునీరు లేక, ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరిన్ సమస్యతో సంవత్సరాల తరబడి బాధపడుతున్న విషయం ప్రపంచానికి తెలియనిది కాదన్నారు. అభివృద్ధికి నోచుకోని ఈ ప్రాంత ప్రజలకు తాగడానికి, పంటలకు నీళ్లు తీసుకుపోవద్దని అనే హక్కు ఎవరికి లేదన్నారు . డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు నేరుగా శ్రీశైలం నుంచి, నార్లాపూర్ రిజర్వాయర్ నుండి నీళ్లు తేవడం సాధ్యం కాదని ఇంజనీర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని, దానికి 10 నుండి 15 వేల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యే అవకాశం ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదని ఇంజనీర్లు చెబుతున్నందున, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఏదుల రిజర్వాయర్ నుండే డిండి ప్రాజెక్టుకు నీటిని తీసుకురావాలని, ప్రారంభించిన పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అప్రకటిత విద్యుత్ కోతల పై రైతుల ఆందోళన

, నిజామాబాద్ : మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి గ్రామంలో అప్రకటిత విద్యుత్ కోతలకు నిరసనగా రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. పంటలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. అనంతరం రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది.
రైతుల ఆందోళనతో రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను అరెస్టు చేశారు. రైతుల అరెస్టును ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని,రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జీవన్‌రెడ్డి కోరారు. పంటలకు నిరంతరాయంగా విద్యుత్ అందించడంతో పాటు అప్రకటిత విద్యుత్ కోతలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

మునుగోడు అక్టోబర్ 11 (వెలుతురు):
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు మునుగోడులో అంగరంగ వైభవంగా జరిగాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళల ఆటపాటలు, జానపద గీతాలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మెగా బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరయ్యారు.ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి మహిళలతో కలిసి బతుకమ్మలను తీసుకొచ్చి, వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. 15 అడుగుల భారీ బతుకమ్మకు హారతి ఇచ్చి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పల్లెపాటల నుంచి ఆధునిక డీజే పాటల వరకు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు.
బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రతీకని లక్ష్మి పేర్కొన్నారు. ప్రతి ఆడపడుచు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి తరతరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు.ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి బతుకమ్మ ఆడుతున్న మహిళల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తమ అభిమాన నాయకుడిని మహిళలు సాదరంగా స్వాగతించారు. వేడుకలకు వచ్చిన మహిళలకు భోజన ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం అనంతరం భోజనాలు చేసి ఇళ్లకు తిరుగుపయనమయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సారస్ మేళాను ప్రారంభించిన మంత్రి సీతక్క

- **మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడమే లక్ష్యం**
- **మహిళలు పొదుపు సంఘాల సభ్యుల నుంచి వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి**
- **తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల మహిళా సంఘాల స్టాళ్లను సందర్శించి, ఉత్పత్తులను పరిశీలించిన మంత్రి**
- **మహిళలు తయారు చేసిన వంటకాలను రుచి చూసి, చిన్నారులు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించిన సీతక్క**

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11
హైదరాబాద్: గ్రామీణ మహిళల ప్రతిభకు, సృజనాత్మకతకు, స్వయం ఉపాధి అవకాశాలకు వేదికగా నిలుస్తున్న సారస్ గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళాను ఫ్రపఎఖ గ్రౌండ్లో మంత్రి సీతక్క ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. డప్పు చప్పుళ్లు, కోయ నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనల మధ్య మేళా ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి మేళాను ప్రారంభించిన మంత్రి, తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.
మహిళలు స్వయంగా తయారు చేసిన హస్తకళా వస్తువులు, చేనేత ఉత్పత్తులు, సంప్రదాయ కళారూపాలు, గృహోపకరణాలు, ఆహార పదార్థాలు, పచ్చళ్లు, చిరుతిళ్లు, చిరుధాన్యాల ఉత్పత్తులను ఆసక్తిగా పరిశీలించారు. ఒక్కో స్టాల్ వద్దకు వెళ్లి మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తుల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. వాటి తయారీ విధానం, నాణ్యత, ధరలు, విక్రయాలు, వినియోగదారుల నుంచి వస్తున్న స్పందన గురించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. వ్యాపార నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంలో ఉన్న ఇబ్బందులు, వ్యాపారాన్ని మరింత విస్తరించుకునేందుకు ఉన్న అవకాశాలపై ఆరా తీశారు.
మహిళలు తమ కష్టంతో, నైపుణ్యంతో తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడంతో పాటు, వారు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు. మహిళలు తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు కేవలం పొదుపు చేయడం, రుణాలు పొందడానికే పరిమితం కాకుండా ఉత్పత్తిదారులుగా, వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళల్లో అపారమైన ప్రతిభ, నైపుణ్యం, సృజనాత్మకత ఉన్నాయని, వారికి తగిన శిక్షణ, ఆర్థిక సహకారం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే విజయవంతమైన వ్యాపారాలను నిర్వహించగలరని అన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు పట్టణ ప్రాంతాల్లోనూ, జాతీయ స్థాయిలోనూ మార్కెట్ కల్పించేందుకు సారస్ వంటి మేళాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా పరస్పర అనుభవాలను పంచుకునే అవకాశం కలుగుతుందని, కొత్త వ్యాపార ఆలోచనలు, మార్కెటింగ్ పద్ధతులను తెలుసుకునేందుకు వీలవుతుందని వివరించారు.
మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఉత్పత్తుల నాణ్యతతో పాటు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్, ధరల నిర్ణయం, డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చిన్న స్థాయిలో ప్రారంభించిన వ్యాపారాలను క్రమంగా విస్తరించుకుంటూ ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మహిళా సంఘాలకు ప్రభుత్వ చేయూత

మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం బ్యాంకు రుణాలు, వడ్డీ రాయితీ ప్రయోజనాలు, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి కార్యక్రమాలు, వ్యాపార అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.
సంఘాల సభ్యులు సమష్టిగా పనిచేస్తూ ఉత్పత్తి, విక్రయాలు, మార్కెటింగ్ రంగాల్లో తమ సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. మహిళల ఉత్పత్తులకు నిరంతర మార్కెట్ అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని చెప్పారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమే కాకుండా పిల్లల విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.
మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా అభివృద్ధి చెందుతుందని, మహిళల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం, గిట్టుబాటు ధర లభించినప్పుడే వారి సాధికారతకు నిజమైన అర్థం ఉంటుందని వివరించారు.

మహిళలు తయారు చేసిన వంటకాలను రుచి చూసిన సీతక్క

సారస్ మేళా ప్రాంగణంలో మంత్రి సీతక్క కలియ తిరుగుతూ మహిళా సంఘాల స్టాళ్లను సందర్శించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వంటకాలను రుచి చూసి, వాటి తయారీ విధానం, ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ మహిళలు సంప్రదాయ వంటకాలను వ్యాపార ఉత్పత్తులుగా మలచడం, స్థానిక ఆహార పదార్థాలకు మార్కెట్ కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.
అనంతరం చిన్నారులు, కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. డప్పు చప్పుళ్లు, కోయ నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు మేళాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ కళారూపాలను ప్రతిబింబించే ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

మహిళా ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించండి

సారస్ మేళా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంతో పాటు, గ్రామీణ ప్రతిభను ప్రజలకు పరిచయం చేసే వేదికగా నిలుస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల ప్రత్యేక ఉత్పత్తులను ఒకేచోట చూసి, కొనుగోలు చేసే అవకాశం ప్రజలకు లభిస్తుందని తెలిపారు.
మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులను ప్రజలు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని, స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహిళల చేతివృత్తులు, సంప్రదాయ నైపుణ్యాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రజల ప్రోత్సాహం తోడైతే గ్రామీణ మహిళల ఆదాయం పెరుగుతుందని, మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు.
మహిళా సాధికారత, స్వయం ఉపాధి, గ్రామీణ ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పన లక్ష్యంగా నిర్వహిస్తున్న సారస్ మేళా మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి, వారి ఉత్పత్తులకు గుర్తింపు తీసుకురావడానికి దోహదపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, సెర్ప్ డైరెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 11:
కౌడిపల్లి మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. బి ఆర్ఎస్ మండలాధ్యక్షుడు సారా రామా గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో ఆరు గ్యారెంటీ ల పేరుతో కాంగ్రెస్ పార్టీ 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి ఆరు గంటల కరెంటును అందులోను వాజ పేరుతో గంట కోత పెడుతున్నారని మరియు లో వోల్టేజ్ కరెంట్ ఇవ్వడంతో రైతుల పొలాలు ఎండిపోతున్నాయని, రైతులు లక్షల పెట్టుబడి పెట్టి నష్టపోతున్నారని ఇందుకు నిరసనగా రేపు అనగా సోమవారం 12/10/2026 న కౌడిపల్లి మండల కేంద్రంలో రైతులకు మద్దతుగా ధర్నా మరియు రాస్తారోకో చేపట్టనున్నట్లు తెలిపారు ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీతా లక్ష్మారెడ్డి హాజరవుతారని ఈ ధర్నాకు పెద్ద ఎత్తున రైతులు, బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు సకాలంలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్ రెడ్డి సర్పంచులు కుమార్, కుందలి శేఖర్, శివానందరెడ్డి, బాలకృష్ణ, గణేష్, మరియు నాయకులు పోలా నవీన్ కుమార్, సందీప్, పురుషోత్తం, రవి సాగర్, యాదుల్,సంజీవ్, శ్రీనివాస్ రాజిరెడ్డి ,ముర్షత్ ,సత్యం, అశోక్ గౌడ్ ,సంతోష్ గౌడ్, జగన్ ,తదితరులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరి దేవిగా జగన్మాత దర్శనం

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:
ఎక్కెల్లి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో జగన్మాత శ్రీ అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో తరలివస్తున్నారు. బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జగన్మాత అనుగ్రహంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. ఎక్కెల్లి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు భక్తిభావ వాతావరణంలో కొనసాగుతున్నాయి.

70వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలు ప్రారంభం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రంగినేని ట్రస్ట్‌లో ఆదివారం నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి అండర్--17 బాలికల క్రికెట్ క్రీడోత్సవాల కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారిణులను ప్రోత్సహించారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి పాల్గొనే బాలికలు తమ ప్రతిభను చాటుకోవాలని, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థినులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగడంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. బాలికలకు క్రీడల్లో మరిన్ని అవకాశాలు కల్పించడం, వారి ప్రతిభను వెలికి తీయడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

ఎస్ఐఆర్ పై రాజకీయ ప్రయోజనం పొందడమే కాంగ్రెస్ లక్ష్యం

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పై కాంగ్రెస్, సిజెపి ఆందోళనలు సరికాదు..
- నకిలీ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించవద్దా...?
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 11:
కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియ పై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తూ విషప్రచారం చేస్తున్నాయని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై గందరగోళం సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యమనిబిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిజెపి తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా కాంగ్రెస్ , సిజెపి ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం భారత ఎన్నికల సంఘం బిజెపి ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో నకిలీ ఓట్లను తొలగించి

అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే 'ఎస్ ఐ ఆర్' ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సర్ పై అనవసర రాద్ధాంతం చేయడమే లక్ష్యంగా వ్యవహారాలు చేస్తున్న కాంగ్రెస్ , సిజెపి వైఖరి పట్ల ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నకిలీ ఓట్లు , మరణించిన వారి ఓట్లు తొలగించవద్దు అని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఇదేమి ప్రథమం కాదని , భారత ఎన్నికల సంఘం గతంలో 1952, 1957, 1961, 1965--66, 1983--84, 1987--89, 1992--95 2002--2004 లలో ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను నిర్వహించిందని గుర్తు చేశారు.

సుదీర్ఘ విరామం తర్వాత 2025 మరియు 2026 లలో దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఈ సర్ "సర్వేను చేపట్టిందన్నారు.. అయితేప్రతిపక్ష పార్టీలు ఓటర్లలో గందరగోళం సృష్టించి ఓటు బ్యాంకు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు చేపట్టిన ఈ ప్రక్రియను రాజకీయం చేయడం సరికాదన్నారు. బిజెపి ఓట్ చోరీ చేస్తుందని మాట్లాడుతున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఓట్ చోరీ తోనే గెలిచి 50 ఏళ్లు దేశాన్ని పాలించిందా..? అనే విషయాన్ని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలని ఏకైక ఎజెండాతో కాంగ్రెస్ దేశ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తుందని ఆయన ఆరోపించారు. పూర్తి పారదర్శకతతో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై , చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలంతా గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ కేంద్రంగా ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, సిజేపీలు ఈ విషయంలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను, వైఖరిని విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజెపి మండలాధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, ఓదెలు,బుర్ర శ్రీనివాస్ గౌడ్ మధుకర్ రెడ్డి , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

గోడిగార్‌పల్లిలో జీపీఎల్ సీజన్-5 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:
క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలిచినవారు పొంగిపోకుండా, ఓడినవారు కుంగిపోకుండా క్రమశిక్షణతో ముందుకు సాగాలని గోడిగార్‌పల్లి గ్రామ సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి అన్నారు. ఆదివారం జహీరాబాద్

నియోజకవర్గ పరిధిలోని గోడిగార్‌పల్లి గ్రామంలో జీపీఎల్ సీజన్-5 (2026) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారులను, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా మొగుడంపల్లి సర్పంచ్ రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో యువత సెల్‌ఫోన్లకు పరిమితమవడం ఆందోళనకరమన్నారు. ప్రతి గ్రామంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతను సన్మార్గంలో నడిపించవచ్చని తెలిపారు. గ్రామ సర్పంచులు చొరవ తీసుకొని టోర్నమెంట్లు నిర్వహించాలని కోరారు. క్రీడల్లో పట్టుదల, క్రమశిక్షణతో ఆడే జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.
ఎల్ఐసీ జోనల్ సభ్యుడు ఈ. విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. క్రీడలు యువతను ఆరోగ్యవంతంగా ఉంచడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు దోహదపడతాయన్నారు. క్రికెట్‌లో ప్రతిభను చాటుకుంటే ఐపీఎల్, భారత జట్టు వంటి ఉన్నత వేదికలపై ఆడే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ. 80 వేల నగదుతో పాటు విన్నర్ ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ. 40 వేల నగదుతో పాటు రన్నరప్ ట్రోఫీ అందజేయనున్నట్లు సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి వెల్లడించారు. మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖాన్ జమాల్‌పూర్ సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, మొగుడంపల్లి సర్పంచ్ రాజు, సీనియర్ నాయకులు, లియాఖీ సంఘం జహీరాబాద్-నారాయణఖేడ్ అధ్యక్షుడు ఈ. విఠల్ గౌడ్, డీలర్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ పండు, మాజీ సర్పంచ్ జయరాజ్, మాజీ ఎంపీటీసీ బిచప్ప, హెడ్ కానిస్టేబుల్ రాజు నాయక్, వార్డు సభ్యుడు టీ. సిద్ధయ్య, నిర్వాహకుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కోహిర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా పోచారం అశోక్

మండల అభివృద్ధికి కృషి చేస్తా: పోచారం అశోక్...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ పోచారం అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని సర్పంచ్‌లు ఏకాభిప్రాయంతో ఆయనను ఫోరం నూతన అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అశోక్ ఎన్నికపై తోటి సర్పంచ్‌లు, రాజకీయ నాయకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి, సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడు పోచారం అశోక్ మాట్లాడుతూ.. కోహిర్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, సర్పంచ్‌ల మధ్య ఐక్యతను మరింత బలోపేతం

చేస్తానని తెలిపారు. గ్రామాల సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేస్తానని పేర్కొన్నారు. అశోక్‌ను ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్న వారిలో బిలాల్‌పూర్ సర్పంచ్ స్వర్ణకళ అశోక్, దిగ్వాల్ సర్పంచ్ అహ్మద్ అలీ, బడంపేట్ సర్పంచ్ దయానంద్, చింతల్‌ఘాట్ సర్పంచ్ విద్యాసాగర్, గొట్టిగార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ విశ్వనాథ్, కవేలి సర్పంచ్ సయ్యద్ నాజియా, మద్రి సర్పంచ్ వసంత, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ రాజేశ్వరి, పర్వపల్లి సర్పంచ్ బిచ్చన్న, పోతిరెడ్డిపల్లి సర్పంచ్ నర్సమ్మ, రాజనెల్లి సర్పంచ్ అమృతప్ప, సిద్ధాపూర్ సర్పంచ్ చవాన్ రమేష్, పిచర్యాగడి సర్పంచ్ అమృత వీరారెడ్డి తదితరులు ఉన్నారు. వీరంతా చరవాణిలో చర్చించుకుని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం

గజ్వేల్: దేశ రక్షణ కోసం సైనికులు చేసిన త్యాగాలు వెలకట్టలేనివని, మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా కృషి చేస్తామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో నిర్వహించిన సిద్దిపేట జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవానికి ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో నిరంతరం విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రత కోసం సైనికులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, ఎన్నో కష్టాలను ఎదుర్కొని దేశ సేవకు జీవితాలను అంకితం చేసిన సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం మాజీ సైనికులు ఎదుర్కొంటున్న పెన్షన్లు, ఆరోగ్య సేవలు, ఉపాధి తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. వారి సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేశం కోసం సేవలందించిన సైనికులకు గౌరవం ఇవ్వడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం మరింత బలోపేతమై, సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఆజాద్ ఫౌండేషన్ విద్యార్థుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన, నాయకులు బొంపల్లి మనోహరరావు, పంగా మల్లేశం, లింగాయపల్లి యాదగిరి, జీడిపల్లి రాంరెడ్డి, పర్వేజ్, సంతోష్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బందేల సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీల చంద్రం, సంయుక్త కార్యదర్శి ఐలేని స్కైలాబ్‌రెడ్డి, ఎం.వి. రమణరెడ్డి, సంఘం సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శివాజీ చరిత్రను రాజకీయాలకు వాడుకోవద్దు

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఒక మతానికి పరిమితం చేయడం సరికాదని, ఆయన ప్రజల సంక్షేమం, రాజ్య భద్రతకు ప్రాధాన్యమిచ్చిన గొప్ప ప్రజా నాయకుడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మహనీయుల చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకూడదని పేర్కొన్నారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శివాజీ మహారాజ్ చరిత్రను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటోందని జగ్గారెడ్డి ఆరోపించారు. శివాజీ పాలనలో ముస్లింలు సైతం ఉన్నత పదవుల్లో పనిచేశారని, దౌలత్ ఖాన్, ముల్లా హైదర్ వంటి అధికారులు ఆయన పాలనా వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. శివాజీకి కులమతాల కంటే తన రాజ్యంలోని ప్రజల సంక్షేమం, భద్రతే ముఖ్యమని అన్నారు. ముస్లిం పాలకులతో జరిగిన యుద్ధాలను మతపరమైన ఘర్షణలుగా చిత్రీకరించడం సరికాదని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలకు మతం రంగు పులమకుండా చరిత్రను వాస్తవిక దృక్పథంతో చూడాలని సూచించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప వీరుడని, ఆయన ధైర్యసాహసాలు, పాలనా దక్షత, ప్రజల పట్ల చూపిన నిబద్ధతను యువత అధ్యయనం చేయాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.

సర్ పేరిట మైనార్టీ ఓట్లు తొలగిస్తుండ్రు

ఎస్ ఐ ఆర్ పై బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట జిల్లా పదేళ్ల పండగ పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్ బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్ఐఆర్ పేరిట కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ 13 కోట్ల ఓట్లను తొలగించారన్నారు. ఎస్ ఐ ఆర్ పేరుట అత్యధిక శాతం మైనార్టీ ఓట్లు తొలగించడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. సీఈసీకి వ్యతిరేకంగా యువత ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ఢిల్లీలో కర్ఫ్యూ విధించడంతోపాటు రైల్వే, మెట్రో, ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారన్నారు. యువతను భయపెట్టి బెదిరించి వెళ్ళగొట్ట గలుగుతారు కానీ యువత మనసులో ఉన్న బాధను ప్రధాని మోడీ తొలగించలేరన్నారు. సిద్దిపేటలో ఒక్క ముస్లిం ఓటు తొలగిపోకుండా పనిచేద్దామన్నారు.
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింల కోసం చేసింది ఏమీ లేదన్నారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో ముస్లిం మైనారిటీల కోసం ఖర్చు చేసిన నిధుల కంటే తక్కువగా కాంగ్రెస్ సర్కార్ ఖర్చు చేస్తుందన్నారు. ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయంగా మాజీ సీఎం కేసిఆర్ రాష్ట్రవ్యాప్తంగా 204 టీమ్రీస్ పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థుల తరహా ముస్లిం మైనార్టీ విద్యార్థులకు సైతం స్కాలర్ షిప్ ఇచ్చిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు. కేసీఆర్ పాలనలో ముస్లిం మైనార్టీలకు డిప్యూటీ సీఎం తో పాటు హోం శాఖ మంత్రి పదవులను ఇచ్చి గౌరవం పెంచారన్నారు. కాంగ్రెస్ సర్కార్ జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం అజారుద్దీన్ కు మైనార్టీ శాఖ మంత్రిని చేసిందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ సర్కారేనన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు లభిస్తుందాన్నారు.

బండారి లేఔట్ డివిజన్ ఎస్సీ సెల్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 11:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బండారి లేఔట్ డివిజన్ వాజ సెల్ నూతన కమిటీ సభ్యుల ఎంపిక కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు వాసు సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా నూతన కమిటీ సభ్యులు నియామక పత్రాలను అందుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, వరగాణి వాసు , సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి మరియు డివిజన్ చైర్మన్ గుడ్ల అనిల్ కుమార్, వైస్ చైర్మన్లు గుడ్ల ప్రవీణ్ కుమార్, కె. రాజు, రెడ్డిమల రామ, డి. సంధ్యా రాణి, ఏ. సాయినాథ్, జనరల్ సెక్రటరీలు గుడ్ల నాగరాజు, మాదాస్ శివకుమార్, మెడిగడ్డ పులేంద్ర, కంబిలి బండప్ప, చెక్క పవన్ కుమార్, చింత కళ్యాణ్, కె. జీవన్ రాజు, కె. నరసింహారావు, డివిజన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్: అనంతు విజయ్ కుమార్ , కార్యదర్శులు, డివిజన్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,వాజ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్టీ డిజైనర్ స్టోర్ 'వియోనారా' ప్రారంభం

- ఫ్యాషన్ ప్రపంచంలో నయా అధ్యాయం
- ఒకే వేదికపైకి భారతీయ వర్ధమాన, ప్రముఖ డిజైనర్లు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11
దేశంలో ఉన్న వర్ధమాన, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ల ప్రత్యేక కలెక్షన్లను ఒకే గొడుగు కిందకు తెస్తున్న అత్యాధునిక మల్టీ డిజైనర్ స్టోర్ 'వియోనారా' బంజారాహిల్స్లో ప్రారంభమైంది. ఆన్లైన్ ఫ్యాషన్, ప్రత్యక్ష ఇన్-స్టోర్ షాపింగ్ అనుభవంతో ఏర్పాటైన ఈ ఎక్స్క్లూజివ్ స్టోర్ను తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్పర్సన్ & సీఎం ప్రజావాణి ఇన్చార్జ్ గద్వాల విజయలక్ష్మి, జెట్సెట్గో వ్యవస్థాపకురాలు, సీఈఓ కనికా టేక్రివాల్, ఫిక్కీ ఫ్లో జాతీయ వైస్ చైర్పర్సన్ కామిని సరాఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వియోనారా వ్యవస్థాపకురాలు హృత్విఖ ఆర్ జైన్ మాట్లాడుతూ విలక్షణత, సరికొత్త శైలి, మూస పద్ధతులకు భిన్నమైన ఫ్యాషన్ను కోరుకునే వినియోగదారులకు ఇది ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందన్నారు. షాపింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరిచేందుకు, వియోనారా ఇన్-స్టోర్ డిజిటల్ క్యాటలాగ్ను ఆన్లైన్తో అనుసంధానించిందన్నారు. దీని వల్ల డిజిటల్గా బ్రౌజ్ చేయడం, స్వయంగా స్టోర్లో కొనుగోలు చేయడం మధ్య ఒక సులభమైన సమన్వయం ఏర్పడుతుందని తెలిపారు. సమకాలీన లగ్జరీని, కాలాతీతమైన సౌందర్యాన్ని మేళవిస్తూ, బహుముఖ, విలక్షణమైన, ప్రత్యేక వేడుకలకు సరిపోయే ఫ్యాషన్ కోరుకునే కస్టమర్ల అభిరుచులను ఈ స్టోర్ తీరుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వియోనారా వ్యవస్థాపకురాలు రేఖ కిమ్తీ మాట్లాడుతూ ఈ కలెక్షన్లలో వెస్ట్రన్ వేర్, ఇండో-వెస్ట్రన్ దుస్తులు, పండుగల స్పెషల్ ఎడిట్స్, మెన్స్వేర్లతో పాటు యాక్సెసరీస్, లైఫ్స్టైల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. లిమిటెడ్ ఎడిషన్ పండుగ కలెక్షన్లు, ప్రీమియం లుక్తో సరసమైన ధరల్లో లభించే వెండి ఆభరణాలు, బ్యాగులు, పాదరక్షలు, పెర్ఫ్యూమ్లు తదితర ఉత్పత్తులు కూడా ఈ స్టోర్లో కలవన్నారు. నగర ఫ్యాషన్ సంస్కృతి వేగంగా విస్తరిస్తున్న తరుణంలో, ప్రీమియం ప్రెట్ కలెక్షన్ల కోసం నగరవాసులు ఇతర మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా డిజైనర్ ఫ్యాషన్ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. డిజైనర్లకు అందుబాటు ధరల్లో ఆఫ్లైన్ వేదికను అందిస్తూ, కస్టమర్లకు ఆత్మవిశ్వాసంతో కూడిన షాపింగ్ అనుభవంతో.. సృజనాత్మకత, సమకాలీన జీవనశైలిల సంగమంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెట్సెట్గో వ్యవస్థాపకురాలు, సీఈఓ కనికా టేక్రివాల్ మాట్లాడుతూ ఈ స్టోర్ అద్భుతమైన డిజైనర్ల కలెక్షన్ను ఒకచోటకు తెచ్చిందన్నారు. ఇందులో భారతీయ సంప్రదాయ దుస్తులు, పాశ్చాత్య దుస్తులు, పురుషుల వస్త్రాలు, పండగ ఫ్యాషన్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నవరాత్రులలో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా కనిపించాలనుకుంటే షాపింగ్ చేయడానికి ఇది సరైన వేదికన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఐసీసీఐ ఎఫ్ఎల్ఓ జాతీయ ఉపాధ్యక్షురాలు కామిని సరాఫ్ మాట్లాడుతూ సాధారణ రెడీ-టు-వేర్ దుస్తుల నుంచి ప్రత్యేక కాస్ట్యూమ్ డిజైన్ల వరకు ఫ్యాషన్ ప్రియుల విభిన్న అభిరుచులను ఆకట్టుకునేలా వియోనారా అద్భుతమైన ఫ్యాషన్ శ్రేణిని అందిస్తుందన్నారు. విభిన్న శైలులు, డిజైన్లతో పండుగ ఫ్యాషన్ ప్రపంచాన్ని, అందరికీ సరిపోయే దుస్తులను ఒకే వేదిక కిందకు తీసుకొచ్చిందన్నారు. ఫ్యాషన్ రిటైల్ రంగంలో ఉన్న ప్రధానమైన లోటును భర్తీ చేసే లక్ష్యంతో వ్యవస్థాపకులు హృత్విఖ ఆర్ జైన్, రేఖ కిమ్తీ ఈ 'వియోనారా'ను ప్రారంభించారు. సాధారణంగా ఆన్లైన్ ప్లాట్ఫామ్లు విభిన్న డిజైనర్ కలెక్షన్లను అందుబాటులో ఉంచినప్పటికీ, దుస్తుల ఫిట్టింగ్, ఫ్యాబ్రిక్ నాణ్యతను ప్రత్యక్షంగా చూడకుండా కొనుగోలు చేయడానికి కస్టమర్లు సంకోచిస్తుంటారు. అదే సమయంలో స్వతంత్ర డిజైనర్లకు మార్కెట్లో సొంతంగా స్టోర్ ఏర్పాటు చేసుకోవడం ఆర్థికంగా సవాలుతో కూడుకున్న పని. ఈ అంతరాన్ని తొలగిస్తూ 'వియోనారా' ఒక వారధిలా నిలుస్తోంది. ఇక్కడ వినియోగదారులు ఆన్లైన్ ద్వారా డిజైన్లను తెలుసుకోవడమే కాకుండా స్టోర్కు వచ్చి స్వయంగా తమకు నచ్చిన దుస్తులను కొనుగోలు చేసే అవకాశం ఉంది. సింగిల్ బ్రాండ్ స్టోర్లలా కాకుండా నగరంలో అంత సులభంగా లభించని అనేక డిజైనర్ కలెక్షన్లతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఎంపిక చేసిన లేబుల్స్ను వియోనారా ఒకే చోటకు తెస్తుంది. వీటిలో చాలా లేబుల్స్ ప్రత్యేకంగా ఈ స్టోర్లో మాత్రమే లభిస్తాయి. ఇక్కడి డిజైనర్ల జాబితాలో సమంత్ చౌహాన్, సిద్ధార్థ్ బన్సల్, స్వాతి విజయవర్గీయ, అబ్రహం & ఠాకోర్, మందిరా విర్క్ వంటి ప్రముఖులతో పాటు అనేక మంది వర్ధమాన, ప్రతిభావంతులైన డిజైనర్లు ఉన్నారు. వారిలో జుభినవ్ చద్దా, క్షితిజ్ చౌదరి, స్వాతి సింగ్, రిమి నాయక్, అంగ్స, జెడాంగ్, నౌటాంకి, స్కార్లెట్ సేజ్, ప్రియాంక జైన్, సిమర్ తులి, 63 ఈస్ట్, రారా బై రిషిక, ఆకృతి గులాటి, ఏఎమ్ బై అనితా మిట్టల్, హౌస్ ఆఫ్ రోహిత్ దోషి, సమృద్ధి బజాజ్, స్టూడియో సురభి తదితరులు ఉన్నారు. ప్రీమియం ఫ్యాషన్ రిటైల్లో వ్యక్తిగత శ్రద్ధ ఎంతో కీలకమని గుర్తించిన వియోనారా, వన్-ఆన్-వన్ స్టైలింగ్ కన్సల్టేషన్లు, వివాహాలు, పండుగల కోసం సందర్భానుసార ఔట్ఫిట్ క్యూరేషన్, పర్సనలైజ్డ్ షాపింగ్ సేవలను అందిస్తోంది. వీటితో పాటు వార్డ్రోబ్ ఎడిట్స్, నచ్చిన డిజైన్ల ముందస్తు రిజర్వేషన్లు, రెగ్యులర్ కస్టమర్ల కోసం కొత్త కలెక్షన్ల ప్రయారిటీ ప్రివ్యూ వంటి ప్రత్యేక సేవలను కూడా కల్పిస్తోంది.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

- శ్రీఆధ్య హాస్పిటల్ ఎండి. దేశిడి రాజుగౌడ్
- దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు చేసిన దేశిడి.రాజుగౌడ్-రమ్య దంపతులు

మునుగోడు వెలుతురు అక్టోబర్ 11:
శ్రీ దుర్గా మాత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన సతీమణి రమ్యతో కలిసి శ్రీ ఆద్య హాస్పిటల్ ఎండి. దేశిడి.రాజుగౌడ్ ఆదివారం మునుగోడు మండలం గూడపూర్ గ్రామంలో దుర్గామాత వద్ద ఆయన ప్రత్యేక పూజలు చేశారు.. శ్రీ దుర్గా మాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో పూజలు అందుకున్న అమ్మవారు

34 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేసిన చంద్రబాబు నాయుడు

- తప్పుడు జీవోలతో బీసీలను మభ్యపెట్టిన చంద్రబాబు బీసీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు పార్లమెంట్లో చట్టం చేసైనా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:
ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించి, న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిసినా తగిన చట్టపరమైన చర్యలు తీసుకోకుండా బీసీలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసం చేశారని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవోలు న్యాయస్థానాల్లో నిలబడలేవని తెలిసినా కావాలని ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మభ్యపెట్టింది అన్నారు. తప్పుడు జీవులతో బీసీలను మోసం చేసిన చంద్రబాబు బీసీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్డీఏ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, అవసరమైతే పార్లమెంట్లో చట్టం చేయించి బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కృషి చేయాలని జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు.

రాహుల్ ప్రియాంక గాంధీ సేన జిల్లా అధ్యక్షుడిగా బూడిద నాగరాజు

యాదగిరిగుట్ట , అక్టోబర్ 11 వెలుతురు
రాహుల్ ప్రియాంక గాంధీ సేన యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ అధ్యక్షుడిగా యాదగిరి గుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరి పల్లి కి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బూడిద నాగరాజు నియమితుల య్యారు. నాగరాజుకు కాంగ్రెస్ పార్టీ పట్ల రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీల పట్ల ఉన్న నిబద్ధత, నిజాయితీ అంకిత భావాన్ని గుర్తించిన ఆ విభాగం జాతీయ రాష్ట్ర నాయకత్వం ఆయనను ఈ పదవికి ఎంపిక చేసింది. యాదగిరిపల్లి గ్రామానికి చెందిన బూడిద నాగరాజు ను రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్) తెలంగాణ యాదాద్రి భువనగిరి యూత్ ప్రెసిడెంట్గా నియమించడం జరిగిందని ఈ మేరకు రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ మల్లెల తిర్మల్ రెడ్డి ప్రకటించారు . ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని ఆదివారం బూడిద నాగరాజుకు అందించారు. బూడిద నాగరాజు నాయకత్వంలో యాదాద్రి - భువనగిరి జిల్లాలో రాహుల్ ప్రియాంక గాంధీ సేన మరింత బలోపేతం అవుతుందని, పార్టీ బలోపేతానికి ఆయన పెద్ద ఎత్తున కృషి చేస్తారని తిర్మల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బూడిద నాగరాజు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ మల్లెల తిర్మల్ రెడ్డి కి రాహుల్ ప్రియాంక గాంధీ సేన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బూడిద నాగరాజును స్థానిక నాయకులు కార్యకర్తలు అభినందించి సత్కరించారు.

లలిత కళా తోరణంలో అటుకుల బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11, 2026:
తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్లోని లలిత కళా తోరణంలో అక్టోబర్ 11, 2026న అటుకుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, పుష్ప సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. తెలంగాణకు ప్రతిష్టాత్మకమైన పుష్ప పండుగ అయిన బతుకమ్మ విశిష్టతను ఈ వేడుకలు చాటిచెప్పాయి. బతుకమ్మ తెలంగాణ సమృద్ధమైన సాంస్కృతిక సంప్రదాయాలకు, మహిళా శక్తికి, ప్రజలకు--ప్రకృతికి మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ సందర్భంగా తెలంగాణ సంప్రదాయ కళారూపాలను ప్రతిబింబించే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు ప్రదర్శించిన మనోహరమైన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నృత్యంలోని హావభావాలు, సొగసైన కదలికలు భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించాయి. అదేవిధంగా సంప్రదాయ డప్పుల ప్రదర్శనలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని, పండుగ శోభను తీసుకొచ్చాయి. అటుకుల బతుకమ్మ వేడుకలు తెలంగాణకు చెందిన స్థానిక సంప్రదాయాలు, జానపద కళలు, శాస్త్రీయ నృత్యాలు మరియు సాంస్కృతిక గుర్తింపును ప్రోత్సహించేందుకు ఒక వేదికగా నిలిచాయి. ఇటువంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర సమృద్ధమైన అమూర్త సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం, అలాగే తెలంగాణ వైభవమైన పండుగలను పర్యాటకులు, ప్రజలకు పరిచయం చేయడం తెలంగాణ పర్యాటక శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

లయన్స్ క్లబ్లో పదవి సీతారాంపురం వాసికి

హైకోర్టు న్యాయవాది ఎం.ఏ. రహీంకు బాల్యమిత్రుల ఘన సన్మానం

గుండాల, అక్టోబర్ 11 (వెలుతురు):
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎం.ఏ. రహీంకు లయన్స్ క్లబ్లో సభ్యుడిగా ఎన్నిక కావడం ద్వారా అరుదైన గౌరవం దక్కింది. తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదిగి, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామి కావడం పట్ల సీతారాంపురం గ్రామస్తులు, ఆయన బాల్యమిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన లయన్స్ క్లబ్ ఎన్నికల్లో ఎం.ఏ. రహీం సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం ఆయన బాల్యమిత్రులు, గ్రామస్తులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రహీంకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. చిన్ననాటి నుంచి తమతో కలిసి పెరిగిన స్నేహితుడు నేడు న్యాయవాదిగా ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు లయన్స్ క్లబ్లో సభ్యత్వం పొందడం తమకు ఎంతో గర్వకారణమని మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజాసేవకు కృషి చేస్తా: ఎం.ఏ. రహీం

ఈ సందర్భంగా సన్మానాన్ని స్వీకరించిన లయన్స్ క్లబ్ సభ్యుడు, హైకోర్టు న్యాయవాది ఎం.ఏ. రహీం మాట్లాడుతూ తనను ఆత్మీయంగా సన్మానించిన బాల్యమిత్రులకు, గ్రామస్తులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై చూపిన ప్రేమాభిమానాలు, ఆప్యాయత తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్లో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజాసేవా కార్యక్రమాల్లో ముందుంటానని తెలిపారు. తన స్వగ్రామమైన సీతారాంపురం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం బాల్యమిత్రుల మధ్య ఆత్మీయతను, గ్రామంతో ఆయనకున్న అనుబంధాన్ని చాటిచెప్పింది. గ్రామానికి చెందిన వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎం.ఏ. రహీం బాల్యమిత్రులు, సబ్ ఇన్స్పెక్టర్ బండ సోమయ్య, పాల సంఘం చైర్మన్ కాలి వెంకన్న, కేమిడి శ్రీనివాస్, బొడిగి రవి, గుండు మనోహర్, కాళీ కృష్ణ. తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో అటుకుల బతుకమ్మ వేడుకలు..

రెండవ రోజు ఆడి పాడిన మహిళలు, దివ్యాంగులు, కళాకారులు..

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11:
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు రవీంద్రభారతిలో ఈరోజు రెండవ రోజు అటుకుల బతుకమ్మతో సందడిగా సాగాయి. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను మహిళలు ఘనంగా నింపి పాటలు పాడుతూ ఆడిపాడారు. సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఈ వేడుకలో మహిళల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం రోజున జరిగిన వేడుకల్లో దివ్యాంగులు విశేషంగా పాల్గొని బతుకమ్మ ఆడారు. జాతీయ అవార్డు గ్రహీత పద్మావతి నేతృత్వంలోని దివ్యాంగుల బృందం ఉత్సాహంగా బతుకమ్మ ఆడగా, వీరితో పాటు అలేఖ్య సంస్థ ఆధ్వర్యంలో సుమారు వంద మంది మహిళలు, విద్యార్థులు, చిన్నారులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు, నృత్యాలతో వాతావరణాన్ని మరింత రంజింపజశారు. ఈ వేడుక బతుకమ్మ పండుగలోని తల్లిదనాన్ని, సహజసిద్ధతను, సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా సాగింది. పూలను పూజిస్తూ, ప్రకృతిని ప్రేమిస్తూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవమని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక సహాయ సంచాలకులు పి.నర్సింహులు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డా పి విజయకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్ బాబు, సూపరింటెండెంట్ జే. శ్రీనివాస్, హేమలత తో పాటు భాషా సాంస్కృతిక శాఖ సిబ్బంది మరియు సాంస్కృతిక సలహా మండలి సభ్యులు శ్రీ ముచర్ల దినకర్, పల్లె నర్సింహా పాల్గొన్నారు.

త్వరలోనే ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తా

శ్రీఆధ్య హాస్పిటల్ ఎండి. దేశిడి రాజుగౌడ్

మునుగోడు వెలుతురు అక్టోబర్ 11:
శ్రీఆద్య హాస్పిటల్ ఆధ్వర్యంలో త్వరలోనే మునుగోడు మండల వ్యాప్తంగా ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తానని శ్రీఆద్య హాస్పిటల్ ఎండి. దేశిడి.రాజుగౌడ్ తెలిపారు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నా సొంత మండలం అయినా మునుగోడు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు నా వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో అనుభవమైనటువంటి డాక్టర్లతో ప్రతి గ్రామంలో వైద్య సేవలు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాను అని అన్నారు.. ఈ ఉచిత వైద్య శిబిరాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు

పూలే ఆలోచన మన పునాది, అంబేద్కర్ రాజ్యాంగం మన ఆయుధం

- గద్దర్ ప్రజా చైతన్యం మన పోరాట స్ఫూర్తి: తాటికొండ విక్రమ్ గౌడ్
- మహనీయుల ఆశయాలను యువత ఆచరించాలి
- బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:
అంబేద్కర్ నగర్, ఓల్డ్ ఆల్వాల్లో సీఎల్ యాదగిరి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ప్రజా గాయకుడు గద్దర్ ఆశయాలను స్మరించుకుంటూ 174వ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రచయిత, సంగీతకారుడు రాజలింగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాటికొండ విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ, భారతదేశంలో అట్టడుగు వర్గాలకు విద్యా హక్కులు, సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం అందించేందుకు మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. విద్య ద్వారానే సామాజిక అసమానతలను తొలగించి, అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పూలే దంపతులు తమ జీవితాల ద్వారా నిరూపించారని పేర్కొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, హక్కులకు పునాది వేశారని తెలిపారు. మహనీయుల ఆశయాలను కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం చేయకుండా, వాటిని ఆచరణలో పెట్టాలని యువతకు పిలుపునిచ్చారు. "పూలే ఆలోచన మన పునాది... అంబేద్కర్ రాజ్యాంగం మన ఆయుధం... గద్దర్ ప్రజా చైతన్యం మన పోరాట స్ఫూర్తి" అని పేర్కొంటూ, సమాజంలో కుల వివక్ష, అసమానతలు, అన్యాయాలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని విక్రమ్ గౌడ్ అన్నారు. రాజలింగం మాట్లాడుతూ :ప్రజా గాయకుడు గద్దర్ తన పాటల ద్వారా అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి, ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారని కొనియాడారు. పాటలు, సాహిత్యం, కళలు సమాజ మార్పునకు శక్తివంతమైన సాధనాలని పేర్కొన్నారు. పూలే విద్యా స్ఫూర్తి, అంబేద్కర్ రాజ్యాంగ విలువలు, గద్దర్ ప్రజా చైతన్యం నేటి తరానికి మార్గదర్శకాలని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ తదితర అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు అందినప్పుడే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మహనీయుల పోరాట స్ఫూర్తితో విద్యా హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి. రాజయ్య, సీరియల్ కృష్ణ, రమేష్, రైల్వే బాలరాజ్, డప్పు ఆనంద్, మహేందర్, ఇంద్రం రజక, కె.వి. చందర్, కె. శ్రీనివాస్, సాయి గౌడ్, చిత్తయ్య తదితరులు పాల్గొన్నారు

బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న సర్పంచ్, ఉపసర్పంచ్

మంచాల వెలుతురు అక్టోబర్ 11: మంచాల మండలం ఎంగిలి పువ్వుల బతకమ్మ పండగ సందర్భంగా ఆరుట్ల గ్రామంలోశనివారం రాత్రి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని బతకమ్మలకు పూజలు చేసిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మాని పాటిశోభాకుమార్ ఉపసర్పంచ్నుకంరాజు ముదిరాజ్ గ్రామపంచాయతీ పాలకమండలి.సభ్యు లు గ్రామంలో బొడ్రాయి వద్ద మేజర్ పద్మపాణి ఆచార్యయూత్ అసోసియేషన్ వద్ద విశ్వకర్మసం ఘంవద్ద కురుమ సంఘం వద్ద వేణుగోపాలస్వామి భజన మండలి మడపం వద్ద శ్రీచైతన్యయూ త్ వద్ద మణికంఠయూత్ వద్ద బ్యాంకాలనీ దగ్గర సుందరయ్యనగర్ కాలనీలో మహిళలు పెద్దఎ త్తున బతుకమ్మలు పెట్టిగౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి ఎంగిలిపువ్వుల బతుకమ్మ సంబరాలు ఆటపాటలతో ఘనంగా నిర్వహించారు ఈకార్యక్రమంలో శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షు డు అంతటి రాజుగౌడ్,వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ప్రజాగళం దామర భూపాల్,మాజీ ఉపసర్పంచ్ పాండాల జంగయ్యగౌడ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మందమాధవి మాడు గుల బాలమనికృష్ణగౌడ్ మొగ్రిపద్మ ఐలయ్య,లాలగారి మణెమ్మ,ఇందిరమ్మ కమిటీసభ్యురాలు మార.బౌరమ్మ మహిళలు పెద్దఎత్తున పాల్గొని బతుకమ్మ సంబరాలు విజయవంతంచేశారు.

బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్న

జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11: ఆదివారం రోజున శక్తి సాయి నగర్ డివిజన్ మల్లాపూర్ చాణిక్యపురి కాలనీలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రుల శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకొని ప్రజలు ఉద్యోగులు అధికారులు చాణిక్యపురి కాలనీ వాసులు అమ్మవారి దయతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నాము టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మన్య బోయిన కృష్ణ యాదవ్ కుటుంబ సమేతంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మల్కాజ్గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి ఎంబి శ్రీ దుర్గా మాధవి యాదవ్. ఏం గోపాల్ యాదవ్ ఎంబీ వినోదయాదవ్.. ఎంబి హేమలత యాదవ్. కాజా నాగమణి యాదవ్. ఏం సత్యనారాయణ పుష్పలత. జె అశోక్ బాబు వసంత యాదవ్. మారం మల్లికార్జున్ యాదవ్ ఉమా యాదవ్. రమేష్ యాదవ్ హేమలత యాదవ్. మంజుల యాదవ్. ప్రనిత యాదవ్. కల్పన యాదవ్. సతీష్ యాదవ్ మానస యాదవ్. శివ యాదవ్ మౌనిక యాదవ్. అజయ్ సంపూర్ణ యాదవ్. పునీత్ యాదవ్. ధనవి యాదవ్. రూల్ యాదవ్ కాజా సంధ్యారాణి యాదవ్. భార్గవ్ యాదవ్. వర్తిక యాదవ్. సునైనా యాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ పద్ధతులు తీసుకొని అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు..

రైతులు యాసంగి పంట వేయొద్దు : మంత్రి

మంత్రి పొంగులేటి కీలక విజ్ఞప్తి దీఎ దీశీఎఖ రాష్ట్రఅఖునెబఘుతీ ఖజూస్ఫ్వస: ఽాబఅఖుఎ, ఽాఞశీఎవతీ 11, 2026, 22:49 ళిఖూరి తెలంగాణ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో కరువు ముప్పు పొంచి ఉందని రైతులు యాసంగి పంటను వేయొద్దని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే రోజుల్లో సాగునీరు సహా తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. ఇక ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంటను వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రపంచ వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా అలాగే తెలంగాణలోనూ తీవ్రమైన ప్రభావం చూపుతోందని ఎల్ నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో సాగు నీటితో పాటు రాబోయే రోజుల్లో తాగు నీటికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో రానున్న రోజుల్లో విద్యుత్ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని.. పవర్ గ్రిడ్‌లో డిమాండ్ కు తగినట్లుగా విద్యుత్ సరఫరా చేయడం కష్టంగా మారుతోందన్నారు. విద్యుత్ ను బయటి మార్కెట్ నుంచి కొనుగోలు చేయాలంటే ఒక్కోయూనిట్ కు రూ. 15 వెచ్చించినా దొరకని దయనీయ పరిస్థితి నెలకుందని వివరించారు. అందువల్ల ప్రజలందరూ కూడా విద్యుత్ ను అత్యంత పొదుపుగా వాడుకోవాలని సూచనలు చేశారు. ఇక రేపు, ఎల్లుండి కేబినెట్ సమావేశాలు జరుగుతాయని ఈ సమావేశంలో వర్షాభావ పరిస్థితులు, తాగు, సాగు నీటి ఎద్దడి, విద్యుత్ కొరతను సమర్థవంతంగా ఏ విధంగా ఎదుర్కోవాలో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి కరువు నివారణకు, రాష్ట్రానికి అండగా నిలవాలని ఈ సమావేశంలో తీర్మానించి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. అంతేకాక రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని.. జీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో అదనపు పనిదినాలు కల్పించాలని కేంద్రాన్ని కోరతామని పేర్కొన్నారు.

రాజధాని అమరావతి

ఐకానిక్ టవర్ల నిర్మాణంపై లేటెస్ట్ అప్డేట్!

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినన్నాటి నుండి రాజధాని అమరావతి నిర్మాణంపై ఫుల్ గా ఫోకస్ పెట్టింది. సీఎం చంద్రబాబు ప్రపంచం మొత్తం దృష్టి సారించేలా రాజధాని అమరావతి నిర్మాణం చెయ్యాలని సంకల్పించి ఆ దిశగా పనులు యుద్ధ ప్రాతిపదికన చేయిస్తున్నారు. ఈ క్రమంలో అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో తొలి దయాగ్రిడ్ పూర్తయిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ప్రతి రెండు నెలలకు ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తవుతోందని ఆయన తెలిపారు. మంత్రి నారాయణ అమరావతిలో సమీక్ష నిర్వహించి సీఆర్డీఏ, ఏడీసీఎల్ ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఫౌండేషన్ పనులు దాదాపు పూర్తయ్యాయని, అధికారులు, ప్రజాప్రతినిధుల భవనాలు కూడా సిద్ధమవుతున్నాయని చెప్పారు. ూశ్రీంశీ =ఖుఎ అమరావతి అభివృద్ధిలో మరో కీలక అడుగు.. రూ.599 కోట్ల రైల్వేలైన్‌కు టెండర్లు! నవంబర్ 11 తర్వాత నుంచి సిద్ధమైన భవనాల ప్రారంభోత్సవాలు చేస్తామని కూడా మంత్రి నారాయణ ప్రకటించారు. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా పనులకు కొంత అంతరాయం కలిగిందని, ప్రస్తుతం వర్షాకాలం ముగియడంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి అన్నారు. 350 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్ల నిర్మాణం జరుగుతోందని, రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రస్తుతం సుమారు 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారి సంఖ్యను మరింత పెంచాలని కాంట్రాక్టర్లను ఆదేశించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన ప్రకారం 2028 అక్టోబర్ నాటికి అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం మూడు గ్రామాల్లో భూసమీకరణ చాలా వరకు పూర్తయిందన్నారు. =వఘశీఎఎవఅఎవఎ ఖీశీఠ్శీబ అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ పక్క నుంచే హైస్పీడ్ రైలు రూట్, రెండింటికీ కలిపే..!! వచ్చే నెలాఖరుకు 75 శాతానికి పైగా పూర్తవుతుందని చెప్పారు. రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధికి సింగపూర్ సంస్థ డిసెంబర్ నాటికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయనుందని కూడా తెలిపారు. అయితే రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్లు కాలమ్స్, బీమ్స్ లేకుండా కోర్ వాల్, త్రిభుజాకార డయాగ్రిడ్ సాంకేతికతతో నిర్మిస్తున్నారు. ఇవి రాజధానికి తలమానికంగా నిలవనున్నాయి. పనులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి నారాయణ అన్నారు.

స్థానిక ఎన్నికల్లో సీట్లు వారికే, గెలుపు బాధ్యత వారిదే

- తేల్చి చెప్పిన చంద్రబాబు..!!

స్థానిక సంస్థల ఎన్నికలకు సీఎం చంద్రబాబు కసరత్తు ముమ్మరం చేసారు. కొత్త వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. పార్టీ నేతలకు ఎన్నికల పైన దిశా నిర్దేశం చేస్తూనే... క్షేత్ర స్థాయిలో పరిస్థితుల పైన ఆరా తీసారు. సీట్లు ఎవరికి కేటాయించేదీ స్పష్టత ఇచ్చారు. మిత్రపక్షాలతో కలిసి సమన్వ యంతో సాగాలని స్పష్టం చేసారు. ఎలాంటి విభేదాలకు తావు లేకుండా కలిసి కట్టుగా పని చేసి అన్ని స్థానాలు గెలవాలని నిర్దేశించారు. ఈ ఎన్నికల్లో బలమే వచ్చే ఎన్నికల నాటికి కూటమి కి మేలు చేస్తుందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ముఖ్య నేతలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, చేపట్టాల్సిన ప్రచారం, కూటమి పార్టీలతో సమన్వయం, ప్రత్యర్థి పార్టీల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేసారు. బీసీల రిజర్వేషన్లపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని, వైసీపీ చేసిన అన్యాయాన్ని వివరించిన సీఎం చంద్రబాబు.. జయహో బీసీ...! జనాభాలో సగం-కూటమి ఇచ్చింది బలం పేరుతో రాష్ట్ర వ్యాప్త ప్రచారం చేపట్టాలన్నారుస్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం మేర పార్టీ పరంగా సీట్లు ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో నేతల పనితీరుకు రేటింగ్స్ ఇస్తామని చెప్పారు. కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుని... కలిసి ప్రచారం చేయాలంటూ సీఎం నిర్దేశించారు. డబులింజన్ సర్కారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం.. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు కావాలని చెపపుకొచ్చారు. 50 రోజులు.. ఎవ్వరికీ మినహాయింపు లేదు.. గెలుపే ధ్యేయంగా పని చేయాలని తేల్చి చెప్పారు. ఎన్నికల్లో గెలుపు, నిజాయితీ, సమర్థత, సోషల్ రీ-ఇంజనీరింగ్ వంటి అంశాలను బేరీజు వేసుకు నే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేసారు. సిన్సియార్టీ లేకుండా డ్రామాలాడే వారి వల్ల పార్టీకి ఎలాంటి ఉపయోగం ఉండదు.. అలాంటి వారిని ఊపేక్షించమని తేల్చి చెప్పారు. స్థానిక ఎన్నికల్లో నేతల పనితీరుపై రేటింగ్స్ ఇస్తాం. సరిగా పని చేయాలని కోరారు. స్థానిక ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు...కూటమి బలం మరింత పెరగాలంటే స్థానిక ఎన్నికలే కీలకమని వివరించారు. న్యూట్రల్స్ సానుభూతి పరులుగా... ప్రత్యర్థులు న్యూట్రల్సుగా మారేలా పార్టీ కేడర్ పని చేయాలని సూచించారు. రూ. 1.50 లక్షల కోట్లు సంక్షేమం కోసం ఖర్చు చేశాం. అంతే మొత్తంలో అభివృద్ధి పనులు చేశామని.. సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసిన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల న్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతానికి మించి స్థానాలు ఇస్తామని ప్రకటించామని... పార్టీ పరంగా 40 శాతం వరకు బీసీలకు సీట్లు ఇచ్చేలా కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. కూటమి పార్టీలతో సమన్వయం చేసుకోవాలని.. పై స్థాయిలో ఎలాం టి సమన్వయం ఉందో.. క్షేత్ర స్థాయిలో అలాగే ఉండాలి. విభేదాలకు, అపోహలకు తావివ్వవద్దని చంద్రబాబు స్పష్టం చేసారు.

పుష్ప సినిమా తరహాలో స్మగ్లింగ్..

రూ.9 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

టాలీవుడ్ బ్లాక్ బస్టర్ పుష్ప సినిమాలో స్మగ్లింగ్ సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. అయితే ఆ సినిమాను మించిన విధంగా ఓ గ్యాంగ్ అక్రమ బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు చిక్కింది. కోల్ కతా నుంచి హైదరాబాద్ కు కారులో బంగారం స్మగ్లింగ్ చేస్తుండగా ఐ=× అధికారులు ఆ గ్యాంగ్ ను విశాఖపట్నంలో అదుపులోకి తీసుకున్నారు. అలాగే అక్రమంగా తరలిస్తున్న 5,832.90 గ్రాముల స్వచ్ఛమైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ బహిరంగ మార్కెట్ లో రూ.8.98 కోట్లు ఉంటుంది. ఈ బంగారాన్ని కస్టమ్స్ చట్టం కింద సీజ్ చేశామని అధికారులు వెల్లడించారు. అలాగే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కోల్ కతా నుంచి హైదరాబాద్ కు బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారని డీఆర్ ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఓ కారుపై అనుమానం వచ్చి ఆ కారుని వెంబడించిన డీఆర్ఐ అధికారులు దాన్ని ఆపి తనిఖీలు చేపట్టారు. కారులో రూ. 8.98 కోట్ల విలువైన 5.83 కిలోల విదేశీ బంగారం లభ్యం అయింది. కారులోని ఫ్రంట్ సీటు కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక రహస్య అరలో ఈ బంగారాన్ని స్మగ్లర్లు దాచినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, జ్యుడిషియల్ కస్టడీకి అధికారులు తరలించారు. ప్రస్తుతం ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు. ూశ్రీంశీ =ఖుఎ తమిళనాడులో అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు: మెజారిటీ మార్క్ కు చేరువగా టీవీకే? మరో ఘటనలో తమిళనాడులోని తేని జిల్లాకు చెందిన ఓ 43 ఏళ్ల వ్యక్తి గంజాయి స్మగ్లింగ్ ను చేసేందుకు వినూత్నంగా ఆలోచించాడు. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని స్మగ్లింగ్ చేయాలని ప్లాన్ వేశాడు. అలా ఒడిషా బోర్డర్ లో ఓ వ్యక్తి వద్ద మూడు కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. దాన్ని ఎవరికీ అనుమానం రాకుండా పొట్టకు చుట్టుకుని టేపులను అతికించాడు. చూసే వాళ్లకు అది పెద్ద పొట్టలాగే అనిపించేలా జాగ్రత్త పడ్డాడు. అలా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి నుంచి నర్సీపట్నం వస్తున్న క్రమంలో అతడి షర్ట్ కింద ఓ టేప్ వేలాడటం చూసి ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితుడ్ని అరెస్ట్ చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.5లక్షల ఉచిత బీమాతో పాటు,

తెలంగాణా ప్రజలకు డబుల్ బొనాంజా..ముహూర్తం ఫిక్స్!

తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించే ఇందిరమ్మ బీమా పథకాన్ని త్వరలో ప్రారంభించనుంది. నవంబర్ 19న ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురాబోతున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. కుటుంబానికి ఆదాయం సమకూర్చే పెద్ద వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే, ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం అని డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మంలో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు కూడా వెల్లడించారు. రాష్ట్రంలో కోటి 6 లక్షల కుటుంబాలకు చెందిన 3.42 కోట్ల మందికి ప్రతి నెలా 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల మందికి గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కోటి 6 లక్షల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్య సాయం అందుతోందని, 12.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి దశలో 4.5 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నామని, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. ూశ్రీంశీ =ఖుఎ మెట్రో ప్రయాణికులకు శుభవార్త.. మెట్రోస్టేషన్ల నుండి నేరుగా మీ గమ్యస్థానాలకు..డ్రైవర్‌లెస్ పాడ్ ట్యాక్సీలు! ఇందిరమ్మ బీమా పథకం అమల్లోకి వస్తే, కుటుంబ పెద్ద మరణించినా కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా రక్షణ కలుగుతుందన్నారు. ప్రీమియం పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుందని పేర్కొన్నారు. ఈ పథకంతో పాటు రాజీవ్ యువ వికాసం పథకాన్ని కూడా నవంబర్ 19న ప్రారంభించనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం అన్నారు.

యువతే మార్పుకు పునాది,
విద్యావంతుల మౌనం సమాజానికి చేటు



- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్
- "చదువుకున్నవారి నిర్లిప్తతతోనే అనర్హులు అందలమెక్కుతున్నారు"
- "కాంగ్రెస్ మార్క్ పాలనపై పట్టభద్రుల తిరుగుబాటుకు వేళైంది!"
- కేటీఆర్ దార్శనికతతో హైదరాబాద్‌కు భారీ పెట్టుబడులు..
- 20 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు నేడు రేవంత్ రెడ్డి చేతగానితనంతో హైదరాబాద్ ఖ్యాతి నాశనం
- అర్హులైన ప్రతి పట్టభద్రుడు దరఖాస్తు-18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలి
- హైదరాబాద్ - మహబూబ్ నగర్ - రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షలో దాసోజు శ్రవణ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11: "చరిత్రలో ఏ గొప్ప ఉద్యమమైనా, ఏ విప్లవాత్మక మార్పు అయినా యువత భాగస్వామ్యంతోనే సాధ్యపడింది. సమాజంలో ప్రతి మార్పునకు యువకులే అసలైన పునాది" అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. రాబోయే హైదరాబాద్, మహబూబ్ నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదు, గెలుపు వ్యూహాలపై ఖైరతాబాద్ నియోజకవర్గం సోమాజిగూడ విభాగం మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, బీఆర్ఎస్వీ నాయకుడు మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టభద్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. దాసోజు శ్రవణ్ ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై దిశానిర్దేశం చేశారు.

ఓటు నమోదుపై నిర్లిప్తత వద్దు:

మహాత్మా గాంధీ అయినా, నెహ్రూ, భగత్ సింగ్ ఇంకా అనేక మంది స్వాతంత్ర్య పోరాట యోధులు తమ చిన్నవయస్సులోనే ప్రజా పోరాటాలకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు కూడా తన యువదశలోనే రాజ్యాంగబద్ధమైన రాజకీయ పోరాటాల్లోకి వచ్చి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత విద్యావంతులైన యువతలో రాజకీయాలు, ఓటింగ్ పట్ల నిర్లిప్తత ఆందోళన కలిగిస్తోందన్నారు. గత ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో కేవలం 8,000 ఓట్లు మాత్రమే నమోదు కావడం, ఓటింగ్ శాతం చాలా తక్కువగా ఉండటం విచారకరమన్నారు. నిరక్షరాస్యులు బాధ్యతగా ఓటు వేస్తుంటే, చదువుకున్న విద్యావంతులు మాత్రం ఎన్నికల రోజును కేవలం ఒక సెలవు దినంగా భావించి ఇతర పనుల్లో గడపడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. మహానగర హైదరాబాద్ వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని పేర్కొన్నారు.

ఓటు హక్కు ఒక శక్తివంతమైన ఆయుధం:

మన రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఒక శక్తివంతమైన ఆయుధం లాంటిదని, అర్హత కలిగిన ప్రతీ పట్టభద్రుడు విధిగా దరఖాస్తు-18 పూరించి ఓటరుగా నమోదు చేసుకోవాలని అభ్యర్థించారు.

"విద్యావంతులు ఓటు హక్కును వినియోగించుకోకపోతే అనర్హులు అందలమెక్కుతారు. అలాంటి వారి వల్ల సమాజానికి, నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదు" అని హెచ్చరించారు. సమాజంలో మార్పు రాత్రికి రాత్రే సాధ్యపడదని, దాని కోసం విద్యావంతులుగా నిరంతరం శ్రమించడం మన ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. మన రాజ్యాంగ సూత్రాలను, హక్కులను మర్చిపోవడమే నేటి అన్ని సమస్యలకు మూలకారణమని ఉద్ఘాటించారు.

కేటీఆర్ దార్శనికత వర్సెస్ రేవంత్ విధ్వంసం:

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ గారి నాయకత్వంలో అంతర్జాతీయ నగరంగా ఎదిగిన హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టామని పేర్కొన్నారు. కేటీఆర్ గారి దార్శనికత, సంస్కరణల వల్ల ప్రపంచ ప్రఖ్యాత సమాచార సాంకేతిక, ఔషధ దిగ్గజ సంస్థలు నగరానికి తరలివచ్చి భారీగా పెట్టుబడులు పెట్టాయని, తద్వారా సుమారు 20 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు యువతకు లభించాయని గుర్తుచేశారు. కానీ నేడు రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, తుగ్లక్ మార్క్ పాలన వల్ల హైదరాబాద్ ఖ్యాతి సర్వనాశనమైందని మండిపడ్డారు. కొత్త పెట్టుబడులు రాకపోగా, ఉన్న సంస్థలు కూడా పక్కరాష్ట్రాలకు తరలిపోయే దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి - కాంగ్రెస్ వైఫల్యాలు:

నాటి ఉద్యమాల్లో యువత ఆత్మార్పణలు చేసి, వీరోచితంగా పోరాడటం వల్లే స్వరాష్ట్రం సిద్ధించిందని, కేసీఆర్ గారి పదేళ్ల పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని చెప్పారు. నేడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మళ్లీ నిర్వీర్యం చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి కనీసం ఒక స్పష్టమైన ఉపాధి విధానం కూడా లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఊసే లేదన్నారు. విద్యార్థుల బోధనా రుసుముల రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మళ్లీ విద్యుత్ కోతలు, తాగు, సాగునీటి ఎద్దడి మొదలైందని విమర్శించారు. ఎల్ నినో వాతావరణ మార్పుల ప్రభావంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, నిరుద్యోగ సమస్యలపై మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని దాసోజు శ్రవణ్ పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా విద్యావంతులు, పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ ఆధిక్యంతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సోమాజిగూడ, ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, నియోజకవర్గ పరిధిలోని పెద్ద సంఖ్యలో పట్టభద్రులు, యువకులు పాల్గొన్నారు.

నానా పటేకర్ మృతికి
అసలు కారణం ఇదే

పోస్టుమార్టం నివేదికలో కీలక విషయాలు

బాలీవుడ్ దిగ్గజ నటుడు నానాపటేకర్ మృతిపై పోస్ట్ మార్టం నివేదికలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నానాపటేకర్ ది సహజ మరణమేనని గోవా మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ ధృవీకరించింది. ఆయన హార్ట్ ఎటాక్ తోనే మరణించారని పేర్కొంది. లెఫ్ట్ మెయిన్ కరోనరీ ఆర్టెరీలో రక్తం గడ్డకట్టడం కారణంగానే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు స్పష్టం చేసింది. అక్టోబర్ 8 తెల్లవారుజామున పనాజీ సమీపంలో ఉన్న డోనా పౌలాలోని తన నివాసంలో 75 ఏళ్ల నానా పటేకర్ తీవ్ర అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. అయితే ఆయన్ను అంబులెన్స్ లో గోవా మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ కు తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దాదాపు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసినా కూడా ప్రయత్నం ఫలించలేదు. అయితే నానాపటేకర్ ఆస్పత్రికి వచ్చేలోపే మరణించి ఉన్న క్రమంలో వైద్యులు చట్టప్రకారం మెడికోలీగల్ కేసుగా ప్రకటించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అసహజ మరణంగా కేసు నమోదు చేశారు. అయితే తాజాగా పోస్టుమార్టం నివేదికలో నానాపటేకర్ ది సహజ మరణమేనని తేలింది. ఈ మేరకు గుండెకు రక్తాన్ని సరఫరా చేసే లెఫ్ట్ కరోనరీ ఆర్టరీలో రక్తం గడ్డకట్టడంతో ఆయనకు తీవ్రమైన హార్ట్ ఎటాక్ వచ్చినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ాశ్రీంశీ =ఘుఃఅడవిని ఏలిన ఫేమస్ పులి మృతి.. 15 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు ఇక నానాపటేకర్ అంత్యక్రియలు అక్టోబర్ 8 గురువారం పుణే జిల్లాలోని డోంజే గ్రామంలో ఉన్న ఆయన ఫామ్ హౌస్ లో ప్రభుత్వ లాంఛనాలతో పూర్తయ్యాయి. పోలీసులు మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. ఇక నానాపటేకర్ అంతిమ యాత్రకు సినీ పరిశ్రమ నుంచి జాకీ ష్రాఫ్, దర్శకులు అనిల్ శర్మ, అనీస్ బాజ్మీ అలాగే నిర్మాత ఫిరోజ్ నడియాడ్ వాలా వంటి ప్రముఖులు హాజరయ్యారు. అలాగే మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి సునేత్రా పవార్?, కేందర్ మంత్రులు రామదాస్? అఠావలే, మరళీధర్? మోహోల్?, లోక్?సభ ఎంపీ సునీల్? తట్కరే కూడా హాజరయ్యారు. ఇక నానాపటేకర్ దాదాపు నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో హిందీ, మరాఠీ సినిమాల్లో నటించారు.

గోదావరి-కావేరి నదుల లింకేజీ, హోసూర్- బెంగళూరు మెట్రో రైల్ :
ప్రధాని మోదీకి విజయ్ ప్రతిపాదనలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం చెన్నైలో పర్యటిస్తోన్నారు. ఈ ఉదయం ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి విజయ్.. సాదరంగా ఆయనను ఆహ్వానించారు. తన పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ 13,000 కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే అనేక కీలక ప్రాజెక్టులకు ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. వీటిల్లో మెట్రో రైల్ ఫేస్ 2 విస్తరణ, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడం, నగరాభివృద్ధిని వేగవంతం చేయడం వంటివి ఉన్నాయి. ప్రధాని ముందు పలు ప్రతిపాదనలు ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో విజయ్ మాట్లాడారు. పలు ప్రతిపాదనలను ప్రధాని ముందు ఉంచారు. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల విడుదలలో వేగం పెంచాలని కోరారు. చెన్నై మెట్రో రైల్ మూడో దశ విస్తరణకు తక్షణ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు గోదావరి-కావేరి నదుల అనుసంధానం, సమగ్ర శిక్షా అభియాన్ కింద రావాల్సిన నిధుల విడుదల తదితర ప్రతిపాదనలను ఆమోదించాలని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆయా ప్రాజెక్టులు కీలకమని స్పష్టం చేశారు. హోసూర్- బొమ్మసంద్ర మెట్రో చెన్నైలో ట్రాఫిక్ సమస్యలను నివారించడానికి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడానికి చెన్నై మెట్రో ఫేజ్- 3 ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని విజయ్ వివరించారు. ఇందులో భాగంగా తాంబరం ఎయిర్ పోర్ట్ నుండి కీలంబాక్కం, పూనమల్లి- సుంగువార్‌చత్రం వరకు మెట్రో మార్గాలను విస్తరించాలని అన్నారు. కర్ణాటక సరిహద్దులకు ఆనుకుని ఉన్న హోసూర్ నుండి బెంగళూరులోని బొమ్మసంద్ర 20 కిలో మీటర్ల అంతర్రాష్ట్ర మెట్రో కారిడార్‌ను నిర్మించాలని విజయ్.. ప్రధాని మోదీకి విన్నవించారు. ాశ్రీంశీ =ఘుఃఇక చెన్నై వడపళని వరకూ మెట్రో రైల్: విజయ్ తో కలిసి ప్రారంభించిన ప్రధాని మోదీ: రైలు ప్రయాణం కోయంబత్తూర్, మదురైల్లో మెట్రో రైల్ చెన్నై మెట్రో రెండవ దశలో భాగమైన పూనమల్లి- వడపళని రూట్ ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూనే రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల మెట్రో ప్రాజెక్టులపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కోయంబత్తూర్, మదురైల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులను పునఃపరిశీలించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఆయా నగరాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వాహన రద్దీ దృష్ట్యా మెట్రో రైల్ ను అందుబాటులోకి తీసుకుని రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. =వశీఏఏవఅఁవఁ ఖీశీతీ శీబ రియాద్, దోహా సహా భారత్ నుంచి గల్ఫ్ కు వెళ్లే పలు విమానాల రద్దు హైస్పీడ్ రైల్ కారిడార్ రైల్వే, రహదారుల అభివృద్ధికి సంబంధించి పలు విజ్ఞప్తులు చేశారాయన. బడ్జెట్‌లో ప్రకటించిన ఉమ్మడి హైస్పీడ్ రైల్ కారిడార్ల ప్రణాళికలో భాగంగా చెన్నై- కన్యాకుమారి, చెన్నై- కోయంబత్తూర్ వరకు నూతన హైస్పీడ్ కారిడార్లను మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే.. రాష్ట్ర పరిధిలోని ప్రధాన జాతీయ రహదారులను 6- లేన్ గా విస్తరించే పనులను వేగవంతం చేయాలని అన్నారు. ప్రశ్నించిన వాళ్లు పరాయి దేశస్తులవుతారా: ధృవ్ రాఠీ జాతీయ ప్రాజెక్ట్ గా గోదావరి-కావేరి నదుల అనుసంధానం అత్యవసరమని ఈ సందర్భంగా విజయ్ తేల్చి చెప్పారు. దీన్ని జాతీయ ప్రాజెక్ట్ గా గుర్తించాలని కోరారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య నీటి పంపిణీలో సమతుల్యత సాధించడానికి, తాగునీరు, సాగునీటి కొరతను అధిగమించడానికి ఈ నదుల అనుసంధానం ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమిళనాడుతో పాటు పొరుగు రాష్ట్రాల రైతులకు కూడా విస్తృత ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

నాడు కరుణానిధి, జయలలిత..
నేడు విజయ్ తమిళనాడు మార్పులకు అతీతం



ప్రధాని మోదీ తమిళనాడు పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, ముఖ్యమంత్రుల పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాము అమలు చేస్తోన్న మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్.. వంటి కార్యక్రమాలు తమిళనాడులోని తయారీ రంగానికి ఎంతో మేలు చేస్తోన్నాయని, స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తోన్నాయని అన్నారు. తమిళనాడు.. భారత్‌కు ప్రధాన గ్రోత్ ఇంజిన్‌గా ఉంటోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన చెన్నైలో పర్యటిస్తోన్నారు. ఈ ఉదయం ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి విజయ్.. సాదరంగా ఆయనను ఆహ్వానించారు. తన పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ 13,000 కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే అనేక కీలక ప్రాజెక్టులకు ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. వీటిల్లో మెట్రో రైల్ ఫేస్ 2 విస్తరణ, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడం, నగరాభివృద్ధిని వేగవంతం చేయడం వంటివి ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయాలంటే ముందుగా రాష్ట్రాలను ఆర్థికంగా పరిపుష్టం చేయాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగా తమిళనాడు సమగ్ర మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తోన్నామని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు మారుతున్నప్పటికీ.. అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల తమకు ఉన్న ప్రాథమిక సంకల్పం ఎప్పటికీ మారదని పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధి తమ ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఒకటిగా ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. సురక్షిత, వేగవంతమైన ప్రజా రవాణా వ్యవస్థ ప్రజల రోజువారీ జీవన సౌలభ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని వ్యాఖ్యానించారు. ఆధునిక రవాణా మౌలిక వసతుల కల్పన ద్వారా పట్టణ ప్రాంతాల్లో నివసించే పౌరుల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరచవచ్చని, ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను కేంద్రం అందిస్తుందని ఆయన తెలిపారు. తయారీ రంగంలో దేశం సాధిస్తున్న వేగవంతమైన వృద్ధి ఫలితంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని ప్రధాని వివరించారు. దేశ పారిశ్రామిక వృద్ధిలో తమిళనాడు పోషించిన పాత్ర ఎంతో అభినందనీయమని కొనియాడారు. స్థానిక పరిశ్రమలకు ప్రోత్సాహం అందించడం ద్వారా రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తగ్గడమే కాకుండా, సమగ్ర ఆర్థిక వికాసానికి బలమైన బాటలు పడతాయని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ాశ్రీంశీ =ఘుఃగోదావరి-కావేరి నదుల లింకేజీ, హోసూర్- బెంగళూరు మెట్రో రైల్: ప్రధాని మోదీకి విజయ్ ప్రతిపాదనలు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలం నుంచే తమిళనాడుతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందనే విషయాన్ని ప్రధాని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో ఎం కరుణానిధి, జయలలిత వంటి దిగ్గజ నేతలతో భేటీ అయ్యే అవకాశాలు లభించాయని చెప్పారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జయలలిత, పన్నీర్‌సెల్వం, ఎడప్పాడి పళనిస్వామి, ఎంకే స్టాలిన్ వంటి నాయకులతో కలిసి రాష్ట్ర పురోగతి కోసం పనిచేసినట్లు తెలిపారు. ఇప్పుడు విజయ్ వంతు వచ్చిందని వ్యాఖ్యానించారు. =వశీఏఏవఅఁవఁ ఖీశీతీ శీబ ఇక చెన్నై వడపళని వరకూ మెట్రో రైల్: విజయ్ తో కలిసి ప్రారంభించిన ప్రధాని మోదీ: రైలు ప్రయాణం ముఖ్యమంత్రులుగా ఎవరొచ్చినా, నూతన ప్రభుత్వాలు ఏర్పాటైనా సహకార సమాఖ్య భావనకు తాము కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం, మౌలిక వసతులను విస్తరించడం, యువతకు కొత్త అవకాశాలను సృష్టించడం ద్వారా తమిళనాడు సంక్షేమ ప్రయాణాన్ని నిరంతరాయంగా ముందుకు తీసుకెళ్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

రేపు ఏం జరగబోతుంది?

దేశ రాజకీయంలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తూ, ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తోందని కాంగ్రెస్ అగ్రనేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో ప్రస్తుతం 'అప్రకటిత ఎమర్జెన్సీ' పరిస్థితులు దాపురించాయని ఆరోపిస్తూ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను స్వయంగా కలవనున్నట్లు ప్రకటించి సరికొత్త సంచలనానికి తెరతీశారు. సుప్రీంకోర్టు తలుపు తట్టనున్న కాంగ్రెస్ దిగ్గజాలు బెంగళూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడిన మల్లికార్జున ఖర్గే.. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థల ప్రస్తుత దుస్థితిని వివరించేందుకే తాము సీజేఐ అపాయింట్‌మెంట్ కోరినట్లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4:00 నుంచి 5:00 గంటల మధ్య సమయం కేటాయించాల్సిందిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తాము ఇప్పటికే లేఖలు రాశామని తెలిపారు. అత్యున్నత న్యాయస్థానం ముందు తమ విన్నపాన్ని చేతులు జోడించి వినమ్రంగా సమర్పిస్తామని, దేశంలో జరుగుతున్న అక్రమాలను వారి దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు.

రియాద్, దోహా సహా భారత్ నుంచి
గల్ఫ్‌కు వెళ్లే పలు విమానాల రద్దు

సౌదీ అరేబియాపై హౌతీ తిరుగుబాటుదారులు విరుచుకుపడ్డారు. భారీ దాడికి దిగారు. మిస్సైళ్లు, డ్రోన్ దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 12 మందికి పైగా దుర్మరణం పాలయ్యారు. 309 మంది వరకు గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటం వల్ల మరణాల సంఖ్య మరింత పెరగొచ్చనే ఆందోళనలు వ్యక్తమౌతోన్నాయి. ఈ దాడులన్నీ కూడా ప్రధానంగా రాజధాని రియాధ్ లోని కింగ్ ఖాలీద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లక్ష్యంగా సాగాయి. గల్ఫ్ రూట్ పై ప్రభావం.. ఈ తాజా పరిణామాలు భారత్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే పలు విమానాలపై తీవ్రంగా పడింది. భారత్ నుంచి వేర్వేరు దేశాలకు నడిచే విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఒక్క కేరళలోని కోచి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన దాదాపు 10 విమాన సర్వీసులు ఇప్పటికిప్పుడు స్తంభించిపోయాయి. ఈ ఉదయం



బయలుదేరి వెళ్లాల్సిన విమానాలన్నీ నిలిచిపోయాయి. ఈ నెల 13 వరకు మూడు రోజుల పాటు ఆయా సర్వీసుల రద్దయినట్లు ఎయిర్ పోర్ట్ అధికారులు తెలిపారు. భద్రతపై ఆందోళనలు.. యుద్ధ వాతావరణం, వైమానిక మార్గాల్లో నెలకొన్న భద్రతా ఆందోళనలు విమానయాన సంస్థలను కలవరపెడుతున్నాయి. ప్రయాణికులు, విమాన సిబ్బంది రక్షణను దృష్టిలో ఉంచుకుని ఎయిర్‌లైన్స్ ముందస్తుగా ఈ నిర్ణయం తీసుకున్నాయి. సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లోని ప్రధాన నగరాలైన రియాద్, జెడ్డా, దోహా, రస్ అల్ ఖైమా మార్గాల్లో వెళ్లే సర్వీసులపై ఈ ప్రభావం పడింది. గల్ఫ్ లో ఉద్యోగాలు చేసుకునే ప్రవాస భారతీయులు, అత్యవసర పనులపై ప్రయాణమయ్యే వారు ఈ హఠాత్ పరిణామంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ాశ్రీంశీ =ఘుఃసౌదీపై విరుచుకుపడుతున్న హౌతీలు: రియాద్ ఎయిర్‌పోర్ట్ పై భీకర దాడి: 12 మందికి పైగా మృతి వ్యయభారం.. ఈ విమానాల నిలిపివేత వల్ల అకాశ ఎయిర్ అత్యధికంగా ప్రభావితమైంది. మొత్తం రద్దయిన 10 సర్వీసుల్లో అయిదు సర్వీసులు ఈ సంస్థకు చెందినవే. వీటితో పాటు ఫ్లైనాస్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో ఎయిర్‌లైన్స్ కూడా తమ సర్వీసులను రద్దు చేశాయి. పశ్చిమాసియాలో కొన్ని దేశాల గగనతలాల్లో ఆంక్షలు విధించడం, ప్రత్యామ్నాయ మార్గాల వినియోగం వ్యయభారంతో కూడుకున్నది కావడం కూడా ఈ రద్దులకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. రద్దయిన విమానాల్లో.. ఫ్లైనాస్- ఎక్స్ వై 399/ ఎక్స్ వై 400- కోచి- రియాద్ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్- ఐఎక్స్ 476/ ఐఎక్స్ 475- దోహా- కోచి అకాశ ఎయిర్ క్యూపీ 523/ క్యూపీ 550 కోచి- రియాద్/ కోచి- జెడ్డా ఇండిగో 6ఈ 1517 కోచి- రస్ అల్ ఖైమా అకాశ ఎయిర్ క్యూపీ 551/ క్యూపీ 524/ క్యూపీ 523 జెడ్డా- కోచి/ రియాద్- కోచి/ కోచి- రియాద్ అకాశ ఎయిర్ క్యూపీ 524 రియాద్- కోచి విమానాలు ఉన్నాయి.

వేగంగా... క్షేమంగా...

కేబీఆర్ పార్క్ చుట్టూ విజయవంతమైన వన్ వే

మరింత సజావుగా వాహనాలు పరుగెత్తేలా వసతుల కల్పన

చురుగ్గా సాగుతున్న జంక్షన్ల విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం

విలువైన స్థలాల ఇచ్చిన బాలకృష్ణ, శబ్దాలయా స్టూడియో, భవ్య కన్‌స్ట్రక్షన్స్

బండి వేగం అందుకునేలోగా పడిపోయే ట్రాఫిక్ సిగ్నళ్లు.. రహదారులను మించిన కూడళ్లు.. ఆగుతూ.. సాగుతూ.. వాహనదారులకు నిత్యం నరకం కనిపించే కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రయాణం.. ఒక్క ఆలోచనతో మారిపోయింది.. ప్రయోగాత్మకంగా పరిశీలించిన వన్ వే విధానం విజయవంతమైంది. దాంతో దానిని శాశ్వతంగా మార్చివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రయాణం సజావుగా సాగుతోంది. అయితే, ఇందులోనూ చిన్న, చిన్న సమస్యలున్నాయి. వాటన్నింటిని పరిష్కరించి మరింత వేగంగా, క్షేమంగా ట్రాఫిక్ సాగేందుకు జీహెచ్ఎంసీ పనులు చేపడుతోంది..

అయిదు జంక్షన్లు దాటేలా ఎలివేటెడ్ కారిడార్....

ముఫఖం జా కాలేజ్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు 4.3 కిలోమీటర్ల దూరం 6-వరుసల ఎలివేటెడ్ కారిడార్ పనులు జోరుగా సాగుతున్నాయి. పర్యావరణహితంగా, వేగంగా నిర్మించేందుకు రూ.1,090 కోట్లతో స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం: 1ను అనుసంధానించేలా ప్రత్యేక కనెక్టింగ్ ర్యాంప్ నిర్మిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో 5 ప్రధాన ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద ఆగే పని లేకుండా పోతుంది. ఫలితంగా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వాహనాల ఇంధన వినియోగం గణనీయంగా తగ్గి వాహనదారులకు సమయం, డబ్బులు ఆదా అవుతాయి. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో కింద రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ ఎలివేటెడ్ కారిడార్‌కు బదులుగా రహదారుల విస్తరణ చేపడితే ప్రైవేట్ ఆస్తుల సేకరణకే సుమారు రూ.1000 కోట్లు వెచ్చించాల్సి వచ్చేది. ఆ రూపేణా ఖజానాకు మేలు జరగడంతో పాటు ప్రైవేట్ భూములు సేకరించాల్సిన ఇబ్బంది లేకుండా పోయింది.

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా మార్చాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో నగరంలో వివిధ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే కేబీఆర్ పార్క్ పనులను చేపట్టారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న జంక్షన్లు ఎత్తుపల్లాలుగా, కొన్ని చోట్ల పెద్దవిగా, మరికొన్ని చోట్ల చిన్నవిగా ఉన్నాయి. అలాగే ఇతర ప్రాంతాలకు మళ్లే మార్గాలు సక్రమంగా లేవు. ఈ నేపథ్యంలో వాటిని సరైన విధంగా మార్పులు చేస్తున్నారు. ప్రధానంగా అగ్రసేన్ జంక్షన్‌తో పాటు కీలకమైన రోటరీ ఐలాండ్‌ల వద్ద పెద్ద ఎత్తున మార్పులు చేస్తున్నారు. వన్-వే ట్రాఫిక్ సజావుగా సాగడానికి, వాహనాలు సురక్షితంగా ఒక లేన్ నుంచి మరో లేన్‌కు మారడానికి వీలుగా ఫిల్మ్ నగర్ జంక్షన్,రోడ్ నెం. 45 జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఛానలైజేషన్ ఐలాండ్‌లను (ట్రాఫిక్ విభజన దిమ్మెలు) ఏర్పాటు చేస్తున్నారు. కేబీఆర్ పార్క్ సమీపంలోకి చేరిన వాహనాలు ఎక్కడా ఆగకుండా వెళ్లడంతో పాటు ఎటువంటి ఆటంకం లేకుండా ఎడమ వైపునకు (Free Left-Turns) మళ్లేందుకు, అలాగే ముందుకు సాగేందుకు వీలుగా శాశ్వత వన్-వే విధానానికి అనుగుణంగా అన్ని జంక్షన్ ఐలాండ్‌లను పునఃనిర్మిస్తున్నారు.

పాదచారుల భద్రతకు పెద్దపీట...

వన్-వే విధానంతో సహజంగానే వాహనాల వేగం పెరుగుతుంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారుల భద్రతకు పెద్దపీట వేసేందుకు వాహనాలు ఎక్కడ ఎటు వైపు మళ్లుతాయి.. ఎక్కడా క్రాసింగ్ ఉంది.. ఎక్కడ మళ్లాలనే దానిని చూపేలా రహదారులపై గుర్తులు, సైట్ లైన్స్ (Sightlines), క్రాసింగ్ పాయింట్లు, ప్రత్యేక వీవింగ్ జోన్‌ల (Weaving Zones) పనులు చేపడుతున్నారు.

బంజారాహిల్స్/జూబ్లీహిల్స్ నుంచి కేబుల్ బ్రిడ్జ్, దుర్గం చెరువు, నాలెడ్జ్ సిటీ (హైటెక్ సిటీ) వైపు వెళ్లే భారీ రద్దీని

నివారించాలంటే సినీ నటుడు బాలకృష్ణ ఇంటి ముందున రోడ్ నెం: 45 జంక్షన్‌ను బాగా విస్తరించాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు బాలకృష్ణను సంప్రదించగా తాను ఉంటున్న ఇంటి స్థలంలో సుమారు 862.77 చదరపు గజాలు ఇచ్చేందుకుఆయన అంగీకరించారు. ఈ జంక్షన్‌ను విస్తరిస్తే టెక్ పార్కుల వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ జామ్ కాదు. దీంతో ప్రతిరోజూ ప్రధాన ఐటీ హబ్‌లకు వెళ్లే వేలాది మంది ఉద్యోగుల ప్రయాణం సులభమవుతుంది. బాలకృష్ణ కోసం ఎన్టీఆర్ 1982లో ఆ ఇంటిని నిర్మించి ఇచ్చారు. దశాబ్దాలుగా బాలకృష్ణ ఆ ఇంట్లోనే ఉంటున్నారు. నందమూరి కుటుంబ వేడుకలకు ఆ ఇల్లు ఓ వేదిక. ఎన్టీఆర్ తన అభిమానులను ఆ ఇంటి నుంచే కలిసేవారు.. ఇంత అనుబంధం ఉన్నా ప్రజా ప్రయోజనాల కోసం ఆ స్థలాన్ని ఇచ్చేందుకు బాలకృష్ణ అంగీకరించారు. ప్రస్తుత పనులతో బాలకృష్ణ ఇంటిలోని ఓ భవనం సగానికి పైగా పోతోంది. ఆయన సైతం ఇక్కడి నుంచి మారాల్సి వస్తుంది. అయినా పరిహారం తీసుకోకుండానే ఆయన స్థలం ఇచ్చివేశారు. టీడీఆర్ తీసుకునేందుకు అంగీకరించారు.

- కేబీఆఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద శబ్దాలయా స్టూడియో ఉంది. ఈ జంక్షన్ వన్-వేకు ఎంట్రన్స్‌గా ఉంది. పంజాగుట్ట, ఎన్ఎఫ్‌సిఎల్ (NFCL) నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ (JHCP) వైపు వచ్చే భారీ ట్రాఫిక్‌ను ఇది నియంత్రిస్తుంది. ఈ జంక్షన్ వద్ద ఎటువంటి ఆటంకం లేకుండా ఫ్రీ లెఫ్ట్-టర్న్ సాగేందుకు, ఇతర మార్గాల్లోకి మళ్లే వాహనాలు ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకోకుండా సజావుగా సాగిపోవడానికి ఇక్కడ విస్తరణ అవసరం. ఇందుకు శబ్దాలయా స్టూడియోకు చెందిన సుమారు 608 చదరపు గజాలు స్థలం అవసరమైంది. ఆ మొత్తాన్ని పరిహారం తీసుకోకుండా టీడీఆర్‌తోనే శబ్దాలయా యాజమాన్యం ఇచ్చింది. ఈ పనులతో శబ్దాలయా స్టూడియో ప్రహరీతో పూర్తిగా పోవడంతో పాటు ప్రధాన భవనం వరకు పనులు సాగుతున్నాయి.
- జూబ్లీహిల్స్ లోపలి కాలనీలను ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, పశ్చిమ ఐటీ కారిడార్‌తో ఫిల్మ్ నగర్ జంక్షన్ అనుసంధానిస్తుంది. ఈ జంక్షన్ వద్ద రోడ్డు మార్పులతో వాహనాల లేన్ మార్పులకు ఎటువంటి ఆటంకాలు ఉండవు. దీంతో బ్యాంకింగ్, టెక్ హబ్‌ల వైపు వెళ్లే కార్పొరేట్ రవాణా వాహనాలు, ప్రైవేట్ వాహనాలు ఎక్కడా ఆగకుండా నిరంతరాయంగా వెళ్లడానికి వీలవుతుంది. ఇక్కడ పనుల కోసం భవ్య కన్‌స్ట్రక్షన్ కు సుమారు 341.33 చదరపు గజాలు స్థలాన్ని పరిహారం తీసుకోకుండా టీడీఆర్‌తో అప్పగించింది. ఈ పనుల్లో భవ్య కన్ స్ట్రక్షన్‌కు చెందిన భవనం పూర్తిగా పోతోంది.

పెద్ద మనస్సు చాటుకున్న బాలకృష్ణ, శబ్దాలయ, భవ్య కన్‌స్ట్రక్షన్స్

కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే సజావుగా సాగాలంటే పలు చోట్ల విలువైన ఆస్తులు సేకరించాల్సి వచ్చింది. అందులో ప్రధానమైనవి సినీ నటుడు బాలకృష్ణ ఇంటి స్థలం, శబ్దాలయా స్టూడియో, భవ్య కన్‌స్ట్రక్షన్ భవనం... అయితే, తమ స్థలాలు ఇచ్చేందుకు వారంతా ముందుకొచ్చారు. ఇక్కడ గజం రూ.4 నుంచి రూ.5 లక్షలు పలుకుతోంది. భారీ ధరతో పాటు నగరం నడిబొడ్డున ఉన్న స్థలాలు కావడంతో నివాసం, వ్యాపారానికి ఇవి ఎంతో కీలకమైనవి.

సమృద్ధి భారత్..

(మొదటిపేజీ తరువాయి)

సీఎం విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రధాని ప్రయాణం

అంతకుముందు 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. చెన్నై విమానాశ్రయంలో దిగిన ప్రధానికి గవర్నర్ అర్లేకర్, సీఎం విజయ్ ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ వెలుపల ప్రధాని కాసేపు రోడ్‌షో నిర్వహించి కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం 4వేల 900 కోట్లతో నిర్మితమైన చెన్నై మెట్రో ఫేజ్-2లోని పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. స్వయంగా యుపిఐ చెల్లింపు చేసి టికెట్ తీసుకున్న మోదీ, పోరూర్ నుంచి పూనమల్లి బైపాస్ స్టేషన్ వరకు విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు.

ఐఐటీ మద్రాస్‌లో బ్రెయిన్ సెంటర్ జాతికి అంకితం

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 3వేల 700 కోట్లతో ఎన్ హెచ్-744, ఎన్ హెచ్ -83 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. పలు రైల్వే లైన్లు సహా పోర్టుల సామర్థ్యాలను పెంచే ప్రాజెక్టులు, అలాగే ఆధునికీకరించిన 5 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించారు. ఐఐటీ మద్రాస్‌లో సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని, మనిషి మెదడుకు సంబంధించిన 3డీ అట్లాస్ మిషన్‌ను, స్ట్రోక్ అట్లాస్‌ను ఆవిష్కరించారు. చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ స్వర్ణోత్సవ వేడుకల్లోనూ ప్రధాని పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో బీజేపీ మళ్ళీ అధికారంలోకి రావాలనుకుంటుంది

- ఈసీ, ఈడీ, సీబీఐలను అడ్డుపెట్టుకుని మోదీ పాలన కొనసాగుతుంది
- రెండేళ్లలో ఎస్ఎల్ బిసి పూర్తి చేసి నల్లగొండ దాహార్తి తీరుస్తాం
- నల్గొండ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, వెలుతురు అక్టోబర్ 11:

పేదవాడికి సొంతింటి కల నెరవేర్చి, గుడిసె లేని తెలంగాణను నిర్మించడమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ నియోజకవర్గంలో 74కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివచ్చి మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం తెల్లకంటి గూడెం నుండి శేరిలింగోటం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధి పనుల వివరాలు

1.41 కోట్ల రూపాయలతో కనగల్ మండలంలోని తెల్లకంటిగూడెం నుండి తొరగల్లు, జంగమాయి గూడెం మీదుగా ముషంపల్లి గ్రామం వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

2.33 కోట్ల రూపాయలతో నల్గొండ-నిడమానూరు రోడ్డు నుండి చెట్ల చెన్నారం, చిన్నమాదారం మరియు తంగెళ్లవారిగూడెం మీదుగా ముషంపల్లి గ్రామం వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు.

గుడిసెలు లేని తెలంగాణే ఇందిరమ్మ రాజ్య లక్ష్యం

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమ పాలన అని,పేదవాడికి సొంతింటి కల నెరవేర్చి, గుడిసె లేని తెలంగాణను నిర్మించడమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఇళ్ల మంజూరులో ఎల్-1 ఎల్-3లో సాంకేతిక సమస్యలున్నా అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెలంగాణ రోడ్లు దేశానికి రోల్ మోడల్‌గా చేస్తాను

ఆర్ అండ్ బి శాఖ మంత్రిగా తెలంగాణ రోడ్లు దేశానికి రోల్ మోడల్ గా చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20వేల కోట్లతో హ్యామ్ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.నల్లగొండ జిల్లాలో 1600 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూ.900 కోట్లతో నల్గొండ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామని, రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, రైస్ మిల్లులు ఏర్పాటవుతాయని, రవాణా సౌకర్యాలు మెరుగై, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. భూముల విలువ కూడా పెరుగుతాయన్నారు. జిల్లాలోని ప్రతి గూడెం, గ్రామానికి డబుల్ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని స్పష్టం చేశారు.

ఈసీ,ఈడీ, సీబీఐలను అడ్డుపెట్టుకుని మోదీ పాలన కొనసాగుతుంది

బీజేపీ దొంగ ఓట్లతో మళ్ళీ అధికారంలోకి రావడానికి యత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. దేశంలో దళితులు, ముస్లింలు, క్రిస్టియన్లకు చెందిన దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించారని, కొన్ని రాష్ట్రాల్లో దొంగ ఓట్లతోనే బీజేపీ పీఠమెక్కిందని విమర్శించారు.ప్రధాని మోదీ ఈసీ, ఈడీ, సీబీఐలను అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తున్నారని, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు రాహుల్ గాంధీ పోరాటం కొనసాగుతుందని, తాను కూడా ఆ పోరాటంలో భాగస్వామి కావడం కోసం ఢిల్లీ వెళ్తున్నానని తెలిపారు.వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని ప్రజలు భావిస్తున్నారని,కాంగ్రెస్ లక్ష్యం కూడ అదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమలత,జీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

- పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్
- డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌పై ఈగల్, హైదరాబాద్ పోలీసులు సంయుక్త ఆపరేషన్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11

గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు అనుమానిస్తున్న నెట్‌వర్క్‌పై తెలంగాణ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈగల్ బృందం, హైదరాబాద్ సిటీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, పరారీలో ఉన్న నిందితుడు కస్టోడియో ఫెర్నాండెస్ అలియాస్ క్రిస్టీని గోవాలో అరెస్టు చేశారు. పంజాగుట్ట డ్రగ్స్ కేసు విచారణలో గోవాతో సంబంధాలు బయటపడటంతో పోలీసులు ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. నిందితుడు గోవాలో ఉన్నట్లు సమాచారం అందడంతో పక్కా ప్రణాళిక ప్రకారం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

పంజాగుట్ట కేసుతో వెలుగులోకి గోవా లింకులు

గతంలో పంజాగుట్ట పోలీసులు నిర్వహించిన దర్యాప్తులో 13 గ్రాముల ఎండీఎంఏ, 7 గ్రాముల చరస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా డ్రగ్స్ సరఫరా వెనక ఉన్న వ్యక్తులు, వారి మధ్య సంబంధాలు, నగదు లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్నారా? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

తెలంగాణకు చెందిన 25 మందికిపైగా వ్యక్తుల వివరాల సేకరణ

నిందితుడి మొబైల్ ఫోన్‌లో హైదరాబాద్‌కు చెందిన పలువురి పేర్లు, ఫోన్ నంబర్లను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న తెలంగాణకు చెందిన 25 మందికి పైగా వ్యక్తుల వివరాలను సేకరించారు. అయితే జాబితాలో పేర్లు ఉన్నంత మాత్రాన వారంతా నేరానికి పాల్పడినట్లు భావించలేమని, వారి పాత్రపై దర్యాప్తు ద్వారా స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

మొబైల్ డేటా, బ్యాంకు లావాదేవీలపై నిఘా

నిందితుడి మొబైల్ ఫోన్ డేటా, బ్యాంకు లావాదేవీలను విశ్లేషిస్తూ పోలీసులు కీలక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు వచ్చి డ్రగ్స్ సరఫరా చేసి, నగదు వసూలు చేసినట్లు అనుమానిస్తున్న వ్యక్తులను కూడా విచారిస్తున్నారు. డ్రగ్స్ కొనుగోలుదారులు, సరఫరాదారుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, ఆర్థిక లావాదేవీలు ఈ కేసులో కీలకంగా మారే అవకాశం ఉంది.

ఇతర నగరాలకూ విస్తరించిన దర్యాప్తు

గోవాతో పాటు బెంగళూరు, ముంబయి, దిల్లీ తదితర నగరాల్లోని అనుమానిత సరఫరాదారులు, కొనుగోలుదారుల వివరాలపైనా అధికారులు నిఘా పెట్టారు. ఈ నెట్‌వర్క్ వెనక ఉన్న ప్రధాన వ్యక్తులను గుర్తించడం, డ్రగ్స్ సరఫరా మార్గాలను ఛేదించడం పోలీసుల లక్ష్యంగా ఉంది. రానున్న రోజుల్లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు ఇలాంటి అక్రమ సరఫరా వ్యవస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బోటు బోల్తా పడి.. 109 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

మిషన్ అలెగ్జాండర్ కోయిసాక్ అన్నారు.

గతంలోనూ భారీగా ప్రాణనష్టం

ఐఓఎం గణాంకాల ప్రకారం, 2025లో ఇదే మార్గంలో 900 మందికిపైగా వలసదారులు మరణించడం లేదా అదృశ్యం అయ్యారు. అయినప్పటికీ వలస వెళ్లేవారి సంఖ్య 18 శాతం మేర పెరిగిందని ఐఓఎం తెలిపింది. 2026 మార్చిలో జరిగిన ఇలాంటి మరో ఘటనలో 9 మంది మరణించగా, 45 మంది కనిపించకుండా పోయారు. కాగా గతేడాది ఇటలీ సముద్ర తీరంలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. లాంపేడుసా ద్వీపంలో ఓ పడవ బోల్తా పడి 20 మంది వలసదారులు మృతిచెందారు. మరో 12 మందికిపైగా గల్లంతయ్యారు. లిబియా నుంచి బయలుదేరిన పడవలో సుమారు 92 నుంచి 97 మంది వలసదారులు ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో బయటపడ్డ సుమారు 60 మందిని ఇటాలియన్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది రక్షించారు. ఈ ఘటనపై యూఎన్హెచ్‌సీఆర్ విచారం వ్యక్తం చేసింది. 2023లో టునీషియాలోనూ ఇలాంటి ఘోర ప్రమాదం జరిగింది. ఓ బోటు ప్రమాదవశాత్తు సముద్రంలో మునగడం వల్ల 29 మంది వలసదారులు మరణించారు. మరో 67 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు.

శివాజీ మహారాజ్ మత నాయకుడు కాదు.. ప్రజా నాయకుడు

- మహనీయుల చరిత్రను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు
- జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు

సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 11:

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఒక మతానికి పరిమితం చేయడం సరికాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, రాజ్య భద్రతకు ప్రాధాన్యమిచ్చిన గొప్ప ప్రజా నాయకుడు శివాజీ అని పేర్కొన్నారు.

శివాజీ చరిత్రను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం వక్రీకరించి ప్రచారం చేస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. శివాజీ పాలనలో హిందువులతో పాటు ముస్లింలు కూడా ఉన్నారని, దౌలత్ ఖాన్, ముల్లా హైదర్ వంటి ముస్లిం అధికారులు ఉన్నత స్థాయిలో పనిచేశారని ఆయన తెలిపారు. కులమతాలకు అతీతంగా తన రాజ్యంలోని ప్రజల బాగోగుల కోసం శివాజీ కృషి చేశారని అన్నారు. గొప్ప వీరుడైన శివాజీ ప్రజల సంక్షేమం పట్ల నిబద్ధతతో పాలన సాగించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఒక రాజుగా ముస్లిం పాలకులతో యుద్ధాలు చేశారే తప్ప, ముస్లిం ప్రజలపై దాడులు చేయలేదని ఆయన వ్యాఖ్యానించారు.

- జెండా ఊపి ప్రారంభించిన మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్
- మహిళల భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: మంత్రి జూపల్లి
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ప్రయాణ స్వేచ్ఛ
- మహిళల భద్రత, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి పొన్నం ప్రభాకర్
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

జలవిహార్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు.. 'షీ పవర్' మహిళా భద్రత బైక్ ర్యాలీ

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:

మహిళల భద్రత, ఆత్మగౌరవం, సాధికారతపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని షీ పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మహిళా భద్రత బైక్ ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని పీవీ మార్గ్ వద్ద జలవిహార్ నుంచి ట్యాంక్‌బండ్ చుట్టూ సాగిన ఈ ర్యాలీని మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు.మహిళల భద్రత, రహదారి ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల హక్కులపై అవగాహన కల్పిస్తూ మహిళా సూపర్ బైకర్లు, స్కూటీ రైడర్లు, సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మహిళల భద్రత, హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. మహిళలు తమ కలలను సాకారం చేసుకునేందుకు, విద్యను అభ్యసించేందుకు, అన్ని రంగాల్లో ఎదిగేందుకు సమాన అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. మహిళల భద్రత అనేది మహిళలకు మాత్రమే సంబంధించిన అంశం కాదని, ప్రభుత్వం, పోలీసు వ్యవస్థతో పాటు కుటుంబాలు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, సమాజం కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

తెలంగాణ పర్యాటక రంగాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు షీ పవర్ ఫౌండేషన్, మహిళా బైకర్లు భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళల భద్రత, సాధికారత కోసం కృషి చేస్తున్న షీ పవర్ ఫౌండేషన్ నిర్వాహకులను మంత్రులు అభినందించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహిళల భద్రత, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని గుర్తుచేశారు. మహిళలు నిర్భయంగా ప్రయాణించేలా ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ తారిక్ అన్సారీ, మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతి రెడ్డి, డీసీపీ శిల్పవల్లి, సీబీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డా. నరసింహులు, షీ పవర్ ఫౌండేషన్ ఛైర్మన్ మనీష్, ఫౌండేషన్ నిర్వాహకులు అపూర్వ శ్రీవాస్తవ, అల్పనా శరత్, మహిళా సూపర్ బైకర్లు, స్కూటీ రైడర్లు, సైక్లిస్టులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

భారత్-జపాన్ స్నేహ బంధం దీర్ఘకాలికం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- హైదరాబాద్‌లో జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమం
- హిరోషిమా ప్రిఫెక్చర్ తో సహకారానికి తెలంగాణలో అపార అవకాశాలు
- సైబర్ గార్డెన్స్ లో ఘనంగా జపాన్ ఫెస్టివల్
- పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11:

భారతదేశం, జపాన్ దేశాల మధ్య ఎన్నో ఏళ్ల నుంచి మంచి స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రెండు దేశాల మధ్య పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం ఆధారంగా దీర్ఘకాలిక స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.

సాంకేతికత, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, విద్య, సాంస్కృతిక మార్పిడి వంటి రంగాల్లో భారత్, జపాన్ మధ్య సంబంధాలు మరింత అభివృద్ధి చెందాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, పారిశ్రామిక అభివృద్ధి రంగాల్లో ముందు వరుసలో ఉందని, ముఖ్యంగా పెట్టుబడులు, ఆధునిక తయారీ, సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో హిరోషిమా ప్రిఫెక్చర్‌తో సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని వివరించారు. హిరోషిమా శాంతికి, స్థిరత్వానికి, మానవ సంకల్పానికి ప్రతీకగా గౌరవించబడుతోందన్నారు. భారత్-జపాన్ దేశాల మధ్య ఉన్న స్నేహ బంధాన్ని మనం గొప్పగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మరింత సహకారం, ప్రజల మధ్య సంబంధాలతో భారత్, జపాన్ మధ్య బంధాలను ఇంకా బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు.

హైదరాబాద్-జపాన్‌లోని మియోషి నగరాల మధ్య ఏర్పడిన సిస్టర్ సిటీ సంబంధాలు 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జపాన్‌తో తెలంగాణ బంధాన్ని మరింత బలోపేతం చేస్తామని శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామికాభివృద్ధి, పరిశోధన, ఉపాధి రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య సహకారాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

భారత్, జపాన్ దేశాల మధ్య పరస్పర విశ్వాసం, గౌరవం, సాంకేతిక సహకారం, ప్రజల మధ్య సత్సంబంధాలే బలమైన భాగస్వామ్యానికి పునాదులని మంత్రి అన్నారు. హైదరాబాద్-మియోషి మధ్య రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహబంధం నగరాలకే పరిమితం కాకుండా ప్రజలు, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన సంబంధంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ వేడుకను నిర్వహించిన నా రా జపాన్ హబ్, జపనీస్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్, ఇతర నిర్వాహకులను మంత్రి అభినందించారు.

'మహాశక్తి' ఆలయంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 11:

కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో విజయ దశమి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. ఆలయాన్ని పూలతో సుందరంగా ముస్తాబు చేశారు. నవరాత్రుల తొలిరోజున అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి (శైలపుత్రి) రూపంలో సూర్యప్రభ అలకంరణ చేశారు. బాలా త్రిపుర సుందరీ దేవి అవతారం శక్తి, జ్ఞానం, ధైర్యం, నిర్మలత్వానికి ప్రతీక. శరన్నవరాత్రుల ఆరంభంలో ఈ బాలరూపాన్ని ఆరాధించడం ద్వారా దైవభక్తితోపాటు మంచి విలువలను జీవితంలో ఆచరించాలనేది సందేశం. బాలా త్రిపుర సుందరీ దేవి ఆరాధన మనిషిలోని నిర్మలత్వాన్ని మేల్కొలిపి, జ్ఞానమార్గంలో నడిపిస్తుందని భక్తుల విశ్వాసం. దుర్గమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమివ్వడం భక్తులకు కనువిందు చేసింది. తొలిరోజు వేలాది భక్తులతో శ్రీ మహాశక్తి దేవాలయం కిటకిటలాడింది. ఉదయం 11 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న వేలాది మంది భక్తులు, ముఖ్యంగా భవానీ దీక్షాపరులకు ఆలయ నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించారు. నవరాత్రులు ముగిసే వరకు భోజనం, అల్పాహారం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మరోవైపు ఈరోజు నుండి నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు సాయంత్రం బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ 'శ్రీ భాగవత వైభవం'పై ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్న ఆలయ నిర్వాహకులు తెలిపారు. అట్లాగే ప్రతిరోజు రాత్రి 9 గంటలకు అధ్యాత్మిక భావన, భక్తి పాటలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా "దాండియా"కార్యక్రమం నిర్వహించనున్నారు.

క్యాన్సర్‌పై సమష్టి పోరాటంతోనే విజయం సాధ్యం

- మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్
- గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో క్యాన్సర్ రన్
- భారీ సంఖ్యలో పాల్గొన్న యువతీ, యువకులు
- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన మంత్రులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11

క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీ, క్యాన్సర్ రన్‌లో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు ఈ రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసం గ్రేస్ ఫౌండేషన్ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం స్ఫూర్తిదాయకమని మంత్రి వాకిటి అన్నారు. క్యాన్సర్‌పై అవగాహనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్యాన్సర్‌పై పోరాటం ఒక వ్యక్తి లేదా ఒక సంస్థ బాధ్యత మాత్రమే కాదని, సమాజమంతా కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. భారత దేశం నుంచి క్యాన్సర్ మహమ్మారిని తరిమివేసే మహా యజ్ఞంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

క్యాన్సర్ మహమ్మారిని పార ద్రోలేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రభు త్వంతో పాటు ప్రజలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పొన్నం పిలుపునిచ్చారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com